సంపుటి : 7

సంచిక : 3

మా పాఠకులకు
నూతన సంవత్సర
శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్

(సచిత్ర మాస పత్రిక)

జనవరి, 1963

పుష్య - మాఘ 1884 శకం

ఇండియా - చైనా సరిహద్దు

సరిహద్దు పరిస్థితిని సూచించే రెండు పటములు
ఈ సంచిక చివర ఉన్నవి.

సంవత్సర చందా :
3 రూపాయలు

విడి ప్రతి వెల :
25 నయాపైసలు

విషయసూచిక

అట్ట వెనుక బొమ్మ: రక్షణకై శిక్షణ. హైదరాబాదులో 18–11–62 న తేదీన ప్రాంతీయ సైనిక దినోత్సవాలు జరిగినప్పటి దృశ్యం

(గత కొంతకాలంగా 'ఆంధ్రప్రదేశ్' గెటప్ లోను, శీర్షికల విషయంలోను అనేక విధాలుగా అభివృద్ధి తేవడానికి మేము చేస్తున్న ప్రయత్నాన్ని పాఠకులు గమనించి వుంటారనడంలో సందేహం లేదు. ఈ నెలనుంచి ప్రతి నెలా ఈ పత్రికలో పాఠకులకు ఒక లేఖ వ్రాయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారని తెలియజేయడానికి మేము సంతోషిస్తున్నాం. ప్రభుత్వాధినేతనుంచి వచ్చే ఈ లేఖ సహజంగా ముఖ్యమైన నిర్ణయాలతో పాటు, అనేక విషయాలపై ఉన్నతస్థాయిలో జరిగే ఆలోచనలనుగూర్చి విశ్వసనీయమైన సమాచారాన్ని కూడా సూచనప్రాయంగా వెల్లడిస్తుంది.

— ఎడిటర్)

ముఖ్యమంత్రి లేఖ

ప్రియమైన చదువరీ!

మన దేశసరిహద్దులపై దురాక్రమణ జరిగిన ఫలితంగా గత రెండు నెలలకు పైగా మనం అందరం విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. మన మామూలు కార్యకలాపాలను కొనసాగించుకుంటూనే ఈ విషయంపై ఆలోచనలను కేంద్రీకరింపజేశాం. శ్రద్ధాసక్తులు కనబరిచాం. ఇది సహజమే. ఎందుకంటే చైనీయుల దాడి మనందరికీ విస్మయం కలిగించింది. మన ప్రధానమంత్రి అన్నట్లు స్వాతంత్ర్యానంతరం భారతదేశం బలవంతంగా ఎదుర్కొనాల్సి వచ్చిన ప్రప్రథమ యుద్ధం ఇది. కనుక మనమందరం దీని విషయంలో ఏమి చేయాలో శీఘ్రగతిని నిర్ణయించుకోవలసి వచ్చింది. దేశ స్వాతంత్ర్య పరిరక్షణకై ఎవరి పాత్రను వారు త్వరితగతిని నిర్వహించవలసి వచ్చింది.

చైనీయుల దురాక్రమణ విస్మయం కలిగించినప్పటికీ ప్రజలు వెంటనే సమయోచితమైన ధైర్య స్థైర్యాలు, త్యాగం ప్రదర్శించారనడంలో సందేహంలేదు. ప్రతి ఒక్కరూ తాము ఇవ్వగలిగింది ఇచ్చారు. దేశం నాలుగు చెరగుల నుంచీ ప్రజలు ధన, కనకపు రాసులు కురిపించారు. అనేక రూపాల్లో విరాళాలు అందజేశారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన దాతల సంఖ్య ఎంత అధికంగా వుందంటే వారి రక్తం స్వీకరించడానికి ఆసుపత్రులకు ఊపిరి సలుపుకోలేనంత పనైంది. జాతీయ రక్షణనిధి కేంద్రపద్దుకు, నెలా పదిహేను రోజుల స్వల్ప వ్యవధిలోనే 19 కోట్ల రూపాయిలకుపైగా వసూలైంది. ఇదిగాక వివిధ రాష్ట్రాలలో మరో పది కోట్ల రూపాయిల వరకు సమకూరి వుంటాయి. ఇంతేకాక దేశం నలుమూలల నుంచీ బంగారం ధారావాహికంగా లభిస్తున్నది.

మన రాష్ట్రంలో పురుషులు, స్త్రీలు, బాల బాలిక లందరూ కూడా ఈ విషయంలో ఎంతో ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. ప్రతి గ్రామం, ప్రతి పట్టణంనుంచీ భూరి విరాళాలు అందుతున్నాయి. ఆంధ్రులు ఉద్రేకపరులనీ, కర్తవ్యపాలనకై వచ్చే ఎట్టి పిలుపునైనా వారు మొదట అమోఘమైన ఉత్సాహంతో అందుకుంటారనీ తరచుగా అంటారు. అయితే మనం చూపే ఈ ఉత్సాహం కేవలం ఆదిలోనే కాకుండా ఆసాంతం కొనసాగాలి. చైనీయులు మన భూభాగాల నుంచి ఉపసంహరించుకోవచ్చు కొందరు చెబుతున్నట్లు మళ్లీ వారు మన జోలికిరాకపోవచ్చుకూడా. అయినప్పటికీ మనం అప్రమత్తులమై వుండాలి. జాతీయ రక్షణ కృషిని పటిష్ఠం చేయడానికి సామూహికంగా మనం చేసే ప్రయత్నాలను కొనసాగించాలి. మళ్ళీ మనం విస్మయం చెందకుండా చూచుకోవాలి. మన దేశంపై ఏ శత్రువైనాకానీ తన దురాశాపూరితమైన దృష్టిని సారించడానికి పూర్వం ఒకటికి వందసార్లు యోచించుకునేట్లుగా మన దేశ రక్షణ బలాన్ని దృఢతరం చేసుకోవాలి. కనుక ప్రజలు జాతీయ శక్తిని పటిష్ఠం చేయడానికై తమ కృషిని కొనసాగించడమే కాకుండా ఇతోధికం చేయాలి.

తక్షణ చర్యగా రొక్కం, బంగారం రూపాల్లో విరాళాలివ్వడమే కాక ఆంధ్రప్రదేశ్ వ్యవసాయోత్పత్తిని పెంపొందించడంద్వారా శాశ్వతమైన ప్రముఖపాత్ర వహించవలసివుంది. ఏ దేశపు శక్తిసామర్థ్యాలు అయినా కేవలం దాని ఆయుధ సంపదపైమాత్రమే ఆధారపడి వుండవు. దాని పారిశ్రామిక, వ్యవసాయక సంపదలు ఇంతకంటే చాలా ముఖ్యమైనవి. శాంతి సమయంలోకంటే యుద్ధకాలంలో మనం ఆహార విషయకంగా స్వయం సమృద్ధిని సాధించడం తప్పనిసరి అవుతుంది. మన సాధన సంపత్తిలో ఎంతమాత్రంకూడా ఇట్టిపరిస్థితిలో ఆహార

పదార్థాల దిగుమతులకై వెచ్చించ లేకపోవడమే దీనికికారణం. కనుక ఆహార పదార్థాలను ముఖ్యమైన యుద్ధ సామగ్రిగానే పరిగణించాలి. వ్యవసాయ క్షేత్రంలోని రైతునుకూడా యుద్ధరంగంలోని జవానువలెనే స్వాతంత్ర్య పరిరక్షణకై పోరాడే సైనికునిగా తలంచాలి. మన రైతాంగం అంతా ఈ విషయాన్ని గుర్తించి, ప్రణాళిక క్రింద ప్రభుత్వం అమలుపరిచే వివిధ సహాయక పథకాలనుంచి పూర్తి ప్రయోజనంపొంది తమ అధికాహారోత్పత్తి కృషిని ద్విగుణీకృతం చేయాలి.

నేటి జాతీయ విపత్కర పరిస్థితిలో దేశంలో ఎల్లెడలా అపారమైన చైతన్యం కానవస్తున్నది. నిజానికి ఏ తరగతి ప్రజలనుకూడా నేడు వారి కర్తవ్యాన్ని నిర్వర్తించవలసిందిగా ఉద్బోధించవలసిన ఆవశ్యకతలేదు. పారిశ్రామిక వేత్తలు, వర్తకులు ప్రస్తుత పరిస్థితిని తమ స్వప్రయోజనానికి వినియోగించుకోడానికి ప్రయత్నించబోమనీ ధరలను అదుపులోపెట్టడానికి తోడ్పడతామని హామీ ఇవ్వడమేకాక జాతీయ రక్షణావసరాల దృష్ట్యా కొత్తపన్నులను ప్రవేశపెట్టడం సమంజసమనికూడా తెలిపారు. అయినప్పటికీ అక్రమలాభాలు గడించేవారూ, కృత్రిమంగా సరుకులకొరతను సృష్టించేవారూ ఎక్కడైనా వుంటే కఠినచర్యలద్వారా వారి ఆటలు కట్టించడానికి భారతరక్షణ నియమావళిక్రింద ప్రభుత్వానికి అధికారంవుంది. కేవలం ఒక రాజకీయ పక్షానికిచెందిన కొందరు నాయకుల విషయంలో తప్ప మన రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ తరగతి ప్రజలవిషయంలో కూడా ఇలాంటి కఠినచర్యలు గైకొనాల్సిన అవసరం కలగనందుకు నాకు సంతోషంగావుంది. కమ్యూనిష్టులలో ఇప్పుడు విభేదాలు వచ్చాయి. వీరిలో ఒక వర్గంవారు, దేశస్వాతంత్ర్య పరిరక్షణకై ఇతర ప్రజలతో కలిసిపోవడానికి మనస్పూర్తిగా తమ అభీష్టాన్ని ఇంకా వెల్లడించవలసివుంది. దేశంమనుగడకే ముప్పుఏర్పడిన తరుణంలో ఈ విషయంలో సందిగ్ధావస్థలోనున్న వారినుంచి ఎట్టి హాని తెచ్చిపెట్టుకోడానికీ వీలులేదు. వీరుకూడా ప్రస్తుతపు తమ సంశయాలను విడనాడి వివేచనామార్గాన్ని అనుసరిస్తారని విశ్వసిస్తున్నాను.

సరిహద్దు ఉపద్రవం ఏర్పడడానికి పూర్వంనుంచే, మనం రెండు ముఖ్యవిషయాలనుగురించి యోచిస్తున్నాము. వీటిలో ఒకటి నదీ జలాలపై గుల్హాతీ కమీషను సమర్పించిన నివేదిక, రెండవది భూమిశిస్తు రేట్లను పెంచడానికి ప్రభుత్వంచేసిన ప్రతిపాదన. చైనీయుల దురాక్రమణఫలితంగా ప్రణాళికను కొంత పునఃపరిశీలించవలసిన అవసరం కలిగింది. ఆయా అంశాలకు ఇచ్చిన ప్రాధాన్యతలలో తప్పనిసరిగానే కొన్ని మార్పులు జరుగుతాయి. అయితే ఉత్పత్తులను పెంచడానికీ, దేశాన్ని పటిష్ఠంచేయడానికీ ఉద్దేశించిన ప్రాజెక్టులు, పథకాలకు దీనివల్ల అంతరాయం వుండదు. నిజానికి ప్రస్తుత క్లిష్టతరుణంలో ఇలాంటి ప్రాజెక్టులను శీఘ్రగతిని అమలుపరచాలి. వాటి అమలుకు ఎట్టి ప్రతిబంధకాలూ లేకుండా చేయాలి. కనుకనే, మన రాష్ట్రంలోనూ, మైసూరు, మహారాష్ట్రలలోనూ తృతీయ ప్రణాళికక్రింద తలపెట్టిన వివిధ ప్రాజెక్టులను, గుల్హాతీ నివేదిక పరిశీలనను మరోనాటికి వాయిదావేసి త్వరితంగా మంజూరు చేయాలనీ, వాటిపనుల నిర్వహణకు అనుమతించాలనీ నేను స్పష్టంగా ప్రకటించాను.

భూమిశిస్తు పెంపుదల ప్రతిపాదన ప్రస్తుత అవాంతర పరిస్థితి దృష్ట్యా జరిగిందికాదు. శిస్తుపెంపుదలవల్ల లభించే అధికాదాయం మన అభివృద్ధి పథకాలకు వినియోగించబడుతుంది కాబట్టి ఈ ప్రతిపాదనకు ప్రస్తుత పరిస్థితితో సంబంధంలేదు. ఏమైనప్పటికీ శాసనసభల ఆమోదంపొందిన ఈ బిల్లుపట్ల నిరసనగా తాము ప్రారంభించదలచిన ఉద్యమాన్ని ప్రతిపక్షాలవారు జాతీయ అవాంతర పరిస్థితిదృష్ట్యా విరమించుకున్నందుకు నేను ఆనందిస్తున్నాను. మామటుకు మేము ఈ బిల్లుకు సవరణలు ప్రవేశపెట్టాము. వీటివల్ల కొన్ని సందర్భాలలో చెప్పుకోదగినంత సహాయం చేకూరుతుంది. దీనిని అమలు పరచడంలో అందరూ సహకరించాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

జై హింద్ !

భవదీయుడు

నీలం సంజీవరెడ్డి

రక్తతిలకము

జి. జాషువా

నలమందున్ దిని కప్పల న్మెసవి చీనా సర్పముల్, భారతీ
యులపోటుం జవిచూచి యుస్సురని అయుశ్శక్తులూటాడగా
బిలముల్ సొచ్చెనటంచు, నాయుధములన్ పీడంగరాదా విషా
హులకున్ నాల్కలు రెండుగావు పదివేలుండున్ ప్రచండంబులై ॥

మన మువ్వన్నెపతాక శీతగిరిసీమన్ వెల్గునందాక, యు
క్కున సృష్టించిన దొమ్మలుండిన నెదుర్కో డెవ్వడీ హైందవం
బును, చీనాభుజగంబు దగ్ధమయిపోవున్ యుద్ధయజ్ఞంబులో
అనుమానింపక లెమ్ము భారత కుమారా! వీరభద్రుండవై ॥

వేలున్ లక్షలొసంగినాడనని తృప్తిన్ జెందినంగాదు, ప్రా
ణాలర్పించి యఖండభారత దిగంతక్రాంత సత్కీర్తి క
న్యాలావణ్య కచంబునందు భవదీయత్యాగ సౌరభ్య పుం
జాలన్ నిల్ప ప్రతిజ్ఞ గైకొనుము, సంపూర్ణ ప్రతాపాగ్నివై ॥

భగవద్గీతను కర్మయోగబలమభ్యస్తంబు గావించి, పు
ష్టిగభోంచేసి సుఖించుకాలము గతించెన్ వీరయోధుండవై
పగవానిన్ దెగటార్ప ఖడ్గము ధరింపన్ లెమ్ము, పార్థుండవై
భగవంతుండు రథంబుదోలి జయమబ్బన్ జేయు తథ్యంబుగన్ ॥

చీనాపిశాచంబు చిందులాడిననేల నలతి పచ్చనిగడ్డి మొలవలేదు
చౌవెనులై తనుచ్ఛాయ సోకినచోట బుడుతపాపడు పాలు గుడువలేదు
మండూక భక్షణోద్దండు లుండెడుచోట సత్యదేవతకు భోజనములేదు
వింత జంఘిష్కాను విహరించు పొలములో దైవంబు తలవాల్చు తలములేదు
పదియునాలుగు లోకాల పరమశాంతి
పుంజమగు బాపుజీజన్మమున నహింస
నభ్యసించిన మన స్వరాజ్యంబునందు
వచ్చి నరహంతకులనీడ, పనికిరాదు॥

సంవత్సరంలో రు. 65 కోట్లు కేటాయించినా, దానిని దాదాపు రు. 50.00 కోట్లకు తగ్గించాల్సి వచ్చింది. ఐతే ఇది ప్రస్తుత (1962-63) సంవత్సరానికి కేటాయించిన మొత్తమే అవుతుంది. పరిమితమైన ఈ కేటాయింపులోనే వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాముఖ్యత గల చిన్నతరహా నీటి వసరుల పథకాలకు ప్రస్తుత సంవత్సరంలో కేటాయించిన రు. 4.64 కోట్లను మరుసటి సంవత్సరానికి దాదాపు రు. 7.00 కోట్లకు హెచ్చించడం జరిగింది. మూడవ ప్రణాళికలో చిన్నతరహా నీటి వసరుల పథకాలకు కేటాయించిన రు. 18.00 కోట్ల మొత్తాన్ని, రు. 28.00 కోట్లకు పెంచారు.

ముఖ్య పంటలకు సాంద్ర వ్యవసాయ కార్యక్రమాలు

“1963-64 వ. సం. లో వ్యవసాయ కార్యక్రమాలకు కేటాయించిన మొత్తాలను దాదాపు 50 శాతం వరకు హెచ్చించడం జరిగింది. నీటిపారుదల సౌకర్యాలుగానీ, వర్షాధారంగానీ తప్పకుండాఉండే ముఖ్య పంటలన్నింటికీ సాంద్ర వ్యవసాయ పథకాలను అమలు చేయాలని మేము నిశ్చయించాం. అటువంటి ప్రాంతాలలో మొదటి సంవత్సరంలో ప్రతిపంటకు 50 శాతం, రెండవ సంవత్సరంలో 75 శాతం, ఆఖరు సంవత్సరంలో 100 శాతం ప్రాంతంలో అమలు చేయాలని ప్రతిపాదించాం. భూసార సంరక్షణ పథకంపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతుంది. ప్రణాళికలో యీ పథకానికి కేటాయించిన మొత్తాన్ని రు. 163.00 లక్షల నుండి రు. 306.00 లక్షలకు హెచ్చించడం జరిగింది. ప్రణాళికా కేటాయింపులకు మించి కేంద్ర ప్రభుత్వం అదనంగా రు. 2.00 కోట్లు ఇస్తామని వాగ్దానంచేసిన మొత్తాన్ని పై మొత్తంలో కలపడం జరిగింది.

“విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అధికం కావడం అత్యవసరం అనే విషయాన్ని గుర్తించడం జరిగింది. తదనుగుణంగానే మూడవ ప్రణాళికలో దీనికై కేటాయించిన రూ 64.94 కోట్లను, రు. 68.64 కోట్లకు పెంచడం జరిగింది. 1963-64 వ సం. లో ప్రణాళికకు కేటాయించిన రు. 50.00 కోట్లలో రు. 9 కోట్లు కేవలం విద్యుచ్ఛక్తికి మాత్రమే కేటాయించారు. అయితే విద్యుచ్ఛక్తి బోర్డు ప్రజాఋణం ద్వారా సేకరించడానికి అనుమతించబడిన రు. 4 కోట్లు ఇందులో కలపడం జరగలేదు. మత్స్య పరిశ్రమ, పాల పరిశ్రమలలో అత్యవసరంగా అధికోత్పత్తిని సాధించాల్సిన పథకాలకు అదనపు హెచ్చు మొత్తాలను కేటాయించడం జరిగింది. మత్స్య పరిశ్రమాభివృద్ధికి 150 శాతం అధిక మొత్తాలకూ పాల సరఫరాలకు సంబంధించిన కేటాయింపులను రెట్టింపు మొత్తాలకూ హెచ్చించడం జరిగింది. జాతీయ అత్యవసర పరిస్థితి దృష్ట్యా రోడ్ల అభివృద్ధికై ప్రస్తుత సంవత్సరంలో కేటాయించిన మొత్తాలకు మించి రు. 40 లక్షలు కేటాయించడం జరిగింది.

సాంకేతిక విద్య

“సాంకేతిక విద్యకు సరియైన ప్రాముఖ్యత ఇవ్వబడింది. డిప్లమో హోల్డర్లకు పనివారికి శిక్షణ సౌకర్యాలను పెంపొందించడానికై ప్రస్తుతం వున్న వాటి కంటె ఎక్కువ సౌకర్యాలు కల్పించబడ్డాయి. ఇందుకై అదనంగా 31.0 లక్షల రూపాయలను కేటాయించడం జరిగింది. పెక్కుమంది పనివారికి శిక్షణ నివ్వడానికై ఏడు పారిశ్రామిక శిక్షణ సంస్థలను ప్రారంభించడానికి నిర్ణయించాం. అందువల్ల రక్షణావసరాల ఉత్పత్తికి ప్రస్తుతం వున్న లోటు తీరుతుంది. దీనికి తోడుగా రాష్ట్రంలో వ్యాయామ శిక్షణ, జాతీయ శ్రమ శిక్షణ పథకాలు అమలు పరచబడి, అదనంగా 24 వేల మంది యన్.సి.సి. కేడెట్లకు శిక్షణ ఇవ్వబడుతుంది. దీనితోపాటే వైద్య ఉద్యోగులకు శిక్షణగర్పడానికై అదనపు శిక్షణ కోర్సులను ప్రారంభించాలని కూడా చూస్తున్నాం.

“నాగార్జున సాగర్‌వద్ద ప్రస్తుతం జరుగుతున్న పని దృష్ట్యా డామ్‌కు,కాలువలకు ప్రతియేటా 11 కోట్ల రూపాయలకు తక్కువ కాని మొత్తాన్ని కేటాయించవలసి వున్నా, దీర్ఘకాలం పట్టే ప్రాజెక్టులను తగ్గించడానికై, నాగార్జున సాగర్ డామ్‌కు 1963-64 లో కేటాయించిన 9 కోట్ల రూపాయల మొత్తాన్ని 8 కోట్ల రూపాయలకు తగ్గించడానికి ఎంతో బాధపడుతూ నిర్ణయించాం. అంతకన్నా ఇక వేరే గత్యంతరం లేదుమరి. తగినన్ని నిధులు కావలసినందున సాంఘిక సేవా రంగంలో ఎట్టి కొత్త పథకాలను కూడా చేపట్టకూడదని నిర్ణయించాం. సాధారణ విద్య విషయంలో కూడా నెమ్మదిగా పోయే కన్న వేరేమార్గం లేదు.

“ఇక పోతే అన్ని రంగాలలోని కార్యక్రమాల అమలులో చెప్పుకోదగినంత అభివృద్ధిని సాధించాలి. రాష్ట్రీ ఆర్థికవ్యవస్థ, ధరల స్థాయిలు, సరఫరాలు మొదలైన విషయాలను కూడా నిశితంగా పరిశీలిస్తూ వుండాలి. అంతర్గతమైన వనరులను పొదుపులను జాతీయ రక్షణ బాండ్లు, రక్షణ డిపాజిట్ సర్టిఫికెట్లు, ప్రీమియం బహుమతి బాండ్ల ద్వారా సమీకరించడానికి శాయశక్తులా కృషిచేయాలి. చెల్లించబడకుండా వున్న ఋణాలు, పన్నుల బకాయిల వసూళ్ళను త్వరితగతిని రాబట్టాలి.

"రాష్ట్ర ప్రణాళికకు కావలసిన 305 కోట్ల రూపాయల సేకరణకు 'తప్పని సరి' యైన 53 కోట్ల రూపాయలకు తక్కువ కాని మొత్తాన్ని త్వరితగతిని సాధించడానికి అదనపు పన్నుల చర్యలను తీసుకోవాలి. లేకపోతే ప్రణాళిక యొక్క ప్రమాణాన్ని తగ్గించవలసి వుంటుంది. ఎంతో పరిజ్ఞానం వున్న ప్రజలలో కూడా యీ విషయాన్ని చాటి చెప్పవలసిన అవసరం వుంది. ప్రజలు సముచితరీతిలో త్యాగాలు చేస్తేనే తప్ప అభివృద్ధి సాధ్యంకాదు.

గట్టి పొదుపరితనం

"నిర్మాణాలలో పొదుపు మాత్రమే కాక అన్ని విధాలయిన ఖర్చులలోను ఖచ్చితమయిన పొదుపరితనాన్ని అవలంబించాలి. జిల్లా పరిషత్తులు పంచాయతీ సమితులు, పంచాయితీలు, మునిసిపాలిటీలు, యితర సంస్థలలోని యంత్రాంగాన్ని, నాయకత్వాన్ని పునర్నిర్మించి, నేటి పరిస్థితులకు అనుగుణంగా పటిష్ఠంచేయాలి. అయితే యీ బాధ్యత కేవలం పరిపాలకులు, రాజకీయ నాయకులపై మాత్రమే లేదు. ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితులలో అతి ముఖ్యమయిన సామూహిక బాధ్యతగా తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించే ఉత్సాహం ప్రతి పౌరునిలోనూ కలిగి ప్రముఖ పాత్రను వహించాల్సి ఉంది.

"సమర్థవంతంగా రూపొందించబడిన ప్రణాళికలద్వారా, సంయుక్తకృషి ద్వారా మాత్రమే దురాక్రమణదారుని ఎదుర్కొని పారద్రోలగలుగుతాము. విజయం సాధించడానికి యుద్ధరంగంలో పోరాడుతున్న సైనికులకు సహాయంగా అన్ని రంగాలలోనూ ఉత్పత్తులు అధికం కావాలి. ఈ క్లిష్టపరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రజల దృఢ నిశ్చయం, సంయుక్తకృషి యెంతో అవసరం. ఈ దృష్టితోనే రాష్ట్ర ప్రణాళికలను చూడాలి. ప్రణాళికలను అమలు జరిపే అన్ని స్థాయిలలోని ప్రజలు దేశభక్తి భావంతో తమకు నిర్దేశించబడిన పనులను నిర్వర్తించితేనే రాష్ట్ర ప్రణాళిక పునఃపరిశీలన ఉద్దేశ్యం నెరవేరుతుంది. స్వాతంత్ర్య పరిరక్షణకు దేశ సమగ్రతకూ జరిపే కృషిని మించినది మరేదీలేదు."

(ఆలిండియా రేడియో హైదరాబాదు కేంద్రంవారి సౌజన్యంతో).

ఇంత పెద్ద మొత్తమా!!

ఔను, మూడున్నర కోట్లరూపాయలు ఒక వ్యక్తికి చాలా పెద్ద మొత్తమే అనిపించవచ్చు. కాని ఈ మొత్తం ఒకే ఒక జెట్ విమానం కొనడానికి సరిపోతుందనే సంగతి మీకు తెలుసా!! అలాంటివి ఎన్నో జెట్ విమానాలైతే ఒక విమానదళం ఏర్పడుతుంది. దేశాన్ని శత్రువుల బారినుండి రక్షించుకోడానికి అలాంటి దళాలు మనకు ఎన్నో కావాలి.

ఆంధ్రప్రదేశ్ భారతదేశంలోని పెద్ద రాష్ట్రాలలో ఒకటి. మనం చాలా ఎక్కువే చేయాలి. చేస్తాం కూడా. అనేక విధాలుగా మనం సహాయ పడగలం. ఇప్పటి ప్రయత్నం ఉడతా భక్తి మాత్రమే. దీనివల్ల మన సాయుధ బలాలకు మనం చేకూర్చగలిగేది ఒక జెట్ విమానం కాని చిన్ని చిన్ని నీటిబిందువులే మహాసముద్రం. మనం చేయగలిగింది చాలా స్వల్పమే. అయినా తొలిచర్యగా ఈ పనినేరవేరుద్దాం.

వెలుగు బాటలు

ఉద్యోగ సాధక కేంద్రాలు 1945 లో స్థాపించబడ్డాయి. ఉద్యోగాలు పోయినవారికి ఒక క్రమపద్ధతిలో ప్రత్యామ్నాయంగా ఉద్యోగాలు చూపించడమే వీటి అసలు ఉద్దేశం. నిరుద్యోగుల విషయంలో - ప్రత్యేకించి విద్యావంతులైన నిరుద్యోగుల విషయంలో వారిని గురించి వివరాలు అందజేసే అధికార సంస్థలు ఇవే అని చెప్పాలి.

ఎంప్లాయిమెంటు మార్కెట్ ఇన్‌ఫర్మేషను, వొకేషనల్ గైడెన్సు పథకాలు ప్రవేశ పెట్టడంతో ఇవి ప్రస్తుతం ఉద్యోగ సమాచార సేకరణకూడా ప్రారంభించాయి. పబ్లిక్, ప్రయివేటు రంగాలు రెండింటికి సంబంధించిన సమాచారాన్ని ఇవి సేకరిస్తున్నాయి. ఇంతేకాదు విద్యాశాఖ సహకారంతో యువజనులకు, వయోజనులకు కూడా ఉద్యోగాల విషయంలో సలహాలిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డానికి ముందు ఆంధ్ర ప్రాంతంలో పదకొండు జిల్లా ఉద్యోగ సాధక కేంద్రాలుండేవి. రెండవ ప్రణాళిక క్రింద 11 వ కేంద్రాన్ని శ్రీకాకుళంలో స్థాపించడంతో మొత్తం ఆంధ్ర ప్రాంతానికి కేంద్రాలు నెలకొల్పబడ్డాయని చెప్పవచ్చును. వీటికి తోడు అదే సంవత్సరంలో ప్రణాళికక్రింద వృత్తి విద్యలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించే యూనిటుకూడా నెలకొల్పబడింది. వృత్తి విద్యలకు ఉద్యోగాల తరగతి వారి విభజనకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడానికి ఉద్దేశిస్తున్న దీ పథకం.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడడంతో ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో ఉండే ఉద్యోగ సాధక కేంద్రాలు స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ నేషనల్ ఎంప్లాయిమెంటు సర్వీసు క్రింద ఏకీకృత మొనర్చబడ్డాయి. ఈ డైరెక్టరేటు రాష్ట్ర రాజధానీ నగరంలో ఉంది.

ఘన విజయాలు

1-11-1956 లగాయతు రెండవ, మూడవ ప్రణాళికలక్రింద క్రొత్త పథకాల విస్తరణ, అభివృద్ధి రూపంలో యీ శాఖ సాధించిన విజయాలు యీ క్రింద తెలుపబడ్డాయి. రెండవ ప్రణాళికా కాలంలో ఏడు జిల్లా ఉద్యోగ సాధక కేంద్రాలు ప్రారంభించబడ్డాయి. అవి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మెదక్, మహబూబ్ నగర్ జిల్లాలలో జిల్లా కొకటి చొప్పున ఉన్నాయి. ఈవిధంగా జిల్లాకొక ఉద్యోగ సాధక కేంద్రాన్ని స్థాపించడం జరిగింది.

సంవత్సరం	రిజిస్ట్రేషను	ఉద్యోగాలు
1956-1957	1,16,237	14,161
1957-1958	1,24,326	10,806
1958-1959	1,36,348	14,999
1959-1960	1,73,189	19,786
1960-1961	1,82,119	21,199
1961-1962	1,95,489	29,029

హైదరాబాదులో ఉన్న ప్రాంతీయ ఉద్యోగ సాధక కేంద్రం పనిని వికేంద్రీకరించే ఉద్దేశంతో సికింద్రాబాదులో ఒక సాధక కేంద్రాన్ని నెలకొల్పడానికి మంజూరు లభించింది. కేవలం నైపుణ్యంలేని పనివారి రిజిస్ట్రేషను, ఉద్యోగాల కోసమే ఇది పనిచేస్తుంది.

నిరుద్యోగులైన గ్రామీణులు పట్టణ ప్రాంతాలకు రావడాన్ని అరికట్టేటందుకు, ఉద్యోగ అవకాశాలు, శిక్షణ సౌకర్యాలు గురించి పూర్తిగా వారికి తెలియజెప్పేటందుకు ఉద్యోగ సమాచార, సహాయ సంస్థలు తొమ్మిది నెలకొల్పబడ్డాయి. వ్యవసాయపు పనులు జరిగే కాలంలోను ఆ తర్వాత బ్లాకులలో ఉండే ఉద్యోగపు తీరుతెన్నులు గురించీ, బ్లాకులలో నిరుద్యోగం ఎంతవరకు ఉన్నదీ, నిర్మాణాలకు సంబంధించిన ఉద్యోగావకాశాలు ఏ విధంగా వున్నాయో వాటి నన్నిటిని సేకరించి ఆ సమాచారాన్ని తయారుగా ఉంచేటందుకు కూడా యీ సంస్థలు ఉద్దేశింపబడ్డాయి. ఇవి యీ క్రింద తెలిపిన సమాజ వికాస బ్లాకులలో నెలకొల్పబడ్డాయి. 1. నల్గొండ జిల్లాలో సూర్యాపేట 2. శ్రీకాకుళం జిల్లాలో బొబ్బిలి 3. హైద్రాబాదు జిల్లాలో ఇబ్రహీంపట్నం 4. కర్నూలు జిల్లాలో కొమరవోలు 5. కృష్ణా జిల్లాలో గన్నవరం 6. విశాఖపట్నం జిల్లాలో కోటఉరట్ల 7. తూర్పు గోదావరి జిల్లాలో కొత్తపేట 8. గుంటూరు జిల్లాలో ఒంగోలు 9. నెల్లూరు జిల్లాలో పొదిలి. 1962 డిసెంబరు లగాయతు మరో నాలుగు సంస్థలను నెలకొల్పేటందుకు మంజూరు లభించింది. వరంగల్లు జిల్లా ములుగులోను, కడప జిల్లా సిద్ధవటంలోను, అనంతపురం జిల్లా పెనుకొండలోను ఇవి నెలకొల్పబడతాయి.

ఎంప్లాయిమెంటు మార్కెటు ఇన్‌ఫర్మేషన్

పబ్లికు, ప్రయివేటు రంగాలు రెండింటిలోను నిర్ణీత కాలాల్లో ఉద్యోగ సమాచారాన్ని సేకరించడం కోసం యీ పథకం ఉద్దేశించబడింది. ఉద్యోగాల పరిస్థితిని, నిర్దిష్టమైన ఉద్యోగాలు ఉండే ప్రదేశాలలో

ఉద్యోగావకాశాలలో వచ్చే మార్పులను సక్రమంగా నిర్ణయించి చెప్పడమే యీ పథకం ఉద్దేశం. వీటిద్వారా ఉద్యోగావకాశాల పరిశీలన జరపడంవల్ల వివిధ పరిశ్రమలలో అయితేనేమి, వృత్తులలో అయితేనేమి ఉద్యోగ, నిరుద్యోగాల పరిస్థితులు ఏవిధంగా ఉంటున్నాయో ముందుగా తెలియజేయడానికి వీలౌతుంది. రాష్ట్రమంతటా యీ పథకం 1958 లో పబ్లిక్ రంగంలో ప్రవేశపెట్టబడింది. ఇది జిల్లా ఉద్యోగ సాధక కేంద్రాలకు చేర్చిన యూనిట్లద్వారా అమలుపరచడం జరుగుతూవుంది.

అయితే ప్రయివేటు రంగాన్ని పరిశీలించడమనేది దశలవారీగా జరుగుతూ వున్నది. క్రమేణా ఇది జిల్లాలకు విస్తరింపజేయబడుతుంది. ఇంతవరకు పదహారు జిల్లాలలో ప్రవేశపెట్టడం జరిగింది. మిగిలిన ఆదిలాబాదు, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలలో 1962 డిసెంబరు నుండి ప్రారంభించాలని ఉద్దేశించారు. జిల్లా యూనిట్లలో జరిగే పనిని సమన్వయ పరచి పర్యవేక్షించడానికి డైరెక్టరేట్‌లో స్టేట్ ఎంప్లాయిమెంటు మార్కెటు ఇన్‌ఫర్మేషను యూనిటు ఒకటి నెలకొల్పబడింది. ఈ యూనిటు త్రైమాసిక నివేదికలు ప్రచురిస్తుంది. వీటిని అన్ని డిపార్టుమెంటుల ఉన్నతాధికారులకూ సంస్థల యజమానులకూ పంపిణీ చేస్తారు.

ఉద్యోగాల గురించి సలహాలు

అభిరుచికి, అర్హతలకు, శరీర దార్ఢ్యానికి తగివుండే వృత్తిని ఎన్నుకోవడంలో యువజనులకు తోడ్పడేటందుకు యువజనుల ఉద్యోగ సౌకర్యాల పథకం ఉద్దేశిస్తున్నది. ఉద్యోగ సౌకర్యాల సలహాసంస్థ వయోజనుల విషయంలో ఇదేవిధమైన పనిని చేస్తుంది. ఈ పథకం హైద్రాబాదులోని ప్రాంతీయ ఉద్యోగ సాధక కేంద్రంలో 1957-58 లో అమలుపరచబడింది. అది ఇటీవల పదకొండు జిల్లాలకు విస్తరింపజేయబడింది. అవి కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్లు, అనంతపురం, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కాకినాడ, నెల్లూరు, నిజామాబాద్ జిల్లాలు. జిల్లా ఉద్యోగ సాధక కేంద్రాలలో ఉండే యూనిట్ల పర్యవేక్షణకు, సలహాలివ్వడానికి, సమన్వయ పరచడానికి తనిఖీకి 1960 డిసెంబరున డైరెక్టరేటులో స్టేట్ వొకేషనల్ గైడ్ యూనిటు కూడా నెలకొల్పబడింది.

విద్యావంతులలో నిరుద్యోగం విపరీతంగా ఏర్పడి ఉండడంవల్ల, దేశంలోని యూనివర్శిటీ ఎంప్లాయిమెంటు ఇన్‌ఫర్మేషను, గైడెను బ్యూరోలను స్థాపించడానికి నిర్ణయించారు. తమ అభిరుచికితగిన ఉద్యోగాలను ఎన్నుకోవడంలో తోడ్పడేటందుకు వీలుగా కళాశాలవిద్యార్థులకు సలహాలనిచ్చి ఉద్యోగావకాశాలను గురించి సమాచారాన్నిచ్చి శిక్షణసౌకర్యాలను కలగచేయడమే ఈ సంస్థలఉద్దేశం. ఈ రాష్ట్రంలోని మొదటి బ్యూరో 1961 లో ఆంధ్రా యూనివర్శిటీ వాల్తేరులో ప్రారంభించబడింది. రెండవది త్వరలోనే ఉస్మానియా యూనివర్శిటీలో నెలకొల్పబడింది. 1963 లో తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో మూడవది నెలకొల్పడానికి ఉద్దేశిస్తున్నారు.

హైద్రాబాదులోని ప్రాంతీయ ఉద్యోగ సాధక కేంద్రంలో వికలాంగులైన వారికోసం ప్రత్యేకమైన ఉద్యోగసాధక కేంద్రం ఒకటి నెలకొల్పబడింది. గ్రుడ్డి, చెవిటి, మూగవారికి శల్యసంబంధమైన అస్వస్థులకు ప్రత్యేకించి ప్రభుత్వంలో కాని యితరత్రా గాని తగిన ఉపాధిని కల్పించడమే దీని ప్రధానఆశయం.

మనిషి శారీరకంగా ఎంత అశక్తుడైనప్పటికీ ధనార్జనలో ఆ అశక్తత అడ్డు రాకుండాచేయడమే యీ పథకం యొక్క ఆశయం. అటువంటివ్యక్తి బాగా చేయగల పనిని చేపట్టి జీవితంలో సంతృప్తికరమైన జీవనాధారాన్నేర్పరచుకొనే అవకాశాన్ని కల్పించడమే దీని లక్ష్యం.

ఈ కేంద్రానికి ఒక సలహాసంఘం ఉంటుంది. ఇందులో యజమానుల, పనివారి ప్రతినిధుల, విద్యామంత్రిత్వశాఖ కార్మిక, ఉద్యోగ మంత్రాంగశాఖల ప్రతినిధి, వైద్య నిపుణుల ప్యానల్ వికలాంగుల సంక్షేమంలో సంబంధంగల స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు ఉంటారు. వీరు వికలాంగుల ఉద్యోగాలకు సంబంధించిన సమస్యల మీద ఎంప్లాయిమెంటు ఆఫీసరుకు సలహాలిస్తుంటారు.

ఈ కేంద్రానికి వైద్యనిపుణుల సంఘమొకటి సహాయకారిగా ఉంటుంది. ఈ సంఘం, సలహాసంఘానికి ప్యానల్‌గా ఉంటుంది. వికలాంగుల ఉద్యోగసాధక కేంద్రాధికారి తమవద్దకుపంపే దరఖాస్తుదారుల ఉద్యోగ అర్హతగురించిగాని, రిజిష్టరు చేసుకోవడానికి వారికిగల యోగ్యతలను గురించిగానీ పరిశీలించి సలహాలివ్వడం దీని కర్తవ్యం.

(కార్మిక, రవాణా శాఖల మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి గారి ప్రత్యేక వ్యాసం ఆధారంగా.)

హిమాలయ యోధులు

సిక్కు దళానికిచెందిన సిపాయ్ కేవల్ సింగ్ అక్టోబరు 26 వ తేదీన చైనీయులతో వీరోచితంగా పోరాడి ఎనిమిదిమంది శత్రువులను హతమార్చి వీరస్వర్గ మలంకరించాడు.

సిపాయ్ కేవల్‌సింగ్‌ది పంజాబులోని జలంధర్ జిల్లా. అదురు బెదురులేని వీర సైనికుడుగా అతడు తన మిత్రుల స్మృతి పథంలో మెదులుతున్నాడు.

సిపాయ్ కేవల్ సింగ్ వాలాంగ్ లోని ఒక అగ్రస్థావరంలోని ఒక కందకంలో అప్రమత్తుడై వున్నాడు. అతనికి ఎదురుగా లోహిత్‌నది వుంది. చైనీయులు గుంపులు గుంపులుగా ముందుకు చొచ్చుకొనివచ్చి మన దళాలతో తీవ్రపోరాటానికి దిగారు. మన జవాన్ల అకుంఠిత దీక్షకు, గురితప్పకుండా వారు సాగించిన కాల్పులధాటికి చైనీయులు తట్టుకోలేకపోయారు. బలం పుంజుకోడానికై వారు మొదట వెనక్కుతగ్గి మన స్థావరంపై తిరిగి దాడిజరిపారు. అప్పుడు సిపాయ్ కేవల్ సింగ్ మాతృభూమిరక్షణకై కఠోర శపథం తీసుకున్నాడు. మాతృదేశంపట్ల ప్రేమాను రాగం పరవళ్ళు త్రొక్కుతుండగా "సత్ శ్రీఅకాల్" అని గర్జనచేస్తూ తన కందకంలోనుంచి బయటికిదూకి శత్రుమూకలపై బడ్డాడు. శత్రువులను చీల్చిచెండాడుతూ రణరంగంలో వీరవిహారం చేశాడు. తాను నేలకొరిగేలోగా ఎనిమిదిమంది శత్రు సైనికులను హతమార్చాడు. ఇదే సిపాయ్ కేవల్ సింగ్ వీరమరణగాథ.

"స్పార్టా" యోధులను పోలిన వీరత్వం

మారిషస్ ప్రభుత్వ నిర్మాణాలు, అంతర్జాతీయ కమ్యూనికేషన్ల శాఖామంత్రి శ్రీ హెచ్. ఇ. వాల్టేర్ ఇటీవల న్యూఢిల్లీలో ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంలో, యుద్ధరంగంలో పనిచేస్తున్న తన పుత్రునివద్దనుంచి వచ్చిన జాబును అతని తండ్రి విజయగర్వంతో చదివి వినిపించాడు.

సాయుధదళంలో పనిచేస్తున్న 22 సంవత్సరాల ఈ యువ అధికారి, భారత భూభాగంనుంచి చివరి చైనీయుడు వైదొలిగే వరకూ తాను పోరాడదలచినట్లు తన తల్లిదండ్రులకు తెలియజేశాడు. దుర్గమమైన యుద్ధప్రాంతపు కాఠిన్యంకానీ, అంతకు ఒకేరోజుముందు రణరంగంలో ప్రాణాలర్పించిన తన ఆప్తమిత్రుని వియోగంకానీ ధీరోదాత్తుడైన ఈ యువ అధికారిపై ఏమీ పనిచేసినట్లులేదు.

ఈ వృత్తాంతంవిని ముగ్ధుడైన శ్రీ వాల్టేర్ ఒక చిన్నజాబుఇచ్చి దానిని ఆ యువ అధికారికి పంపమనికోరాడు. శ్రీ వాల్టేర్ తన లేఖలో ఇలా వ్రాశాడు :

"నేను మిమ్ములను వ్యక్తిగతంగా ఎరుగను. అయితే మీరు వ్రాసినజాబు "స్పార్టా" యోధుల వీరావేశాన్ని వ్యక్తం చేస్తున్నది. కనుక "స్పార్టా" వీరమాతలు వారి తనయులకు ఎల్లప్పుడూచేసే ఉపదేశాలను గుర్తుంచుకోండి. రణరంగంలో పరాజితులై తిరిగి రాకూడదని వారు ఉపదేశించారు. దేవుడు మిమ్ములను కటాక్షించుగాక !"

ఆరితేరిన యుద్ధవీరులకు ప్రసిద్ధిగాంచిన "స్పార్టా"కు చెందిన వీరమాతల విషయమై శ్రీ వాల్టేర్ తమలేఖలో ఉల్లేఖించారు. "స్పార్టా" యోధులు డాలుధరించి వుంటారు. "స్పార్టా" వీరమాతలు తమ పుత్రులు రణరంగములో నిహతులైనా డాలులతో వారు తీసుకొని రాబడినట్లయితే పుత్రవియోగానికి ఒకవంక విచారించినప్పటికీ ఎంతో గర్విస్తారు. తమ కుమారులు పరాజయంతో తిరిగిరాకూడదు, శత్రువులకు వెన్నుచూపకూడదన్నదే వారి అభిమతం.

విజయచిహ్నంతో విజయంచేసిన వీరుడు

రాజ్‌పూత్‌దళానికిచెందిన కంపెనీ హవల్దారు — మేజర్ సౌదాగర్ సింగ్ నేఫా ప్రాంతంనుంచి చైనీయుల ఆటోమేటిక్ రైఫిల్‌ను ఒకదాన్ని విజయచిహ్నంగా గైకొనివచ్చాడు. మృత్యుముఖంనుంచి బయటపడి శత్రువుల ఈ ఆయుధాన్ని చాకచక్యంగా హస్తగతం చేసుకున్న ధీశాలి శ్రీ సౌదాగర్ సింగ్. అక్టోబరు 20 వ తేదీ ఉదయం నామ్‌కాచూనది వద్దవున్న ఆయన

స్థావరంపైకి సుమారు 250 మంది చైనీయులు దండెత్తివచ్చారు. ముగ్గురేసి ఒక జట్టు చొప్పున వారు వచ్చిపడ్డారు. ముగ్గురిలో ముందున్న సైనికుని చేతిలో రైఫిల్ వుండగా మిగతా ఇద్దరివద్ద మందుగుండు సామాగ్రి, గ్రెనేడ్లు వున్నాయి. రైఫిల్ ధరించిన ముందున్నవ్యక్తి మరణిస్తే తక్కిన ఇద్దరూ అతని ఆయుధం అందుకొని ముందుకు నడవడం వారి యుద్ధపద్ధతులు.

మూడవ వంతెన సమీపంలోని ఒక స్థావరం వద్దవున్న సౌదాగర్ సింగ్ మరో ఇద్దరు సైనికులు పన్నెండుమంది చైనా సైనికులకు జవాబు చెప్పారు. చివరకు తోడి సైనికులిద్దరూ శత్రువుల చేతుల్లో నిహతులైన పిమ్మట సౌదాగర్ సింగ్ ఒక చిన్న కొండరాతి వెనకాల పొంచివున్నాడు.

అతను పొంచివున్న ప్రదేశానికి 25 గజాల దూరంలోకి చైనీయులు వచ్చారు. సాహసవంతుడైన సౌదాగర్ సింగ్ రైఫిల్‌తోవున్న మొదటి వ్యక్తినీ ఆతర్వాత వాణ్ణి కూడా హతమార్చాడు. కాని మూడవ సైనికుడు ముందుకు రావడంతో శత్రువుకీ అతనికీ అంటే ఒక విధంగా మృత్యువుకూ అతనికీ మధ్య కేవలం 5 అడుగుల దూరం మాత్రమే వుండిపోయింది. అప్పటికి అతకి వద్దవున్న మందుగుండు కూడా పూర్తి అయింది.

అప్పుడు సౌదాగర్ సింగ్‌కు తనను ఏదో దివ్యశక్తి ఆవహించినట్లనుపించింది. తక్షణమే మెరుపు మెరిసినట్లుగా తాను పొంచివున్న కొండరాతి వెనుకాల నుంచి శత్రుసైనికునిపై లంఘించి బయొనెట్ ప్రయోగించి అతనివద్దవున్న రైఫిల్ లాక్కొని కొండరాతి వెనకాల తన స్థావరానికి తిరిగి వెళ్లాడు. తరువాత శత్రువునుంచి వశపర్చుకున్న రైఫిల్‌తో కాల్పులు జరిపి సౌదాగర్ సింగ్ ముందుకుచొచ్చుకునివస్తున్న చైనీయులను కనీసం అరడజను మందిని నేల కూల్చాడు. ఉపసంహరణకు ఉత్తర్వులు అందేవరకూ అతను కాల్పులు సాగిస్తూనే వున్నాడు.

తరువాత చెట్లు, గట్లచాటున నక్కుతూ శ్రీ సింగ్ తన బ్రిగేడ్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నాడు.

మృత్యుంజయుడు

ఛుసుల్‌లో జరిగిన భీకరపోరాటంలో నిహతుడైనట్లుగా భావించి విడిచిపెట్టబడిన ఒక అధికారి సజీవంగా తిరిగివచ్చిన విచిత్ర సంఘటనను గూర్చిన వివరాలు తెలియవచ్చాయి.

లడక్‌లో ఛుసుల్‌కు తూర్పున కొన్ని మైళ్ళదూరంలోవున్న మన అగ్రస్థావరాలలో ఒకదానిపై జరిపిన దాడుల్లో చైనీయులు ఫిరంగులను, టాంకులను ప్రయోగించారు. ఈ దాడులలో ఒకదానిలో సెకండు లెఫ్టినెంట్ గోస్వామికి తీవ్రంగా గాయాలు తగిలాయి. వెంటవున్న సైనికులు అతను మరణించాడనుకొని అలాగే వదిలేసి వచ్చారు.

తరువాత చీకటిపడ్డాక శ్రీ గోస్వామికి స్పృహవచ్చింది. తిన్నగా నడుస్తూ కొన్ని వందలగజాల దూరములోవున్న తనస్థావరం చేరుకున్నాడు. ఛుసుల్‌నుంచి లేకూ అక్కడినుంచి ఢిల్లీకి అతన్ని విమానంలో పంపారు.

"మరికొందరు శత్రువులను పరిమార్చాలి"

దేశ వ్యవహారాల మంత్రి శ్రీ లాల్‌బహాద్దుర్‌శాస్త్రి ఇటీవల అస్సాంలో పర్యటించిన సందర్భంలో భారతీయ జవానుల అకుంఠిత దేశభక్తినిచాటే ఒక సంఘటనను గూర్చి ఆయనకు తెలియజేయబడింది.

శత్రువుల తుపాకులనుంచి దూసుకొని వచ్చిన 8 గుండ్లతో శరీరం తూట్లుపడిన ఒక జవాను ఆసుపత్రిలో తీవ్ర అస్వస్థతతో పడుండి కడసారిగా నిశ్వసించడానికి పూర్వం ఇలా అన్నాడు: "నేను త్వరలోనే ఆరోగ్యం పుంజుకోవాలి. యుద్ధరంగానికి వెళ్ళి మరికొందరు శత్రువులను పరిమార్చాలి."

అత్యద్భుత సంఘటన

నేఫా ప్రాంతంలో మన సాయుధదళాలు ప్రదర్శిస్తున్న అసమాన ధైర్యసాహసాలు సేవానురక్తి క్రమశిక్షణలకు సంబంధించి అందుతున్న అనేక వార్తలలో ఇద్దరు దక్షిణాది అధికార్ల అద్భుతగాథ ఒకటి. కలనిజమైన ఉదంతాన్ని ఈ గాథ చాటుతుంది.

చైనీయులు బొమిడిలాపై దాడి జరిపినప్పుడు వారితో పోరాడుతున్న సందర్భంలో మద్రాసు రెజిమెంటుకు చెందిన మేజర్ పనిక్కర్ ఏటవాలుగా వున్న కొండగట్టు నుంచి జారిపడ్డాడు. ఫలితంగా అతని పార్శ్వపు ఎముకలు, కంఠ ఎముక విరిగాయి. కాని ఎలాగో శక్తి కూడబట్టుకొని తిన్నగా లేచినుంచొని కొన్ని మైళ్ళవరకు అరణ్యాలగుండా నడిచాడు. కాని తరువాత తీవ్రమైన బాధకు తట్టుకోలేక క్రింద పడిపోయాడు. స్పృహలేని స్థితిలో అలాగే దాదాపు ఒక రోజు వున్నాక అతనికి తెలివివచ్చింది. కాని అప్పుడు చూచుకుంటే చుట్టుపట్ల ఎవ్వరూ లేరు. స్వశక్తితో లేచి నుంచోలేక పోవడం వల్ల తన ఖర్మానికి తన్ను వదిలేసుకొని అక్కడే పడుండిపోయాడు. తరువాత కొన్ని గంటలకు అతనికి నిద్రపట్టింది.

కాల్పులు ఆగిపోయినట్లూ, ప్రధాన కార్యాలయంలోని అతని కమాండర్లు, బలం చిక్కబట్టుకొని లేచినుంచుని ఇంకా ఒకటి రెండు మైళ్లు నడిచి సహాయానికై అక్కడ ఓపికలో నిరీక్షించవలసిందని ఆదేశించినట్లూ మేజర్ పనిక్కర్ ఆ నిద్రలో కలగన్నాడు. నిద్ర మేల్కొన్నాక కలలో తనకు ఆదేశమివ్వబడ్డట్లు ఆచరించడానికి ఆయన నిశ్చయించుకున్నాడు.

నొప్పి అతి తీవ్రంగా వున్నప్పటికీ అలాగే బాధపడుతూ మరో రెండు మైళ్ళు నడిచి అక్కడ నిరీక్షణకై కూలబడిపోయాడు.

మేజర్ పనిక్కర్ ఈ బాధలు పడుతుండగా సేలావద్ద శత్రుమూకలతో పోరాడి అనివార్యపరిస్థితుల్లో అక్కడినుంచి ఉపసంహరించుకొని అడవులగుండా వెనక్కు తిరిగివస్తున్న ఒక రాజ్‌పూత్ దళం అటువైపుకు రావడం తటస్థించింది. ఈ దళానికి మేజర్ నాయర్ నాయకుడు. మేజర్ నాయర్ ఆయన సైనికులు లోగడ రెండుసార్లు చైనీయుల శ్రేణులకు చాలా దగ్గర వరకు చొచ్చుకొని పోవడం జరిగింది. వీరు మార్గంలో, మేజర్ పనిక్కర్ బాధతో పడివున్న స్థలాన్ని సమీపించారు. నిజానికి వారు మేజర్ పనిక్కర్ ఉనికిని గ్రహించే వారే కాదు కాని ఆ ప్రాంతంలో మద్రాసు దళాలకు చెందిన కొందరు సైనికుల మృతదేహాలు కనిపించడం వల్లనే వారు ఆతన్ని కనుక్కోడం సంభవించింది. అక్కడ సైనికుల కళేబరాలను చూసి మేజర్ నాయర్ ఆ చుట్టుపక్కల ఇంకా ఏమైనా మృతదేహాలు వున్నవేమో వెతకవలసిందిగా తన జవానులను కోరాడు. తరువాత అరగంటకు వారు తిరిగివచ్చి ఒక మద్రాసు అధికారి గాయాలతో బాధపడుతూ పడివున్నట్లు చెప్పారు. ఆ తరువాత కాసేపటికి మేజర్ నాయర్ ఆ స్థలానికి వెళ్ళగా, తన మిత్రుడు మేజర్ పనిక్కర్ అతన్ని తీసుకొని వెళ్ళదలిచిన సైనికులతో తనను అక్కడనే వదిలివెయ్యవలసిందనీ, అనవసరంగా తాను వారికి పెద్దభారం కాదలచలేదనీ బిగ్గరగా అనడం వినిపించింది. దానికి ఆయన ఆశ్చర్యచకితుడయ్యాడు.

కాని మేజర్ నాయర్, ఆయన రాజ్‌పూత్ సైనికులు అందుకు సమ్మతించక మనందరం కలిసే సురక్షితంగా గమ్యాన్ని చేరుకుందాం లేదా కలిసే ఆపదలను ఎదుర్కొందాం అన్నారు. మేజర్ పనిక్కర్‌ను లేవనెత్తి అతనికి తమవద్ద మిగిలివున్న నీరు, ఆహారం ఇచ్చారు. మార్గం సాఫీగా వున్నప్పుడు బుజాలపైనా, కొండలను ఎక్కవలసివచ్చినప్పుడు వీపుమీదా మోస్తూ మేజర్ నాయర్ ఆయన దళ సభ్యులు మేజర్ పనిక్కర్‌ను తమవెంట తీసుకొని వెళ్ళారు. దారిలోనే వారివద్దవున్న ఆహారం పూర్తయింది. ఆయుర్వేదంపట్ల మక్కువవున్న మేజర్ పనిక్కర్, అడవిలో లభించే కొన్ని ఓషధులను సేకరించి నూరి గుజ్జు త్రాగవలసిందనీ అలా చేస్తే ఆకలిదప్పులు వుండవనీ సహచరులకు సలహా ఇచ్చాడు.

తమవద్దవున్న ఆహారం పూర్తికావచ్చిన సమయంలో మేజర్ నాయర్ ఎముకలు విరిగి బాధపడుతున్న తన మిత్రుని కొరకు బియ్యాన్నీ, నీరును అట్టిపెట్టవలసిందిగా తన సైనికులను కోరాడు.

ఈ దళంవారు పది రోజులకు పైగా ప్రయాణంచేసి కార్యస్థానానికి చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న తక్షణమే మేజర్ పనిక్కర్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. మేజర్ నాయర్, ఆయన సైనికులు తన కోసం అట్టిపెట్టినబియ్యాన్ని మేజర్ పనిక్కర్ ఇంకా భద్రంగా వుంచుకున్నాడు. తనను చూడవచ్చిన వారికి వాటిని చూపి ఆయన అశ్రువులు రాలుస్తాడు.

50 మంది చైనీయుల వధ

గార్డ్స్ దళానికి చెందిన లెఫ్టినెంట్ జితేంద్రసింగ్ చౌదరి ప్రదర్శించిన అద్భుత ధైర్యసాహసాలకు సంబంధించిన వృత్తాంతం తెలియవచ్చింది. లెఫ్టినెంట్ జితేంద్రసింగ్ చౌదరి నేఫా ప్రాంతంలో చైనా దురాక్రమణదారులతో పోరాడుతూ వీరస్వర్గమలంకరించాడు.

రోడ్డుకు ఏర్పడిన అవరోధాన్ని తొలగించే నిమిత్తం నియోగించబడిన ఒక జట్టుకు లెఫ్టినెంట్ చౌదరి (23) నాయకుడుగా వున్నాడు. తన జవానులకంటె సంఖ్యలో ఎన్నోరెట్లు ఎక్కువవున్న చైనీయులు పెద్ద ఎత్తున కాల్పులు సాగిస్తున్నప్పటికీ లెఫ్టినెంట్ చౌదరి అత్యంత సాహసంతో, సమయస్ఫూర్తితో తన పని నెరవేరుస్తూ పోయాడు.

శత్రుమూకలతో తుదివరకూ వీరోచితంగా పోరాడాడు. తన ఒక్కచేతి మీదుగా కనీసం 50 మంది చైనీయులను పరిమార్చి తాను వీరమరణం పొందాడు.

లెఫ్టినెంట్ చౌదరి సోదరుడైన అంబాలా వాస్తవ్యుడు శ్రీ మొహిందర్‌సింగ్ చౌదరి తన సోదరుడు యుద్ధరంగానికి వెళ్తూ తాను మాతృభూమి గౌరవాన్ని నిలబెట్టగలననీ, చైనా దురాక్రమణదార్లకు బుద్ధిచెప్పగలననీ తన బంధువులతో అన్నట్లు చెప్పాడు. తన విజయోత్సవాన్ని గురించిన వార్తనుకానీ లేదా రణరంగంలో మరణించిన వార్తను కానీ వినడానికి సిద్ధంగా వుండాలనికూడా

లెఫ్టినెంట్ చౌదరి తన బంధువులను కోరాడట.

లెఫ్టినెంట్ చౌదరి మాతృదేశ రక్షణకై ప్రాణాలర్పించినందుకు తమ కుటుంబం చాలా గర్విస్తున్నట్లు శ్రీ మొహిందర్‌సింగ్ చౌదరి అన్నాడు.

లెఫ్టినెంట్ చౌదరిది రోహటక్ జిల్లాకు చెందిన ఒకసైనిక కుటుంబం. అతని తండ్రి కెప్టెన్ లాల్‌చంద్ చౌదరికూడా ఇప్పుడు యుద్ధరంగంలోనే వున్నారు. లెఫ్టినెంట్ చౌదరి మంచి క్రీడాకారుడు. ఒకప్పుడు ఉత్తర భారత లైట్ వెయిట్ బాక్సింగ్ ఛాంపియన్ కూడా.

ట్రక్కుడ్రైవర్ల చాకచక్యం

నేఫా ప్రాంతంలోని వాలాంగ్ రంగంలో చైనీయులకు ఖైదీయులుగా పట్టుబడిన ముగ్గురు సివిల్ ట్రక్కుడ్రైవర్లు శత్రువుల వశంలో పన్నెండు రోజులువుండి పదమూడవరోజున ఏవిధంగా తప్పించుకొని వచ్చారో ఈ డ్రైవర్లలో ఒకడైన నార్ బహద్దూర్ దామాయ్ వివరించాడు.

చైనీయులు తమను నిర్బంధించిన తరువాత ఒక పర్వత ప్రాంతంలో భారత సైనికులతోపాటుగా ఒక డిటెన్షన్ శిబిరంలో వుంచారని ఆయన అన్నాడు.

చైనా కాపలాదార్లు సైనిక ఖైదీలపై వుంచినంత తీక్షణమైన నిగాను సివిల్ ఖైదీలపై వుంచలేదనీ సివిల్ ఖైదీల కంటే సైనిక ఖైదీలపట్ల కఠినంగా ప్రవర్తించారనీ, సైనికఖైదీలు తమ శిబిరాలనుంచి బయటికిరాకుండా కట్టుదిట్టాలు చేశారనీ నార్‌బహద్దూర్ తెలిపాడు.

ఒకరోజు సాయంత్రం నార్‌బహద్దూర్ తన శిబిరంవద్ద కూర్చుని వున్న సమయంలో రెండు అడివి పందులు అచ్చట తిరుగుతుండడం కనిపించింది. ఆ దృశ్యం చూచాక అతను ఉద్రేకం ఆపుకోలేక పోయాడు. వెంటనే తన సమీపంలో అజాగ్రత్త స్థితిలో వున్న ఒక చైనా కాపలాదారువద్దనుంచి రైఫిల్ లాక్కొని అడివిపందులను గురిచూసి కాల్చాడు. వెంటనే అవి చచ్చి పడ్డాయి.

ఆ క్షణంలో శిబిరంలో కలవరపాటు ఏర్పడింది. చైనా కాపాలాదారు చచ్చిపడిన పందుల వైపుకు పరుగెత్తాడు. ఈ అవకాశం కోసమే నార్‌బహద్దూర్ ఎదురు చూస్తున్నాడు. కాపలాదారు ముందుకు వెళ్ళిపోయిన వెంటనే తనతోపాటు పట్టుబడిన మిగతా ఇద్దరు టక్ డ్రైవర్లతో కలిసి తప్పించుకొని పారిపోయాడు.

దట్టమైన అడవులగుండా ప్రయాణం చేస్తూ ఆకులు అలములను మాత్రమే తిని కడుపు నింపుకుంటూ 11 రోజుల తరువాత తాము తమ స్థావరానికి చేరుకున్నట్లు నార్ బహద్దూర్ తెలిపాడు,

10 రోజుల కఠిన ప్రయాణం

120 మంది భారతసైనికులున్న ఒక దళం, పదిరోజులపాటు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ 24 మైళ్ళ దూరం నడిచి లడక్‌లోని తమ స్థావరానికి చేరుకున్న సాహసిక గాధను, ఇటీవల "మహావీర చక్ర" బహుమతి పొందిన మేజర్ అజిత్ సింగ్ వెల్లడించారు.

మంచు కొరికివేసిన తన పాదాలకు చికిత్స పొందుతున్న మేజర్ అజిత్ సింగ్‌ను ఒక విలేఖరి లూథియానా సమీపంలోనున్న ఆయన స్వగ్రామంలో కలుసుకున్నప్పుడు తన దళంలోని సైనికులు నాలుగు రోజులపాటు ఆహారంలేకుండా "మృత్యులోయ"లో దుర్గమ ప్రాంతంలో ప్రయాణం చేయవలసి వచ్చిందని చెప్పారు. వారి కృతనిశ్చయాన్నీ, సాహసాన్నీ ఆయన ఎంతో కొనియాడారు. మేజర్ సింగ్ ఇంకా ఇలా అన్నాడు :

"నేను బ్రతికివున్నానని ఇప్పటికీ నమ్మలేకుండా వున్నాను. అద్భుతమైన విషయమే ఇది. ఈ ఘనత అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించిన నా దళంలోని సైనికులకు దక్కుతుంది."

అక్టోబరు 23వ తేదీన లడక్‌లోని హాట్ స్ప్రింగ్ ప్రాంతంలోగల నుల్లాజంగ్‌వద్ద మేజర్ అజిత్‌సింగ్ తన దళంతో వుండగా చైనీయుల ముట్టడి ఆరంభమైంది. హాట్ స్ప్రింగ్‌కు అభిముఖంగా అనేకమంది చైనీయులు కేంద్రీకరించడంవల్లా, నుల్లాజంగ్ వద్దవున్న మన కేంద్రం ఇదివరకే శత్రువుల వశం కావడంవల్లా, ఆ ప్రాంతంలో మరింత సుసంఘటితమైన రక్షణ ఏర్పాటు చేసుకోడానికి వీలుగా ట్యాంగ్‌సాలుకు తిరోగమించవలసిందిగా మేజర్ సింగ్‌కు ఉత్తర్వు చేయబడింది. ఆ ప్రదేశంలోనే వుండి, శత్రువుల చేజిక్కిన నుల్లాజంగ్ కేంద్రాన్ని తిరిగి స్వాధీనం చేసుకోడానికి ఆయన అనుమతి కోరాడు. తన పథకాన్ని అమలు పరచడానికి మేజర్ సింగ్‌కు అనుజ్ఞ లభించింది. హాట్ స్ప్రింగ్ వద్దవున్న స్థావరాన్ని ఆయన దళంవారు కాపాడుతుండగా నుల్లాజంగ్‌వద్దవున్న స్థావరం తిరిగి స్వాధీనం చేసుకోబడింది. హాట్‌స్ప్రింగ్‌కు ఎదురుగా చైనీయులు అత్యధిక సంఖ్యలో కేంద్రీకరించడంవల్లా, మర్నింకావరకు వారు రహస్యంగా చొచ్చుకొని వచ్చినట్టు తెలియ రావడంవల్లా ఆయన తన దళంతో ఆ కేంద్రాలను విడిచిపెట్టి, రక్షణ శ్రేణిలో వుండటానికి వెనుకకు వెళ్ళాడు.

హాట్‌స్ప్రింగ్ నుంచి ఉపసంహరించుకున్న తరువాత ఈ దళం పూర్తిగా 24

మైళ్ళ దూరం దుర్గమ ప్రాంతాలలో ప్రయాణం చేసింది. గుండెలోతు వరకు వున్న నీటిలోనుంచీ, శరీరం గడ్డకట్టుకుపోయే మంచులోనుంచీ వీరు తమ ప్రయాణం సాగించవలసి వచ్చింది. అక్టోబరు 25 వ తేదీన తమ స్థావరం నుంచి బయలుదేరిన వీరు నవంబరు 3 వ తేదీన ఘుసూల్ చేరుకున్నారు.

"ఈ మధ్యకాలంలో మా జాడ తెలుసుకోడానికి సైనికాధికార్లు చాలా ప్రయత్నించారు. కాని మా అంతు వారికి ఏమాత్రం చిక్కలేదు. అన్నివిధాలా బాహ్యప్రపంచంనుంచి మాకు పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి."

ప్రవాహాలను దాటేప్పుడు కొట్టుకుపోకుండా వుండేందుకై ఎనమండుగురు లేక తొమ్మండుగురు సైనికులు జట్లు జట్లుగా తాడుతో ఒకరినొకరు కట్టివేసుకొని వీరు ప్రయాణం చేశారు. ఆహారంకూడా లేకపోవడంవల్ల వీరు చివరి నాలుగు రోజులు చాలా కఠినంగా గడపాల్సి వచ్చింది. అత్యంత ప్రతికూల వాతావరణంలో దుర్గమ ప్రాంతాలలో ఎంతో కఠోరంగా గడపాల్సి వచ్చినా ఈ జవానుల ధైర్య స్థైర్యాలు ఎంతమాత్రం సడలలేదు. వీరు చాలా ఉదాత్తంగా వ్యవహరించారు.

అగ్ర స్థావరాలలో తమ దళానికి ఆహార సరఫరాలు సమృద్ధిగా అందాయని మేజర్ సింగ్ అన్నారు. బట్టలు, వైద్య సౌకర్యాలు కూడా చక్కగానే వున్నాయని ఆయన తెలిపారు. చైనీస్ సైనికులు సరిగా తిండి పెట్టబడకుండా పశువుల మందలవలె యుద్ధరంగంలోకి పంపబడుతున్నట్లు కనిపించిందని ఆయన అన్నారు.

కాకినాడ, మచిలీపట్నం రేవులు

1962 అక్టోబరులో కాకినాడరేవుకు 13 స్టీమర్లు, ఒకఓడ వచ్చాయి. 15264 టన్నులు, 995 కేజీల సామాను ఎగుమతి చేయడం జరిగింది. 7,640 టన్నులు, 255 కేజీల సామాను దిగుమతి చేయడం జరిగింది. దిగువవస్తువులను ఎగుమతి చేశారు.

వస్తువులు			మె. టన్నులు
ముడిఇనుము	...	...	12,249.842
పొగాకు	...	...	1,740.634
తాటినార	...	...	546.044
తాటిబోదెలు	...	...	39.223
గేదెకొమ్ములు	...	...	1.280
చక్కెర	...	...	677.580
అన్నాట్టో విత్తులు	...	...	10.392
		మొత్తం	15264.995

దిగుమతి వస్తువులు

మూత్రిక	...	...	7,638.900
ఖాళీ గోనెసంచులు	...	...	1.350
		మొత్తం	7,640.250

ఈ నెలలో మచిలీపట్నంరేవుకు రెండు స్టీమర్లు వచ్చాయి. 21,130 మెట్రిక్ టన్నుల ముడిఇనుము ఎగుమతి చేయడం జరిగింది.

"భారతి" రచనలలో ఆంధ్ర ప్రశంస

వల్లా రాధాకృష్ణశర్మ

తమిళ నవయుగ ప్రవక్తగా, తమిళుల జాతీయ కవిగా నేటికీ ప్రస్తుతింపబడుతున్న సుబ్రహ్మణ్య భారతి 1882 వ సంవత్సరం డిసెంబరు 11 న తిరునెల్వేలి మండలంలోని ఎట్టయాపురంలో జన్మించాడు. 1921, సెప్టెంబరు 10 న మదరాసులోని తిరువళ్ళిక్కేణిలో మరణించాడు. అనగా, మరణించేనాటికి భారతి ముప్ఫయి తొమ్మిదేళ్ళవాడన్నమాట. అంత చిన్న వయస్సులోనే, ఆయన యెన్నో రచనలు చేశాడు. కవిత, కథానిక, గేయం, వ్యాసం — మొదలైన సాహిత్య ప్రక్రియ లన్నిటిలోనూ భారతి చక్కని,చిక్కని రచనలు సంతరించి, ఆధునిక తమిళ వాఙ్మయ వీధుల్ని సువిశాలం చేసి చిరయశస్సు గడించాడు. ఆయన రచనలు నేటి రచయితలు పలువురికి మార్గదర్శకం కావడం ఎంతైనా హర్షింపదగిన విషయం. ఆధునిక తమిళ పత్రికా రచనమీద కూడా ఆయన ప్రభావం ద్యోతక మవుతున్నది.

కొందరు భారతిని విప్లవ కవి అంటారు. కొందరి దృష్టిలో ఆయన గేయ కవి. కాని, సూక్ష్మంగా కనుక పరిశీలిస్తే, ఆయన ప్రముఖ తాత్త్వికు డనే విషయం అవగత మవుతుంది. ఆయన రచనలలో జాతీయతా దృష్టి, తాత్త్విక రహస్యములు, ప్రగతిశీలాత్మక భావములు, సంప్రదాయ విధేయత మొదలైనవి కానవస్తాయి.

సుబ్రహ్మణ్య భారతి గుణగణాలలో ప్రప్రథమంగా పేర్కొనదగింది ఆయన భాషా సహనం. ఆయన వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దింది యీ విశిష్ట గుణమే. ఇతర సమస్యలతోపాటు భాషా సమస్యలు కూడా తలెత్తుతున్న యీ దినాలలో భారతి వంటి విశాల హృదయుల అవసరం చాలా వున్నది.

భారతి బహుభాషా వేత్త. సంస్కృతం, తెలుగు, హిందూస్థానీ, ఇంగ్లీషు, ఫ్రెంచి మొదలైన భాషలతో ఆయనకు పరిచయం ఉన్నట్లు విజ్ఞులు చెపుతున్నారు. 'భారతి తెలుగులో బాగా మాట్లాడేవాడు; కాని వ్రాయడం, చదవడం తెలియదు —' ఈ విషయాలను భారతి సన్నిహితులలో ఒకరైన శ్రీ హరిహర శర్మగారి ద్వారా తెలుసుకున్నాను. భారతి మరణించిన రోజున శ్మశానవాటికలో '...శ్రీయుతులు శర్కరై సెట్టియార్, కృష్ణస్వామి శర్మ, రామచంద్ర అయ్యరు తమిళంలో మాటాడిన తర్వాత సురేంద్రనాథ్ ఆర్యా తెలుగులో ఉపన్యసించారు...' ఈ సురేంద్రనాథ్ ఆర్యా తెలుగువాడు. భారతితోపాటు, ప్రతి సభలోనూ ఆర్యా తెలుగులో గంభీరోపన్యాసం చేసేవాడట. 'వట్టి మీసాలుండి యేం లాభం? పౌరుషం వుండాలిగాని. రొయ్యకు లేదా బారెడు మీసం?' అంటూ ఉపన్యసించేవాడట ఆర్యా.

మహాకవి భారతి దృష్టిలో తెలుగు గానానుకూల మయిన భాష; సుందర మయిన భాష. భారతదేశం అనే గీతంలో ఇలా పేర్కొన్నాడు :

'విరియగాచిన వెన్నెల రాత్రిలో
చేరదేశపు చెలులు వెంటరాగ
సుందరాంధ్ర పదమ్ము పాడుచున్
సింధునదిని పడవ నడుపుచు నాడుదాం'

'మాతావిన్ దువజం' (మాతృ ధ్వజం) అనే మరో గీతంలో 'జ్ఞానసంపన్ను లయిన తెలుగువారు' అని తెలుగు వారిని ప్రశంసించాడు.

1916 లో భారతి 'సిలకవి యరశర్' (కొందరు కవిరాజులు) అనే ఒక ప్రశస్త మయిన వ్యాసం వ్రాశాడు. ఇందులో రామాయణ కావ్యకర్త అయిన కంబడు, తిరుక్కుఱళను సంతరించిన తిరువళ్ళువరు, సిలప్పదికార మనే కావ్యం రచించిన ఇళంగో పూజ్యపాదులు — మొదలైన కవిరాజులతో పాటు మహాకవి పోతనను కూడా భారతి సభక్తికంగా స్మరించాడు. అలాగే, మరో వ్యాసంలో సంగీత సార్వభౌము డగు త్యాగయ్యకు జోహారులర్పించాడు భారతి.

'చందిరికైయిన్ కదై' (చంద్రిక కథ) అనే నవలికలో భారతి కందుకూరి వీరేశలింగం పంతులు దంపతులను ప్రశంసించాడు. వీరేశలింగం పంతులుగారి యింట్లో విందు — అనే అధ్యాయంలో పంతులుగారి

గుణగణాలు కొన్ని పేర్కొనబడినవి. పంతులుగారంటే భారతికి ఎంత గాఢమయిన భక్తి వుండేదో యీ అధ్యాయం నుంచి తెలుసుకోవచ్చు.

తెలుగు భాషా సాహిత్యము లేకాక, తెలుగువారి రాజనీతిజ్ఞత కూడా సుబ్రహ్మణ్య భారతిని బహుధా ఆకర్షించినట్లు చెప్పవచ్చు. 1917వ సంవత్సరం జూను మొదటి తేదీని నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభను గురించి భారతి అమూల్యమయిన ఒక వ్యాసం వ్రాశాడు. దీని శీర్షిక 'తెలుంగ మహాసభై'. 1917, జూను 9న వెలువడిన యీ వ్యాసాన్ని శక్తిదాసన్ అనే మారుపేరుతో భారతి వ్రాశాడు. ఈ వ్యాసంలోని కొన్ని భాగాలను యథాతథంగా ఇక్కడ ఉదాహరిస్తున్నాను.

"గత శుక్రవారంనాడు (జూన్ 1) నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభలో సభాధ్యక్షులు శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులు చేసిన ఉపన్యాసము గమనింపదగింది. రాజనీతిశాస్త్రములో తెలుగువారికి గల ప్రావీణ్యము చాల ప్రాచీనమయినది. పాటలీపుత్ర నగరంలో వర్ధిల్లిన ఆంధ్ర రాజ్యమూ, తరువాతి కాలమున తమిళనాడును పరిపాలించిన విజయనగర సామ్రాజ్యమూ పేర్కొనదగినవి! తెలుగువారు తమిళుల్ని పరిపాలించిన చిహ్నాలు మన భాషలోనూ, నిఘంటువులలోనూ చెరగని ముద్రలుగా నిలిచిపోయినవి. మన సంగీత నాట్య శాస్త్రాలుకూడా నేటికీ తెలుగులోనే మునిగి వున్నవి. సంగీత విద్వాంసులు పాడే కీర్తనలలో ఉత్తమమైనవి తెలుగు కీర్తనలే. నాట్యం చేసేటప్పుడు దేవదాసీలు పాడే వర్ణములూ, జావళీలు మొదలైనవాటిలో కూడా రుచికరమయినవి తెలుగు భాషలోనివే. మన గ్రామాలలో నివసిస్తున్న తెలుగు రెడ్లు, నాయుళ్లు, తెలుగు బ్రాహ్మణ పురోహితులు, తెలుగు దేవదాసీలు రాయలవారి కాలములో యిక్కడికి వచ్చి స్థిరపడినవారే. వివాహ సమయంలో పాడే పాటా, లాలీ మొదలైనవన్నీ కూడా తెలుగువారి సంప్రదాయానికి చెందినవే. మన భాషలో సొగసు, హెచ్చరిక, దొర, వాడిక, కొంచెం మొదలైన నూర్లకొలది తెలుగు మాటలు కలసిమెలసి పోయినవి. తెలుగువారి యేలుబడిలో తమిళదేశంలో అధర్మం అన్నది లేదు. తమిళులకు ఒక న్యాయమనీ, తెలుగువారికి మరొక న్యాయమనీ ఉండేది కాదు. తెలుగుజాతి రాజనీతి శాస్త్రములో ఆరితేరిన జాతి.

ఈ రోజులలోకూడా తమిళులకంటె తెలుగుదేశపువారే రాజకీయ వ్యవహారాలలో ఎక్కువ శ్రద్ధవహిస్తున్న విషయాన్ని పై అంశాలకు చక్కని ఉదాహరణగా చూపవచ్చు.....ప్రజాభ్యున్నతికి తోడ్పడే మంచి పనులలో తెలుగువారు తమ తెలివితేటలను వినియోగిస్తున్నారు. స్వరాష్ట్ర సంపాదన విషయంలో ఇప్పుడు తెలుగువారిలో కాన వస్తున్న శ్రద్ధాసక్తులలో నాలుగులో ఒకవంతుకూడా తమిళులలో కనబడడం లేదు. గత శుక్రవారంనాడు నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభా మండపం వందేమాతరం అనే నినాదంతో ప్రతిధ్వనించిందని తెలియ వస్తున్నది..."

భాషా సహనం, మత సహనం, జాతీయతాదృష్టి మూర్తీభవించిన సుబ్రహ్మణ్య భారతి అకాలమరణమునకు గురికావడం మన దురదృష్టం అనకతప్పదు. 'ముప్పయి కోట్ల ముఖాలు వున్నా, ఆమె శరీరం ఒక్కటే. పదునెనిమిది భాషలు వ్యవహరించినా, భావం మాత్రం ఒక్కటే–' ఇలా ఆనాళ్ళలోనే భారత జాతియంతా ఒక్కటే అనే భావాన్ని తన రచనలద్వారా ప్రచారంచేసిన సుబ్రహ్మణ్య భారతి చిరస్మరణీయుడు! భారతి సాహిత్యం అవశ్య పఠనీయం!

చైనా దురాక్రమణదారును తరిమికొట్టేవరకూ బాహ్యాలంకరణలపై వ్యామోహం వదులుకోవాలి. మనకు వున్న అందంతోనే సంతృప్తి పడాలి.

—శ్రీమతి లక్ష్మీమేనన్.

ఎవడురా?

"తంగిరాల"

ఎవడురా, నా తల్లి
దివ్య మకుటంపైకి
చెయ్యి చాపినవాడు ?

ఎవడురా మూర్ఖుండు
నిదురించు మృగరాజు
జూలు లాగినవాడు ?

ఎవడురా, ఆ తులువ,
అవభృథ స్నానాన
అతి పవిత్రంబైన
రాజ్ఞి వేణినిబట్ట
డాయు దుశ్శాసనుడు ?

శాంతి సరసున నాడు
కాంతి తరగల నెల్ల
కల్లోల మొనరించు
కాళీయు డెవడురా ?

రాకాసి మూకలకు
రామ బాణం నేను !
కబంధ హస్తాలు
ఖండింతు త్రుటిలోన !

కనుతెరచి, మెడదులిపి,
కడలు బీటలువార
గర్జించి, నిర్జించి,
కుంభి కుంభస్థలము
ఖండించి, కబళించు
చండ సింహం నేను !!

విష రుధిరములు క్రక్క
పడగ పడగను త్రొక్కి
మదమంత మర్దించి
భరతజాతిని గాచు
బాలకృష్ణుడ నేను !
బలహీనుడను గాను !!

మన్ను కాదలచియా
ఎన్ని గుండెలవాడు
గాండీవి కెదురుగా
నిలబడ్డ మొనగాడు ?

పాంచజన్య ధ్వనుల
ప్రాణాలు పిండుతూ,
జగజట్టి 'జవహరుడు'
స్యందనం నడుపగా—
భరతవీరుల రుధిర
ప్రభలతో వెలుగొంది,

దిక్కు దిక్కుల మ్రోగు
దేవదత్తం ఊది,
పాశుపతమును బట్టి
పార్థుడై వచ్చాను !!

భరతభూమిని మ్రింగి
బ్రతుకగ నీ తరమురా ?
నిలువరా ? నిలువరా ?
నీతిమాలినవాడ !!

నా తాత, ముత్తాత,
సంజాతి వీరులూ,
నా దేశ శూరులూ,
నా రక్త నాళాల
వీణ మ్రోయించారు !
నా గుండె నెత్తురులు
నాట్య మాడించారు !!

వేయి అంచుల పెట్టు
శిరసు ప్రక్కలు కొట్ట
వజ్రాయుధము పట్టి
వచ్చియున్నానిదిగో !!

ఎవడురా ? ఎవడురా ?
ఎవడురా ? నా తల్లి
దివ్య మకుటంపైకి
చెయ్యి చాపినవాడు ? ★

పారిశ్రామిక విశేషాలు

కేంద్రరంగం

సనత్‌నగర్‌లోని సింథెటిక్ ఔషధాల ప్రాజెక్టుకు చెందిన పనులు నిర్ణీత కార్యక్రమం ప్రకారం కొనసాగుతున్నాయి. రష్యానుండి యంత్రసామగ్రితో వచ్చే మొదటి నౌక కొద్ది రోజులలోనే విశాఖపట్నం చేరుకుంటుందని ఆశించటం జరుగుతున్నది. 1964 సంవత్సరం ఆఖరు వరకు మొత్తం యంత్ర సామాగ్రి వస్తుందని ఆశిస్తున్నారు. సివిల్ పనులు శీఘ్రగతిని కొనసాగుతున్నాయి.

రాష్ట్రరంగం

రాష్ట్రంలో దుక్క-ఇనుము ప్లాంటును నెలకొల్పడానికై ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషను ఇచ్చిన దరఖాస్తును భారతప్రభుత్వం పరిశీలిస్తూఉంది. భారత ప్రభుత్వం ఆమోదించిన రెండు ప్లాంట్ల (సంవత్సరానికి లక్ష టన్నుల చొప్పున ఉత్పత్తి శక్తి గల) కు తోడు ఇది ఒకటి.

హైటెన్షన్ లోటెన్షన్ ఇన్సోలేటర్లు, బాల్, ట్యాపర్డుబియరింగ్స్ సమీకృత గ్లాస్ ప్రాజెక్టులను నెలకొల్పడానికై ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ ఇచ్చిన దరఖాస్తులను లైసెన్సింగ్ కమిటీ ఆమోదించింది.

ప్రైవేటు రంగం

అదనంగా సంవత్సరానికి 1600 టన్నుల శక్తితో ఫినాలిక్, మెలామిన్, లామినేటు షీట్లు, రాడ్లు, ట్యూబులను ఉత్పత్తి చేయడానికి హైదరాబాదు లామినేటెడ్ ఉత్పత్తుల లిమిటెడ్ వారికి భారత ప్రభుత్వం లైసెన్సు జారీ చేసింది.

కడప జిల్లాలోని ఎర్రగుంట్లలో సంవత్సరానికి 2 లక్షల టన్నుల ఉత్పత్తి శక్తిగల ఒక సిమెంటు ఫ్యాక్టరీని నెలకొల్పడానికి భారత ప్రభుత్వం స్థూలంగా ఆమోదాన్ని తెల్పింది.

పారిశ్రామిక వేత్తలకు సదుపాయాలు

కొన్ని మునిసిపాలిటీలలో పరిశ్రమలకు సరఫరా చేసే నీటికి ఎక్కువ రేట్లు విధిస్తున్న కారణంగా (పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడానికి వీలుగా) గుంటూరు, విజయవాడ, కాకినాడ, రాజమండ్రి మునిసిపాలిటీల కమీషనర్లకు ప్రభుత్వం తగిన ఉత్తర్వులను జారీ చేసింది. రోజుకు 50,000 గ్యాలనులకు మించిన నీటి సరఫరాకు 1000 గ్యాలనులకు రు. 2/- ల చొప్పున తగ్గింపు రేటుతో ఇవ్వాలని అందులో పేర్కొనడం జరిగింది. రోజుకు 1 లక్ష గ్యాలనులు అంతకు మించి నీరు వాడే వాడకందార్లందరికి 1000 గ్యాలనులకు రు. 2/- ల చొప్పున తగ్గింపు రేటుకు ఇవ్వడానికి విశాఖపట్నం మునిసిపాలిటీ కమీషనరు, స్పెషల్ అధికారికి ప్రభుత్వం అధికారం ఇచ్చింది. ట్రాన్స్‌వర్స్ టెస్టింగ్ మిషనుల విడుదల ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహించిన పరిశ్రమలశాఖ మాజీ కార్యదర్శి శ్రీ ఐ. జె. నాయుడు ప్రసంగిస్తూ సత్వర పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని, క్రొత్త పరిశ్రమలను నెలకొల్పే పారిశ్రామిక వేత్తలకు తగిన సదుపాయాలను కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు.

పబ్లిక్ రంగం

సింగరేణి బొగ్గుగనులు : సింగరేణి బొగ్గుగనుల గ్రూపులో గత సంవత్సరం 2,49,195-5 టన్నుల బొగ్గు ఉత్పత్తికాగా 1962 సెప్టెంబరు నెలలో 2,78,808 టన్నుల ఉత్పత్తి జరిగింది.

గత సంవత్సరం బొగ్గు ఉత్పత్తి 20,00,023 మెట్రిక్ టన్నులు కాగా 1962 సెప్టెంబరు నెలలో 22,50,156 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగింది.

నిజాం చక్కెర ఫ్యాక్టరీ : రెండవ ఫ్యాక్టరీలో 1962-63 వ సం॥ క్రషింగ్ సీజన్‌కు 1962 అక్టోబరు 19 వ తేదీన నిజాం చక్కెరఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టరు శ్రీ ఆర్. విఠల్‌రావు, ఐ. ఎ. యస్. ప్రారంభోత్సవం చేశారు. 1962 అక్టోబరు 22 వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రెవిన్యూ మంత్రి శ్రీ యన్. రామచంద్రారెడ్డి, మొదటి ఫ్యాక్టరీకి ప్రారంభోత్సవం చేశారు.

1962-63 వ సంవత్సరంలో మొత్తం 6,50,000 టన్నుల చెరకును క్రష్ చేయడం జరుగుతుందని అంచనా.

చెరకుగడ సరఫరా : 1962 అక్టోబరు నెలలో ఫ్యాక్టరీ క్షేత్రాలనుండీ, రైతుల నుండీ దిగువ మొత్తాలలో చరకుగడను స్వీకరించడం జరిగింది :

1. ఫ్యాక్టరీ లైట్ రైల్వే	14,891.135
2. సెంట్రల్ రైల్వే	4,980.260
3. రోడ్డుద్వారా	10,886.325
మొత్తం టన్నులు :	30,757.720

వేతనాల సంఘం సిఫారసులు : వేతనాల సంఘం సిఫారసులను అనుసరించి నిజాంచక్కెర ఫ్యాక్టరీలోని నామినల్ మస్టర్ రోలు (యన్. యం. ఆర్) పని వారలకు 1960 నవంబరు 1 వ తేదీ నుండి 1961 అక్టోబరు 31 వ తేదీవరకు గల వేతనాల బకాయిలను చెల్లిస్తున్నట్టు మేనేజిమెంటు ప్రకటించింది. పై పని వారలకు వేతనాల సంఘం సిఫారసులు అన్వయింపబడినాయి. 1961 నవంబరు 1 వ తేదీ నుండి యీ బకాయిలు చెల్లింపబడుతున్నవి.

పై ప్రకటనను అనుసరించి 1962 అక్టోబరు మొదటి వారంలో చెల్లింపులు జరిగాయి.

బోనసుపై అదనంగా ఫెస్టివల్ అడ్వాన్సులు : నెలకు రు॥ 500/— లవరకు వేతనంపొందే పనివారలకు సంవత్సరంలో ఇచ్చిన ఫెస్టివల్ అడ్వాన్సులకు అదనంగా దీపావళి పండుగకు ప్రత్యేక ఫెస్టివల్ అడ్వాన్సును మేనేజిమెంటు మంజూరు చేసింది. 1961—62 వ సంవత్సరంలో వారికి చెల్లింపబడే బోనసు నుండి దిగువ విధంగా పై అడ్వాన్సును పూర్తిగా మినహాయించడం జరుగుతుంది.

రు॥ 149 ల వరకు వేతనంపొందే పనివారు చెల్లించిన అడ్వాన్సు రు॥ 60.

రు॥ 150 నుండి 300 వరకు చెల్లించిన అడ్వాన్సు రు॥ 84.

రు॥ 301 నుండి 500 వరకు చెల్లించిన అడ్వాన్సు రు॥ 96.

జాతీయ రక్షణనిధి : నిజాంచక్కెర ఫ్యాక్టరీ జనరల్ మేనేజరు విజ్ఞప్తిని పురస్కరించుకొని నిజాంచక్కెర ఫ్యాక్టరీ పనివారలూ, కాలనీలోని నివాసితులూ తమ ఒక రోజు వేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చారు. హెడ్ క్వార్టర్సులోని సిబ్బంది సభ్యులు కూడా ఒక రోజు వేతనాన్ని రక్షణనిధికి విరాళంగా ఇచ్చారు.

గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా

1962 అక్టోబరులో పశ్చిమ గోదావరిజిల్లా, ఏలూరు తాలుకాలోని కొమదవోలు గ్రామానికి విద్యుచ్ఛక్తిని సరఫరా చేయడం జరిగింది.

1962 సెప్టెంబరులో శ్రీకాకుళం జిల్లాలోని దిగువ గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయడం జరిగింది.

కొర్లకోట, కలివరం, తొగరం (శ్రీకాకుళం తాలూకాలోవి) 1962 అక్టోబరులో కడపజిల్లా, కమలాపురం తాలుకాలోని ఎల్లారెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాలకుకూడా విద్యుచ్ఛక్తిని సరఫరా చేశారు.

స్వీడన్ దృష్టిలో
చైనా దురాక్రమణ

శాంతియుతంగా వుండడానికి ఎనిమిది సంవత్సరాల క్రితం సంతకం చేసిన ఒప్పందాన్ని చైనా బాహాటంగా ఉల్లంఘించిందనీ, భారతదేశంపై దురాక్రమణ చర్యకు దిగిందనీ, ఈవిధంగా ఇతర ఆసియా ప్రజలు భారతదేశపు ప్రజాస్వామిక విధానాన్ని కాక చైనా కమ్యూనిస్టు పంథాను అనుసరించేలా చేయడానికి ప్రయత్నిస్తున్నదనీ స్టాక్‌హోమ్ నుంచి వెలువడే "స్టాక్‌హోమ్స్ టిడ్‌నాజెన్" అనే దినపత్రిక నొక్కివక్కాణించింది.

భారత చైనా దేశాలు ఎనిమిదేండ్ల క్రిందట, శాంతియుతంగా వుండడానికీ, ఒక దేశపు ప్రాదేశిక సమగ్రతను మరో దేశం గౌరవించడానికీ, ఒక దేశపు ఆంతరంగిక విషయాల్లో మరో దేశం జోక్యం కలిగించుకోకుండా వుండడానికీ తమ సమ్మతిని తెలియజేస్తూ ఏకకాలంలో ప్రకటనలు చేశాయి.

1955 వ సంవత్సరం-వసంతఋతువులో బాండుంగ్‌లో జరిగిన 29 ఆఫ్రికా, ఆసియా దేశాల మహాసభలో "పంచశీల" లోని అయిదు సూత్రాలనూ, శాంతియుత సహజీవన సిద్ధాంతాన్నీ గట్టిగా సమర్థించి ఆమోదించారు. ఈ దేశాల మధ్య మైత్రిపూర్వకమైన సంబంధాలకు "పంచశీల" ప్రాతిపదికగా పరిగణించబడింది. చైనా భారతదేశంపై దురాక్రమణ జరిపి ఈ సూత్రాలను బాహాటంగా ఉల్లంఘించింది కాబట్టి బాండుంగ్ సమావేశంలో పాల్గొన్న ఇతర దేశాలపై దీని ప్రభావం తీవ్రంగా వుంటుంది. పెకింగ్ అనుసరించిన ఈ విధానం ఆసియాలోని అనేక ప్రాంతాలవారికి వ్యాకులత కలిగించిందనడంలో సందేహంలేదు. అయితే ఇండియా వాదంతో ఏకీభవించడానికి ఎవ్వరూ దృఢవైఖరి అవలంబించినట్లు లేదు.

విభజించడం ద్వారా విజయం సాధించడానికి చైనా ప్రయత్నిస్తుండడమే బహుశా దీనికి కారణం కావచ్చు. ఇండియాను ఏకాకి చేయడానికి పెకింగ్ ప్రభుత్వం పాకిస్తాన్, ఇండోనీషియా, బర్మా మొదలైన ఇతర ఆసియా దేశాలపట్ల మృదు వైఖరిని ప్రదర్శిస్తున్నది. ఇది బహిరంగంగా, సుస్పష్టంగానే జరుగుతున్నది. బర్మాతోగల మిత్రత్వం, పరస్పరం దురాక్రమణ జరపుకోకుండా చేసుకున్న ఒప్పందం ద్వారా చైనా 1960 జనవరిలో బర్మాను ఆనుకొనివున్న తన సరిహద్దును స్థిరీకరించుకుంది. ఆసందర్భంగా కొన్ని స్వల్ప సర్దుబాట్లు జరిగాయి. తత్ఫలితంగా బర్మా తాను ఇచ్చినదానికంటే కొంచెం ఎక్కువగానే పుచ్చుకుంది.

శుష్క వాదం

ఇప్పటి వింత విషయమేమంటే చైనా, బర్మాల సరిహద్దూ, మక్‌మహన్ రేఖా — రెండూ ఒకటే. ఇంకోవిధంగా చెప్పాలంటే ఇది 1914 వ సంవత్సరంలో జరిగిన సిమ్లా సమావేశంలో రూపొందించబడిన రేఖలో భాగమే. భారతదేశం విషయం వచ్చేసరికి మక్‌మహన్ రేఖ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు సృష్టించినదని చైనా అంటున్నది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు చైనా అధీనంలోని టిబెటుకు చెందిన కొంతప్రాంతాన్ని కబళించగా దానిని ఇండియా వారసత్వంగా పొందడానికి ప్రయత్నిస్తున్నదని చైనా ఆరోపించింది.

బర్మాను ఆనుకొనివున్న తన సరిహద్దు విషయంలో చైనా, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నిర్ణయాన్నే చాలావరకు ఆమోదిస్తున్నది. సిమ్లాలో జరిగిన సమావేశంలో చారిత్రక, భౌగోళిక అంశాల ఆధారంగానూ, మత పరిస్థితులు, సంప్రదాయాల ఆధారంగానూ ఎల్లలను ఏర్పరచడం జరిగింది. టిబెటు, చైనా, భారతదేశాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అప్పుడు ఈవిధంగా సరిహద్దుల స్థిరీకరణ జరిగినప్పుడు దేనికీ చైనా తన అభ్యంతరం తెలపలేదు. అంతకు

ముందూ ఆ తరువాతకూడా చైనీయులు దీనిని సాధారణంగానే ఆమోదించడం జరిగింది.

చైనా, ఇండియాల సరిహద్దు సక్రమమైనదని తాను భావించడంలేదనీ అయినప్పటికీ చైనా, భారతదేశాల మధ్యగల స్నేహ సంబంధాలదృష్ట్యా దీనిని పెకింగ్ ఆమోదించిందనీ చైనా ప్రధాని శ్రీ చౌ-ఎన్-లై 1958వ సంవత్సరంలో తెలిపారు. వేల సంవత్సరాలనాటి భారతీయ సాంస్కృతిక కేంద్రాలు అలరారుతున్న ప్రదేశాలను ఇప్పుడు చైనా తనవిగా వాదిస్తున్నది. అంతర్జాతీయ న్యాయసూత్రాలదృష్ట్యా చైనా చేస్తున్న ఈవాదంసహజంగానేనిలవజాలదు. బాధ్యతగల ప్రభుత్వాలు ఆమోదించిన ఈ సరిహద్దు, చారిత్రకంగా కూడా ఆమోదయోగ్యమైన ఈ సరిహద్దు సక్రమమైనది కానట్లయితే ఇక ఏ సరిహద్దులుకూడా సవ్యమైనవి కానేరవు. ఈ లెఖ్ఖన చైనా, సోవియట్ యూనియన్‌ల సరిహద్దును కూడా రష్యా సామ్రాజ్యపు ఇంపీరియలిస్టులు ఏర్పరిచినదే ననవచ్చు. చైనా, సరిహద్దు సర్దుబాట్లను కోరడంలో ఇక తనవంతు రావచ్చుని బహుశా రష్యా తలపోస్తుండవచ్చు. లోగడ సోవియట్ యూనియన్ భారతదేశానికి ఇతర సహాయాలతోపాటు కొన్ని ఆయుధాలను సరఫరా చేయడానికికూడా సుముఖత తెలిపింది. అయితే ఇటీవల రష్యా ఢిల్లీ ప్రభుత్వంపట్ల అవలంబిస్తున్న వైఖరిలో తటపటాయింపు కానవస్తున్నది. ప్రస్తుత ప్రపంచ రాజకీయ సంక్షోభ పరిస్థితుల్లో తూర్పు రాజ్యాల కూటమిలోనే పరస్పర ఐక్యతపై కొత్తగా వత్తిడి తేకూడదని నిశ్చయించుకోవడమే బహుశా దీనికి కారణం కావచ్చు.

చైనా భారతదేశంపట్ల పూర్తిగా దురాక్రమణ విధానాన్ని అనుసరిస్తున్నదనే సంగతి ఆసియా, యూరపుదేశాల్లో అందరికీ స్పష్టంగా తెలిసిపోయింది. నిరుపయోగమైన పర్వత ప్రాంతాలకు ఆశించే చైనా అపఖ్యాతి పాలవుతుందనుకోడం సమ్మదగిన విషయంకాదు కనుక ఆసియాలో తన ఆధిపత్యాన్ని సంపాదించుకోడానికి సాగిస్తున్న పోరాటమే ఇది. కమ్యూనిజం ప్రభావాన్ని అజేయమైన దాని శక్తిని ప్రదర్శించే ఉద్దేశంతో భారతదేశాన్ని శక్తిహీనం చేయడానికీ, దాని ఆర్థిక పునర్నిర్మాణ కృషిని భంగపరచడానికీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. అన్య ఆసియా వాసులు భారతదేశపు ప్రజాస్వామిక విధానాన్నికాక చైనాయొక్క కమ్యూనిస్టు పంధానే అవలంబించేలా చేయడానికి ప్రయత్నాలు సాగాయి. ఉత్తరోత్తరా చైనా సామ్రాజ్య విస్తరణ కాంక్షకు పూర్తి ఆసియాయేకాక రష్యాలోని ఆసియా భాగంకూడా బహుశా గురికావచ్చు.

నదీ పరీవాహక ప్రాంతం అంటే....?

ఒక నదియొక్క నదీగర్భాన్ని మరొక నదినుంచి వేరుచేసే ఉన్నత ప్రదేశాన్ని నదీ పరీవాహక ప్రాంతం అంటారు. ఒకనదీగర్భాన్ని మ్యాపుపై దాని ఉపనదులకు ఇతర నదుల ఉపనదులకు మధ్య ఒకగీత గీయడంద్వారా చూచాయగా తెలుసుకోవచ్చు.

ఒక ప్రధాన నదీ పరీవాహక ప్రాంతం ఒక నదీగర్భాన్ని, మరొకనదినుంచి వేరుచేస్తుంది. ఇక రెండవ నదీపరీవాహక ప్రాంతం అదే నదియొక్క ఉపనదులను వేరు చేస్తుంది. అలాగే ఆ ఉపనదుల యొక్క ఉపనదులను వేరుచేసే ఇతర నదీ పరీవాహక ప్రాంత విధానాలుకూడా వుంటాయి.

(హిమాలయ "నదీ పరీ వాహక ప్రాంతం" అనేమాట ప్రస్తుతం సరిహద్దు పరిస్థితికి సంబంధించిన వార్తలలో ఎక్కువగా వినిపిస్తున్నది)

దేశంకోసం...

త్రిపురనేని సుబ్బారావు

ఒకప్పుడా ప్రాంతమంతా నిర్జనంగా ఉండేది. తుషార మేఘాలను చుంబించే మహోన్నత హిమాలయ శిఖరాలు, అగాధమైన లోయలు, లోయలను వొరుసుకుంటూ రొదలతో పరుగెత్తిపోయే హిమవాహినులు, ఆ ప్రవాహాలలో, రాశిపోసిన వెండిపుద్దల్లా, సోమరిగా తేలిపోతున్న మంచు పలకలు – పచ్చని పసిరికతో మైదానమంతా, గరుడ పచ్చలు ఆరబోసినట్లుగా ఉండేది. కొండల మీద ప్రారంభమయి, మైదానాన్ని కలుపుకొని, సుదూరాలలోకి సాగిపోయిన చిత్తడి అడవుల్లో, చిత్రవర్ణాలతో భాసించే పుష్పాలు, గత స్మృతులను, వర్తమానంలో మేల్కొలుపుతూ కొండచరియలను రంగులతో మెరిపించి, మురిపించి, మంచుజల్లులకు తడిసి, నేలకు రాలిపోతూ ఉండేవి.

వంద సంవత్సరాల క్రిందట అస్సాం ఉత్తర సరిహద్దులను వదలివేసిన "భోలా" పూర్వీకు లొకరు, యీ ప్రాంతం వచ్చారు. ఇక్కడే స్థిరపడి పోయారు. ఆయన పేరు ''టోంగ్డా''. ఆ పేరు మీదుగానే, ఆ గ్రామాన్ని యీ నాటికీ పిలుస్తూ ఉంటారు. ఆ వంశీకులే యీ నాటికీ, ఆ గ్రామ నాయకులుగా ఉంటూ వచ్చారు.

టోంగ్డా గ్రామస్థులు అందరూ కష్టజీవులు. వారికి మొన్నమొన్నటివరకు వ్యవసాయమంటే ఏమిటో తెలియదు. గొర్రెల పెంపకమే వారి ప్రధాన వృత్తి. సంవత్సరానికి మూడుసార్లు వాళ్ళు పండుగలు జరుపు కొంటూంటారు. ఆ ఉత్సవాలు. మహదానందకరంగా జరుగుతుంటాయి. సాంప్రదాయబద్ధమైన వాద్యాలతో స్త్రీలు, పురుషులు, పిల్లలు, పెద్దలు చేతులు కలుపుకొని వలయాకారాలుగా తిరుగుతూ నృత్యం చేయడం ఆనవాయితీ. నిర్మలమయిన కంఠాల నెత్తి జీవనశక్తినంతా నాదంలో ప్రోదిచేసి, హిమాలయ కందకాలు మారుమ్రోగేలా గానంచేస్తూ ఉండేవారు. తనలోని లయకాంక్షను ఆచుకోలేని ప్రకృతి, యీ రూపంలో తన తమిని తీర్చుకొంటున్నదేమో అనిపిస్తుంది.

వంద కుటుంబాలకూ కలిపి నాలుగు, ఐదు వేల గొర్రెలు ఉన్నాయి. రాత్రింబవళ్ళు చిట్టడవుల్లో పసరిక మైదానాల్లో, పర్వతాల పాదాలదగ్గర, నదీప్రవాహాల పరిసరాల్లో, గొర్రెలను మేపుకుంటూ, వెదురు బూరలతో పాడుకుంటూ, హిమగిరులంత స్వచ్ఛంగా, నిర్మలంగా వారు జీవించేవారు.

భోలాకు నాలుగువందల గొర్రెలు ఉన్నాయి. వాటిని మేపుకుంటూ అతనెప్పుడూ మైదానంలోనే ఉండేవాడు. ఎప్పుడోగాని ఇంటికి వచ్చేవాడుకాదు. అతని భార్యే, భోలాకు ఆహారం పట్టుకెడుతూ ఉండేది. భోలాకు భార్యంటే ఎంతోయిష్టం. ఆవిడ 'ఛాంగ్లా' వంశానికిచెందినది. వందమంది కన్యల్లోనుండి 'కింజాం'ను ఎన్నుకొన్నాడు భోలా. పెళ్ళయిన తరువాత ఇద్దరూ 'ఛోమోలుంగ్మా' దర్శించి వచ్చారు.

రెండో సంవత్సరం తిరగకముందే, కింజాంకడుపు పండింది. అడవితామర మొగ్గలాంటి కొడుకును భోలాకు అందించింది. భోలా ఆ బిడ్డనుచూసి ఎంతగామురిసిపోయాడంటే – ఆనందాన్ని ఆచుకోలేక, వెర్రిగా కేకలువేశాడు. కింజాంను రెండు చేతులతోనూ ఎత్తుకొని పసిపిల్లను ఎగరేసినట్లు ఎగరేశాడు. ప్రాణాలన్నీ కళ్ళల్లోకి తెచ్చుకొని కింజాం కనుపాపల్లో తనను తను వెదుక్కున్నాడు. ఊరు ఊరంతా మంచుపడుతున్నా లెఖ్ఖచేయకుండా మైదానంలో పోగుపడింది. రెండురోజులపాటు పాటలతో, ఆటలతో టోంగ్డా లోయ ప్రతిధ్వనించిపోయింది. రెండవరోజు సాయంత్రం, భోలా కొడుకు నెత్తుకునివచ్చాడు. ఓ క్షణం అంతటా నీరవత, శబ్దంకూడా శిలారూపం దాల్చినట్లనిపించింది.

సంధ్యారుణకిరణాలు, శ్యామలాకాశాన్ని వెలిగించాయి. శిఖరాలను ముసిరే మేఘాల నీడలు, అడవిపూల పరిమళాలతో కలిసి,

గాలిలో తేలిపోతున్నాయి. నీడలు, పాముల్లా బుసలుకొడుతూ, తూర్పుగా పారిపోతున్నాయి. లోయ లోయంతా బంగారు కాంతిలో మునిగిపోయింది.

భోలా బిడ్డను చేతితో పైకెత్తి "నాంగ్యాల్ మింగ్రాం" అని అరిచాడు. ఆ పేరే అతనికి ఖాయమయిపోయింది. కొంతకాలం పాటు భోలా గొఱ్ఱెలుకాయడానికి వెళ్లలేదు. అస్తమానమూ, "నాంగ్యాల్ మింగ్రాం"ను చూస్తూ ఉండేవాడు. వాడు గాఢంగా నిద్రపోతున్నా సరే, కింజాం వద్దువద్దని మొత్తుకుంటున్నా సరే వినేవాడు కాదు. సింహంలాగా మంచము మీద పడి, బిడ్డణ్ని ముద్దులతో ఉక్కిరి బిక్కిరి చేసేవాడు. మింగ్రాం గిలగిలలాడి పోతుంటే, భోలా ఇంటి కప్పెగిరి పోయేలాగా నవ్వేవాడు.

కింజాం అనేకసార్లు భర్తను మందలించింది. తోటివారి గొఱ్ఱెలు దుక్కల్లా గునగునలాడుతూ ఉంటే, మనమంద యీసురోమంటున్నదని గునిసేది. 'మింగ్రాం' కు మంచి మంచి దుస్తులు రావాలంటే, గొఱ్ఱెలమంద బాగా ఉండాలనీ, అస్తమానమూ, బిడ్డకి ఎదురుగా ఉంటే — గొఱ్ఱెల కడుపు నిండదనీ గొణుగుతుండేది. భోలాకు ఇక విధిలేకపోయింది. ప్రాణాలను 'నాంగ్యాల్' దగ్గరే ఉంచి, శరీరాన్ని గొఱ్ఱెలవెంట మైదానాలకు చేరవేస్తుండేవాడు. ఎక్కడ ఉన్నా నాంగ్యాల్, కింజాం అతని కళ్ళల్లోనే మెదులుతూ ఉండేవారు. మంచు బెబ్బులి లాంటి కొడుకును టోంగ్దా వంశానికిచ్చినందుకు గాను, కింజాంను అతనెంతో మెచ్చుకునేవాడు. అన్నం తీసుకొనివచ్చినప్పుడు కింజాంతో కబుర్లు ప్రారంభించేవాడు. ఎంతకూ ఆమెను కదలనిచ్చేవాడు కాదు. "నాంగ్యాల్ — ను కూడా తీసుకురాక పోయావా'' అని అనేవాడు. "నా కోసం ఏడుస్తున్నాడా ?'' అని గుచ్చిగుచ్చి అడిగేవాడు. "సింహంలాంటి కొడుకునిచ్చావ్'' అంటూ కింజాం వేపు కన్నార్పకుండా చూసేవాడు. ఆ చూపుల్లోని కృతజ్ఞతాభావానికి. కింజాం తన్మయురాలయిపోయేది. తనలోకి తనే ముడుచుకుని పోయేది.

ఎండ మిటమిటలాడుతోంది. మంచు పొరలు కరిగి, రవసెల్లా-ల్లాంటి ఆవిరి తెరలు, మెల్లగా సుడులు తిరుగుతున్నాయి. గొఱ్ఱెలు, నిశ్శబ్దంగా, మైదానమంతటా తిరిగి మేస్తున్నాయి. వాటికేసి ఒకసారి చూసి, బద్ధకంగా మెటికలు విరుచుకొన్నాడు భోలా. శరీరాన్ని విదిలించుకొని, నుదుటిమీద అరచేయి పెట్టుకుని, మునికాళ్ళమీద నిలబడి, జెర్రిగొడ్డులా మెలికలు తిరిగి, కొండ మలుపులో మాయమైన దోవకేసి చూశాడు. భార్యవస్తున్న జాడలేదు.....భోలాకు ఏమీ తోచలేదు. వేళ తప్పకుండా వచ్చే కింజాం ఇంకా అన్నం తీసుకు రాలేదు. ఎందుకని ?

ప్రతిరోజూ ఆవేళప్పుడు భోలా అన్నం తింటూండేవాడు. కింజాం అతనికి కబుర్లు చెబుతూ ఉండేది. మధ్య మధ్య, ఒక్కో రొట్టె తుంపును, గొర్రె మాంసంతో చేర్చి భార్య నోటికందించేవాడు భోలా. ఆమె వద్దంటూనే, దాన్ని అందుకొనేది. కాస్సేపు గొఱ్ఱెలను అటూ ఇటూ అదిలించేది. సందెడు అడవి పూలను కోసుకొని, తిరిగి తిరిగి చూసుకుంటూ, వెళ్ళిపోయేది. కొండమలుపు తిరిగేదాకా భార్యనే చూస్తూ ఉండేవాడు భోలా.ఆమె కొండచాటుకు వెళ్ళగానే, గట్టిగా నిట్టూర్చేవాడు.

ఈ సంగతులన్నీ భోలాకు జ్ఞాపకం వచ్చాయి. తనూ, కింజాం మామూలుగా భోజనం చేసే చెట్టు దగ్గరికొచ్చాడు. శూన్యంగా, ఆ నీడలకేసి చూశాడు. దుఃఖంతో చలించి పోతున్నట్లుగా నీడలుకూడా కదిలిపోతున్నాయి. దూరంగా తుపాకులు మ్రోగిన చప్పుడు గాలిలో తేలుతూ వినిపించాయి. అటువంటి చప్పుళ్ళు హిమాలయ పర్వతాలకు ఇదే మొదటిసారిగా వినిపించటం.

భోలా కేమీ తోచలేదు. పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు. కోపంతో కంపించిపోయాడు. ఓ పెద్దరాయిని బలవంతాన కుళ్ళగించి లోయలోకి దొర్లించాడు. మంచుపొరలను బద్దలు చేసుకుంటూ ఆ రాయి దొర్లి, మైదానం మధ్యలో ఆగిపోయింది. గొర్రెలన్నీ ఒక్కసారి వెనుదిరిగి, ఆ రాయికేసి చూశాయి. తిరిగి తలవంచుకొని మేత మేయసాగాయి.

సాయంత్రమయింది. భోలా తనకు తాను నిగ్రహించుకోలేకపోయాడు. గొర్రెలను మలుపుకుని ఇంటిదారి పట్టాడు. కనుచీకటి పడుతూ పడుతూ ఉంది. కొండ మలుపు తిరిగాడు భోలా. ఎన్నడూ లేనిది, దోవలో నెత్తురు మరకలు కనిపించాయి. భోలాగుండె ఆగినంత పనయింది. గొర్రెలు బెంబేలెత్తి అరవసాగాయి. భోలా అటూ, ఇటూ చూశాడు. ఓ దారిప్రక్కగా కింజాం పడిపోయి ఉంది. ఆమె కుడి గూడమీద పెద్దగాయం, నోటివెంట నెత్తురు చారికలు, పండ్లు గిట్టకరుచుకోనున్నాయి. పిడికిలి బిగించి ఉంది. అడవి యీగలు జుమ్మని ముసురుతున్నాయి. అల్లంత దూరంలో, అన్నపుగిన్నె, బోసిగా పడిఉంది. భోలా భోరుమని ఏడ్చాడు. అతని రోదన ధ్వనులతో టోంగ్దా లోయ, లోయంతా శృతి కలిపింది.

టోంగ్దా గ్రామం శత్రువుల వశమైంది. శత్రుసైనికులు, గ్రామస్తులు అందరినీ

ఇళ్ళనుండి వెళ్ళగొట్టారు. ఆ ఇళ్ళనుతాము ఆక్రమించుకొన్నారు. టోంగ్డా స్త్రీలను, పురుషులను తమకు చాకిరీ చేయవలసిందిగా ఆజ్ఞాపించారు. వారి ఆహార ధాన్యాలను, గుడ్డలను, గొర్రెలను స్వాధీనం చేసుకొన్నారు. తమగ్రామంలో, తామే ఖైదు చేయబడ్డారు టోంగ్డా వాసులు.

అతిభారంగా రోజులు గడుస్తున్నాయి. గొర్రెలు క్రమ క్రమంగా తరిగిపోతున్నాయి. శత్రుసైనికులు వాటిని పీక్కుతింటున్నారు. భోళానుపట్టుకొని ఎన్నో విషయాలు అడిగారు. తనకేమీ తెలియదన్నాడు భోళా. అతనికెన్ని ఆశలు చూపించినా లాభం లేక పోయింది.

శత్రువులు ఎవర్నీనమ్మడంలేదు. ముందు జాగ్రత్తకోసరమని, వారొకపద్ధతిని ప్రవేశ పెట్టారు. ఎవరు ఆహారపదార్థాలు వండుతారో, వారేముందు తినాలి. ఆ తరువాత గానీ, శత్రుసైనికులు వాటిని ముట్టుకోరు.

ఈ పద్ధతిని భోళా చాలా అసహ్యించుకున్నాడు. కానీ, ఆ అసహ్యానికి విలువలేదు. రెండు, మూడురోజులనుండి, భోళాతీవ్రంగా ఆలోచిస్తున్నాడు. రమారమిగా వందమంది దాకా ఉన్న శత్రుసైనికులను ఎలా నిర్మూలించడమన్నదే అతని సమస్య. వారిదగ్గర తుపాకులున్నాయి. ఫిరంగులున్నాయి. తాము కేవలం నిరాయుధులు. ఎదురు తిరిగిన "అగ్లామూ"ను ఊరిమధ్య నిలబెట్టి పేల్చివేశారు. ఇప్పుడేమిటి చెయ్యడం?

సైనికులకు పాలు సరఫరాచేసే బాధ్యత భోళాది. అతను గొర్రెలపాలన్నీ పిండి, రెండుపూటలా సైనికులకు ఇస్తూఉండాలి. ఇవ్వబోయేముందు, ఆ పాలను తానుత్రాగాలి; లేదా "నాంగ్యాల్" చేతన్నా తాగించాలి.

రోజూలాగానే, ఆ రోజునా, భోళా పాల కడవలు పట్టించుకొచ్చాడు. అతను మాత్రం మామూలుగా లేడు. కళ్లు ఎర్రబడ్డాయి. నీటి జీరలు పదేపదే మోసులెత్తుతుంటే, వాటిని చాటుగా తుడుచుకుంటున్నాడు. ''నాంగ్యాల్ మింగ్రాం'' నెత్తుకుని, ముద్దులతో నింపేశాడు. కొడుకును తన ప్రక్కనే కూచో పెట్టుకొన్నాడు.

కాస్సేపటికల్లా, శత్రు సైనికుడొకడు పాలను తనిఖీ చేయడానికొచ్చాడు. వాణ్ని చూస్తూనే కాండ్రించి ఉమ్మాడు భోళా. అసహ్యన్నంతా లోలోపలే అణుచుకొన్నాడు. వచ్చీరాని హిందీలో పాలు త్రాగమన్నాడు, చప్పిడిమొఖం సైనికుడు. భోళా, ఓ లోటా నిండా పాలుతీసి, నాంగ్యాల్ కిచ్చాడు. "చోమోలుంగ్మా" అంటూ పాలు తాగాడు నాంగ్యాల్.

పాల కడవలన్నీ తీసుకుని సైనికుడు వెళ్ళిపోయాడు. నాంగ్యాల్‌ను గుండెలకు అద్దుకొని భోళా చాటుకెళ్ళాడు. అతని గుండెలు అవిసిపోతున్నాయి. దుఃఖం పుక్కిలింతలు అవుతోంది. నాంగ్యాల్ కళ్లు క్రమక్రమంగా మూసుకుపోతున్నాయి. తెల్లని శరీరం. నల్లబడిపోతోంది. నోటి వెంట నురుగులు కక్కుతున్నాడు. తండ్రి మెడను గట్టిగా, మరింత గట్టిగా, గాఢంగా ఆలింగనం చేసుకొని, గిజగిజలాడిపోయాడు నాంగ్యాల్. భోళా శిలా ప్రతిమలా నిలబడి పోయాడు. ఆ ప్రతిమ కళ్ళనుండి, కన్నీరు వరదలా ప్రవహిస్తూ ఉంది.

నాంగ్యాల్ తన్నుకోవడం లేదిప్పుడు. అతని శరీరం చల్లబడిపోయింది. భోళా చాటునుండి, శత్రువులున్న మకాంకేసి చూశాడు. కొంతమంది నేలకు వరిగి పోయారు. ఇంకొంతమంది నురుగులు కక్కుతూ చుమ్మలు చుట్టుకుపోతున్నారు. భోళా ముందుకువచ్చాడు. గ్రామస్థులందరినీ రమ్మని కేకవేశాడు. వారి ఆయుధాలు, మందు సామగ్రి, ఆహార పదార్థాలు, దుస్తులు తీసుకోమన్నాడు. నిర్జీవంగా, గుట్టలక్రింద పడి ఉన్న శత్రువులకేసి చూసి, అసహ్యంతో నేలను ఒక్కతాపు తన్ని గిరుక్కున వెనక్కు తిరిగాడు భోళా. నాంగ్యాల్‌మింగ్రాం శవం అతని మెడను చుట్టుకొనే ఉంది. టోంగ్డా గ్రామస్థులు అందరూ అతన్ని అనుసరించారు.

"చోమోలుంగ్మా" అన్నాడు భోళా. గ్రామస్థులందరూ ఆ నినాదాన్ని అందుకొన్నారు.

హిమాలయ లోయలు ఆ నినాదాన్నే ముమ్మారు పల్లించాయి.

మూర్ఖునితో ఎప్పుడూ కూడా వాదించవద్దు.
ఏది ఏమిటో వినేవారు చెప్పలేరు.

— పెడ్ గుంబెర్.

ప్రశ్నోత్తరావళి

శ్రీ ఎం. సత్యనారాయణశెట్టి,
పడమటికోడిపల్లి, కల్యాణదుర్గం,
అనంతపురం జిల్లా.

ప్రశ్న : ఇతర రాష్ట్రాలలో కొన్న మెట్రిక్ తూనికలు, కొలమానాలను మన రాష్ట్రంలో ఉపయోగించవచ్చా? లేక ఇక్కడ కొన్న వాటినే ఈ రాష్ట్రంలో ఉపయోగించవలసి వుంటుందా?

సమాధానం : ఇతర రాష్ట్రాలలో కొన్న మెట్రిక్ తూనికలు, కొలమానాలు మొదలైన వాటిని ఈ రాష్ట్రంలో ఉపయోగించవచ్చు. అయితే వాటిని వాడకంలోకి తేవడానికి పూర్వం ఈ రాష్ట్రానికి చెందిన తూనికలు, కొలమానాల శాఖ ఇనస్పెక్టర్లు వాటిని పరిశీలించి ముద్ర వేయవలసి వుంటుంది.

కుమారి సోమవరపు వెంకట దుర్గాభవాని,
జగ్గయ్యపేట, కృష్ణాజిల్లా.

ప్ర : 1962 అక్టోబరులో జరిగిన ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షకు సాంఘిక శాస్త్రం, లెక్కలపరీక్షలు రోజుకు ఒకటి చొప్పున జరిగాయి. 1963 మార్చిలోనూ ఆ తరువాత జరిగే పరీక్షలకు కూడా ఈ పద్ధతినే అనుసరిస్తారా?

స : ప్రస్తుత నిబంధనావళిని మారిస్తే తప్ప 1962 అక్టోబరులో జరిగిన ఎస్. ఎస్. ఎల్. సి. పబ్లిక్ పరీక్షకు అనుసరించిన టైమ్‌టేబిల్‌నే 1963 మార్చిలో జరిగే ఎస్. ఎస్. ఎల్. సి. పబ్లిక్ పరీక్షకు కూడా సాధారణంగా వర్తింపజేస్తారు.

ప్ర : ప్రభుత్వోద్యోగులు పి. యు. సి. పరీక్షకు ప్రైవేటుగాకూర్చోవచ్చా?

స : ఈ విజ్ఞాపనను పరిశీలించవలసింది ఆయా విశ్వవిద్యాలయాలే.

శ్రీ టి. సాంబయ్య,
పాలకొల్లు, పశ్చిమ గోదావరిజిల్లా.

ప్ర : ఉన్నత పాఠశాలల్లో సంగీత శిక్షకుడుగా పనిచేయడానికి కావల్సిన అర్హతలేమిటి?

స : (అ) ఏదైనా పరిగణించబడిన విశ్వవిద్యాలయంనుంచి డిప్లొమా పొంది వుండాలి. లేదా ప్రసిద్ధ సంగీత విద్వాంసుని వద్ద సిద్ధాంత రీత్యానూ, ప్రత్యక్షంగానూ కనీసం అయిదు సంవత్సరాల పాటు సంప్రదాయికమైన శిక్షణ పొంది వుండాలి.

(ఆ) బోధనలో మూడు సంవత్సరాలపాటు అనుభవం గడించి వుండాలి.

(ఇ) ఎస్. ఎస్. ఎల్. సి. లేదా దానికి సమానమైన విద్యార్హతవున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

ప్రశ్న : మాధ్యమిక పాఠశాలల్లో సంగీత శిక్షకుడుగా నియమించబడడానికి ఏమిఅర్హతలు కావాలి?

స : (అ) పరిగణించబడిన విశ్వవిద్యాలయం నుంచి సంగీత భూషణ్ సర్టిఫికెటు పొంది వుండాలి.

ప్రఖ్యాత సంగీతజ్ఞునివద్ద కనీసం మూడేళ్ళపాటైనా సైద్ధాంతికంగానూ, ప్రత్యక్షంగాను సంప్రదాయికమైన శిక్షణ పొందివుండాలి.

(ఆ) రెండు సంవత్సరాల బోధనానుభవం వుండాలి.

(ఇ) నాలుగవఫారం వరకు విద్యాభ్యాసం చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

ప్ర : ఏదైనా పాఠశాలలో పూర్తి సమయానికి సంగీత శిక్షకుణ్ణి నియమించడానికి సంగీతం నేర్చుకునే విద్యార్థులు లేదా విద్యార్థినులు ఆ పాఠశాలలో ఎంతమందివుండాలి?

స : సంగీత శిక్షణ తరగతిలో శిక్షితుల సంఖ్య 10 కి మించకుండా వుండాలి.

శ్రీ జి. వి. రామారావు,
శిరిపురం, తూర్పుగోదావరిజిల్లా.

ప్ర : ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డప్పుడు, తమ పేర్లను నమోదుచేయించుకోకుండా ఆయుర్వేద, హోమియో విధానాలలో వైద్యంచేసేవారి విషయంలో ఒకచట్టం —1956 వ సంవత్సరపు 26 వ చట్టం— చేయబడింది. రిజిస్ట్రేషనుకై ఆ చట్టంలో అనుమతించబడిన గడువు 1961 అక్టోబరు 17 వ తేదీతో తీరిపోయింది. దరిమిలా రిజిస్ట్రేషను గడువును 1964 అక్టోబరు వరకు పొడిగించ కోరుతూ అభ్యర్థనలు చేయడం జరిగింది. అయితే ఈ గడువును పెంచారా?

స : ది. 17—10—1962 గల జి. ఓ. ఎం. ఎస్. నెం. 2924—హెచ్. ప్రకారం, అర్హతలులేని వైద్యుల రిజిస్ట్రేషను కొరకు 1963 జనవరి మధ్య వరకు మాత్రమే గడువు అనుమతించబడింది. పై జి. ఓ. ననుసరించి, ఆయుర్వేదంలో కానీ, యూనానీలో కానీ లేదా ప్రాకృతి, హోమియో విధానాలలోకానీ అర్హతలు లేకుండా వైద్యం చేసే వారిపై ఫిర్యాదు చేయడానికి కలెక్టర్లకు, జాయింట్ కలెక్టర్లకు అధికారం వుంటుంది. ఈ ఉత్తర్వు దిగువనగల ప్రకటన ప్రకటితమైన తేదీ నుంచి మూడు నెలల లోపుగా రిజిస్టరుకాని వైద్యులంతా రిజిస్ట్రేషను కొరకు దరఖాస్తులు పెట్టుకోవాలని పై ఉత్తర్వులో పేర్కొనబడింది. ★

రక్తదానం అంటే...

యుద్ధరంగంలోకానీ లేక ఆసుపత్రిలో కానీ ప్రాణాపాయ స్థితిలో వున్న వారిని రక్తం ధారపోసి లేదా రక్తదానం చేసి రక్షించడం రక్త సంతకంతో శపథం చేయడంకంటే కూడా ఎంతో సాహసికమైన చర్య.

ప్రాణాపాయ స్థితిలో వున్నవారికి రక్తం ఎక్కించి కాపాడేవిధానం గత కొన్ని దశాబ్దాలలో చాలా అభివృద్ధి జెందింది. డాక్టర్ కార్ల్ లాండ్ స్టీనెర్, డాక్టర్ ఏ. ఎస్. వీనెర్ చేసిన పరిశోధనలు, ప్రయోగాలు రక్తం గుణదోషాలను కనుగొనడంలోనూ, దానిని నిలువచేయడానికి పద్ధతులను కనిపెట్టడంలోనూ చాలావరకు తోడ్పడ్డాయి.

పూర్వం ఒక శరీరంనుంచి మరొక శరీరంలోకి పంపింగ్ విధానంద్వారా నేరుగా రక్తం ఎక్కించేవారు. రక్తం త్వరలో గడ్డకట్టుకొనిపోతుంది కాబట్టి దానిని శరీరంలోతప్ప ఇవతల నిలువచేయడానికి వీలుండదు. రక్తం గడ్డకట్టకుండా నిలువ వుంచడానికి 1914 వ సంవత్సరంలో ఒక రసాయనిక పదార్థాన్ని - సోడియం సైట్రేటు - వినియోగంలోకి తెచ్చారు. ఇప్పుడు రక్తాన్ని చెడిపోకుండా రెఫ్రిజిరేటర్లలో సుమారు మూడు వారాలపాటు నిలువవుంచవచ్చు.

రోగి శరీరంలోకి 'ప్లాస్మా' రూపంలో కూడా రక్తం ఎక్కించవచ్చు. రక్తంలో వుండే పోషకమైన గుణాలు దీనిలో చాలా వుంటాయి. ప్రత్యేక ప్రక్రియద్వారా రక్తం నుంచి దీనిని తీస్తారు. "ప్లాస్మా" తయారీకి అవసరమైన హంగులు మనదేశంలో బొంబాయిలోని హాఫ్కిన్ సంస్థ ఇంకాకొన్ని ఇతర కేంద్రాలకు వున్నాయి. శాస్త్రవిజ్ఞానం ఇంతగా అభివృద్ధి జెందినప్పటికీ కృతకమైన రక్తం తయారు చేయడానికి ఇంకా సాధ్యపడలేదనే విషయం గమనార్హం.

నాలుగు రకాలు

అందరు మనుష్యుల రక్తం ఒకే తీరుగా వుండదు. వాటి వాటి గుణాన్నిబట్టి రక్తంలో ఏ, బి, ఓ, ఏబి అనే నాలుగురకాలున్నాయి. వీటిలోకూడా ఎ1, ఎ2 అనేఉపవర్గాలున్నాయి. ఒకరకం రక్తం కలిగిన వ్యక్తికి మరొరకం రక్తం ఎక్కించడానికి వీలుండదు. ఏ రకం రక్తంగల వ్యక్తికి ఆ రకం రక్తాన్నిమాత్రమే ఇవ్వవలసి వుంటుంది. కాగా 'ఓ' రకం రక్తాన్ని మాత్రం ఎవ్వరికైనా ఇవ్వవచ్చు.

వివిధ రకాల రక్తాన్ని విడివిడిగా నిలువ చేస్తారు. రక్తాన్ని నిలువచేసి పంపిణీచేసే సంస్థను "రక్తపు బ్యాంకు" అంటారు.

ఒక వయోజన వ్యక్తి శరీరంలో 12 మొదలు 13 పింట్ల రక్తంవుంటుంది. ఇది అతని శరీరబరువులో పదవవంతుకు సమానమవుతుంది. భారతదేశంలో సాధారణ ఆరోగ్యస్థితిలోవున్న వయోజన వ్యక్తినుంచి తడవకు సుమారు 300 సి. సి. అంటే 10 ఔన్సులు లేదా 2 కప్పుల రక్తాన్ని తీయవచ్చు.

ఆరోగ్యానికి భంగంవుండదు

ఇంత పరిమాణంలో రక్తాన్ని దానం చేయడంవల్ల దాత ఆరోగ్యానికి ఏ విధంగానూ భంగంవుండదు. అతనిశక్తి క్షీణించదు. కోల్పోయిన రక్తంస్థానంలో తిరిగి త్వరితంగా క్రొత్తరక్తంపొందే అద్భుతశక్తి మానవదేహంలోని అవయవాలకు వుంది. బలహీనంగా, అలసటచెందినట్లుగా కూడా వుండదు. అలా జరుగుతుందని ఊహించుకున్న వారికిమాత్రం ఆ విధంగా వుంటుంది. నిజానికి ఒకవ్యక్తి ఎన్ని పర్యాయాలైనా రక్తదానంచెయ్యవచ్చు. కాని శ్రేష్ఠమైన రక్తం లభించడానికి వీలుగా ఒకసారి రక్తదానంచేసిన వ్యక్తినుంచి మూడు మాసాల వ్యవధి వుంటేనేకాని తిరిగి రక్తం తీసుకోరు.

రక్తం ఎప్పుడు ఇస్తారు ? ఎవరికి ఇస్తారు ?

రోగి చాలా రక్తాన్ని కోల్పోయినప్పుడు- లోతైన గాయాలు తగిలిన వారికి కానీ, తీవ్రమైన ప్రసవ వేదనపడిన స్త్రీలకు కానీ - రక్తం ఇస్తారు. ఇంతేకాక ఒళ్లు కాలిన వారికి, విద్యుదాఘాతం తగిలిన వారికి, దీర్ఘకాల వ్యాధిగ్రస్థులకు, భారీ ఆపరేషన్లు జరిగిన వారికి కూడా రక్తం ఇవ్వడం అవసరమవుతుంది. అందుచేతనే సైనికుల ప్రాణం కాపాడడానికి యుద్ధంలో రక్తం కావల్సివుంటుంది. ఔషధాలు విఫలమైనచోట రక్తం సత్ఫలితాలు సాధిస్తుంది. ఇది త్వరగా ఆరోగ్యం చేకూరుస్తుంది.

భారతదేశంలో స్వచ్ఛందంగా రక్తదానం స్వీకరించే విషయంలో బొంబాయిలోని సెయింట్‌జార్జి ఆసుపత్రికి చెందిన డాక్టర్ ఆనంద్ పార్థే 1955వ సంవత్సరంలో ప్రప్రథమంగా కృషి జరిపారు.

ప్రస్తుతం దేశంలో సుమారు 85 రక్తపు బ్యాంకులున్నాయి. వీటిలో చాలా వరకు ప్రధానమైన ఆసుపత్రులలో వున్నాయి. వీటిలో కొన్నింటిని ప్రభుత్వం మిగిలిన వాటిని రెడ్‌క్రాస్ సంస్థలు నిర్వహిస్తున్నవి.

ఆసుపత్రుల ఉపయోగానికే ఈ బ్యాంకులు ప్రధానంగా ఉద్దేశించబడినవి. పెద్దపెద్ద నగరాలలో కొన్ని ప్రైవేటు, వ్యాపార రక్తపు బ్యాంకులు కూడా వున్నాయి. ఇవి రక్తం కొనుగోలు, అమ్మకం చేస్తాయి. కాని ప్రభుత్వం కంట్రోలు తగినంతగా వుండటం లేదు కాబట్టి ఈ వ్యాపార బ్యాంకులలో లభించే రక్తం తక్కువ రకానికి చెందినదిగా వుండే అవకాశంవుంది. వీరు రక్తదాతలు, రోగులను కూడా స్వలాభానికి ఉపయోగించుకోవచ్చు. దేశంకోసం మీరు రక్తాన్ని కానుకగా ఇవ్వదలచినట్లయితే ఏదైనా ఆసుపత్రికి కానీ, రెడ్‌క్రాస్ లేక పరిగణించబడిన ప్రజాసంస్థకు కానీ ఆ కానుక సమర్పించండి.

రక్తం ఎలా ఇవ్వాలి

మొదట మీకు దగ్గరలోవున్న ప్రభుత్వ నిర్వహణలోని రక్తదాన కేంద్రంలోనైనా లేదా రెడ్‌క్రాస్ లేక పరిగణించబడిన సంస్థకు సంబంధించిన కేంద్రంలోనైనా మీ పేరును దాతగా నమోదు చేయించండి. ఆ విధంగా పేరు నమోదుచేసిన వారిని రక్తదానానికై అవకాశం వున్న రోజున రక్తదాన కేంద్రం వారు పిలుస్తారు.

రక్తదానం చెయ్యడానికి మీరు 18-50 సంవత్సరాల మధ్య వయస్కులై వుండాలి. ఒకవేళ మీ వయస్సు 21 సంవత్సరాలకంటే తక్కువ అయినట్లయితే మీ తలిదండ్రులు కానీ లేదా సంరక్షకులు కానీ మిమ్మలను రక్తదానానికి అనుమతిస్తూ సంతకం చేయాల్సి వుంటుంది.

మిమ్మలను వైద్య పరీక్ష చేస్తారు. మీ శరీరోష్ణోగ్రతను, రక్తపోటును పరిశీలిస్తారు. మీకు ఏవైనా అంటువ్యాధులు వున్నదీ లేనిదీ తెలుసుకోడానికి మీ రక్తాన్ని పరీక్షిస్తారు. మీలో రక్తం కొరతలేదనే విషయాన్ని నిర్ధారణ చేసుకుంటారు. ఒకవేళ శారీరకంగా రక్తదానం చేయడానికి మీరు యోగ్యులు కానట్లయితే మీ రక్తం స్వీకరించరు.

మీరు రక్తం యిచ్చినప్పుడు గాయం ఏర్పడడంకానీ, బాధ కలగడంకానీ జరగదు. ఆ సందర్భంలో ఎక్కువలో ఎక్కువ పదినిమిషాలసేపు మాత్రం మంచం మీద పడుకోవలసి వస్తుంది. మీవద్ద నుంచి రక్తదానం స్వీకరించిన తరువాత మీకు టీ ఫలహారం ఇస్తారు. శరీరంలోని అవయవాలు, కోల్పోయిన రక్తాన్ని తిరిగి పొందుతున్నప్పుడు మరో 20 నిమిషాలసేపు విశ్రమించండి. తరువాత ఒక సత్కార్యాన్ని ఆచరించాననే సంతృప్తితో మీ పనిలో తిరిగి ప్రవేశించండి. మీరు మీ రక్తదానం ద్వారా ఎక్కడో ఎవరికో నవ్యజీవనం ప్రసాదించిన వారవుతారు.

వాస్తవానికి తటస్థ విధానం అనుభవంమీద మరింత పరిశుద్ధతచెంది దృఢతరం కావచ్చు. అయితే నిజానికి హిమాలయా పోరాటంలో దెబ్బ తిన్నది పశ్చిమ రాజ్యాలపై తటస్థవిధానాన్ని ఆయుధంగా ప్రయోగించడానికి కమ్యూనిస్టు శక్తులు పన్నిన కుయుక్తులేకాని మరొకటి కాదు.

— ది ఎకానమిస్ట్, లండన్.

తైలప్ర నలప్ర

హిందీ మూలం :
డా॥ సంపూర్ణానంద్

ఉపాధ్యాయుడూ, సంఘమే విద్య యెందు కన్న ప్రశ్నకు జవాబు చెప్పవలసి వున్నది. విద్యయొక్క ఆశయాన్ననుసరించే పాఠ్య ప్రణాళిక నిర్ణయించబడుతుంది. మానవుని జీవిత పరమార్థాన్ని కనుగొంగానే విద్యయొక్క ఆశయం స్థిరపడుతుంది. ఆ ఆశయసిద్ధి పొందగల యోగ్యునిగా తయారు చేయడమే చదువు యొక్క ఉద్దేశం.

పరమార్థం అన్నది వేదాంతానికి సంబంధించిన విషయం. కాని దానికీ మానవ జీవితానికీ అవినాభావ సంబంధముంది. ఏ సంఘానికైనా ఏదో ఒక శాశ్వతమైన ఆదర్శం, లక్ష్యం ఉండడం చాలా అవసరం. దాని నాధారంగా తీసుకొనే రాజకీయ, సాంఘిక, పారివారిక సిద్ధాంతాలు, నియమాలు నిర్మింపబడతాయి. వ్యక్తిగత, సామూహిక ఆదర్శాలు వేరు వేరని తలంచడం సంఘాన్ని చాలా చికాకులపాలు చేయడమన్న మాటే. ఎందువల్లనంటే వ్యక్తిగత జీవితానికి శ్రేయస్కరమైంది సంఘానికి అపాయకరమైందిగా పరిణమిస్తూ వుంటుంది. ఒక రంగంలో మంచిదిగా చెలామణీ అయ్యేది వేరొక రంగంలో నీచమైందిగా యెన్నబడే అవకాశముంటుంది. ఇటువంటి పరిస్థితిలో మనుష్యుడు కర్తవ్యాకర్తవ్యాలను నిర్ణయించుకొనడంలో తప్పటడుగు వేయక తప్పదు. ఇదే పరిస్థితి యీనాడు మన సంఘంలో తమాషాగా తయారై కనిపిస్తున్నది. అసత్యమాడ్డం తప్పే. కాని రాజకీయ రంగంలో నిజమే చెప్పాలనుకోవడం తెలివితక్కువతనం. దొంగిలించడం నేరం కాదని ఎవరూ అనరు. కాని చేయవలసిన పని చేయకపోవడమే ఒక గొప్పగా తలంచబడుతున్నది. మంచిగా ఉండడానికి యింట్లో ప్రవర్తించినట్లే వీథిలోనూ ప్రవర్తిస్తే వట్టి దద్దమ్మ అని అనక మానరు. ఈ కారణాల చేత అడుగడుగునా సత్ప్రవర్తనా పరుడికి ధర్మసందేహాలు అడ్డంకులు ఎదురవడం మామూలు అయిపోయింది.

అందుచేత సరిగా పర్యాలోకనం చేసి చక్కని, వేదాంతపరమైన ఒక ఉత్కృష్టమైన ఆశయాన్ని సృష్టించి అన్ని రంగాలలోనూ దానినే ప్రాతిపదిక సిద్ధాంతంగా అంగీకరించి, ఆచరించడం చాలా శ్రేయోదాయకం. ఇదేమంత అసాధ్యమైన పనిమాత్రం కాదు. ప్రాచీనులు వర్ణాశ్రమ ధర్మాలను యీ విధంగానే సృష్టించి అమలులో పెట్టేట్లు చేశారు. ప్రస్తుతం కూడా కొన్ని దేశాలలో మార్క్స్ సిద్ధాంతాలను యీ విధంగానే అంగీకరించి ఆచరిస్తున్నారు.

వేదాంతపరంగా యిక్కడ ప్రస్తుత విషయాన్ని చర్చించడానికవకాశంలేదు. కాని ప్రాచీనులు ఏ లక్ష్యాన్ని, ఆశయాన్ని శ్రేయస్కరమని తలచి ఆచరించారో నేడు మనకూ అదే ఉపయోగించగలదని నా అభిప్రాయం. ఎందువల్లనంటే వేదాంతపరమైన వారి లక్ష్యం ఎంతో విశాలం, సత్యసమ్మతం అయినది.

మన ఆత్మ జరా, మరణాల కతీతమైనది, అంతులేని శక్తి, జ్ఞానం, ఆనందాలకు నిలయం కూడా. కాని అజ్ఞానంతో తన్ను తాను అల్పుడుగా తలంచడమూ, తత్ఫలితంగా నీచుడుగా ప్రవర్తించడమూ జరుగుతున్నది. ఆత్మజ్ఞానం కలగనంత వరకూ అసంతృప్తి చెందుతూ మానవుడు సుఖాన్వేషణ చేస్తూనే ఉంటాడు. ఈ అన్వేషణకు యోగ్యత, మార్గదర్శకత్వం తోడైతే పరమార్థం చేజిక్కుతుంది — అంటే ఆనందానుభూతి ప్రాప్తిస్తుందని - ఇటువంటి ప్రయత్నానికి యోగ్యునిగా వ్యక్తిని తయారు చేయడమే విద్య యొక్క ఆశయం. ఇటువంటి ఆశయసిద్ధికి దోహదం చేసే ఆర్థిక, రాజకీయ, సాంఘిక సిద్ధాంతాలు, పరిస్థితులు ఉత్తమాలైనవి; ప్రతికూలమైనవి అధమాలని నా అభిప్రాయం.

ఆత్మానందం లేదా ఆత్మ సాక్షాత్కారం పొందడానికి యోగాభ్యాసం అవసరం. ఈ యోగాభ్యాసంలో ఆసక్తి కలవారు యీనాడు కూడా తమంతట తామే తగిన గురువు నన్వేషించుకొంటున్నారు. ఇటువంటి జిజ్ఞాస గలవారికి చేయూత నిస్తూ అనుకూల వాతావరణాన్ని కల్పించడం సంఘం బాధ్యత, ఉపాధ్యాయుని కర్తవ్యం.

విద్యా ప్రణాళికలకన్న ముఖ్యమైనది విద్యార్థుల ప్రవర్తన. పరమార్థాన్ని లక్ష్యంలో ఉంచుకొన్ననాడే ప్రవర్తనను కూడా చక్కపరచగలం. ప్రతి విద్యార్థి యొక్క ఆత్మ ఆనందాన్వేషణమే చేస్తున్నది. కాని అది బాహ్య వస్తువుల్లో కలదని భ్రమపడుతూ తప్పటడుగు వేయడం జరుగుతున్నది. ఈవిధంగానే ప్రతి ఒక్కరూ చేస్తున్నందువల్ల సంఘంలో అసూయ, ద్వేషం, కోపం, ఈసడింపు మొదలైన దుర్గుణాలు పెచ్చుపెరుగుతున్నవి. ఆధ్యాత్మిక జ్ఞానం, యోగ్యత కుంటుపడుతున్నవి. తత్ఫలితంగా ప్రతిచోటా ఆరాటం, ఆవేదన, అశాంతి తలెత్తుతున్నవి.

విద్యార్థులుస్థిరచిత్తులయ్యేట్లు ఉపాధ్యాయుడు ప్రోత్సహిస్తూ తగు శిక్షణ నిస్తూ వుండాలి. చిత్తైకాగ్రతే, ఆత్మ సాక్షాత్కారానికి మూలకందం. మైత్రి, కరుణ, ముదితం, తటస్థత వంటి సాత్త్విక ప్రవృత్తులను విద్యార్థుల్లో జనింపచేసినట్లయితే స్థిరచిత్తులు, ఉదాత్తులుగా రూపొందడానికి వీలు చిక్కుతుంది. సౌఖ్యంగా ఉన్న వారిని చూచి సంతోషించడం మైత్రి. దుఃఖితులను చూచినపుడు దుఃఖపడడం కరుణ, మంచిని చూచి సంతోషంతో దానిని ప్రోత్సహించ నిచ్చగించడం ముదితం, లేదా ప్రసన్నత. దుర్మార్గత్వాన్ని ఖండిస్తూ యిష్టంలేని వారితో విరోధాన్ని వహించకుండడం తటస్థత అనబడుతుంది. ఈ సద్గుణాలు యెక్కువయిన కొద్దీ అసూయా ద్వేషాలు నశిస్తాయి. దీనితోపాటు నిష్కామసేవ చేయడం కూడా హృదయ నైర్మల్యానికి, అత్యావశ్యకం. ఇది మాటలతో నెరవేరేది మాత్రం కాదు. అయినా ప్రయత్నించడం అవసరం. ఈవిధంగానే మనుష్యుడు ఉత్తమోత్తముడు కాగలడు.

దీంతోపాటు నిస్వార్థ సేవను కూడా ప్రోత్సహించుతూ వుండాలి. ఆకలి గొన్న వారికి అన్నం పెట్టడం జలాశయంలో మునుగుతున్న వారిని అందులోకి దూకి రక్షించడం, రోగార్తికి పరిచర్య చేయడం ఎంతో ఆనంద దాయకమైన పనులు. ఇటువంటి సమయాల్లో నేను–నీవు–నీది–నాది అనే స్వార్థభావం నశించి పరమాత్మ రూపాభాస కలుగుతుంది. నిస్వార్థభావ మెక్కువయిన కొద్దీ యీ ఆనందం కూడా పెరుగుతూ వుంటుంది. అని యిటువంటి ప్రమాదాలు సంఘంలో జరుగుతూ వుండాలని కోరడం అసంగతం. అయితే దీని తాత్పర్యమేమంటే అటువంటి పరిస్థితుల్లో మనం చెయ్యవలసిన పని చేజారనీయకూడదని మాత్రమే. అటువంటప్పుడు "నేను సేవ చేస్తున్నా"నని కూడా భావించరాదు. ఇటువంటి సేవ పశుపక్ష్యాదులకు కూడా చేస్తూవుండాలి.

మనస్సును వికార రహితంగా ఉంచుకొనడానికి చిత్రలేఖనం, సంగీతం, కావ్యరచన, పఠనం వంటి కళల నుపాసించడం ఉత్తమమైన సాధనం. ఆ కొద్దిక్షణాలైనా మన భవబంధనాలు తొలగగలవు. ప్రకృతి పరిశీలనలో కూడా యిటువంటి ఆత్మానందం లభించగలదు! విద్యార్థులలో సౌందర్యాన్ని ప్రేమించే ప్రవృత్తిని పెంపొందించాలి. సౌందర్యాను రాగం కామరహితమైందని మాత్రం మరచిపోకూడదు. 'ఈ సౌందర్యాన్ని నేనిట్లా ఉపయోగించుకొంటా'ననే స్వార్థభావ మున్నంత వరకూ ఆనందానుభూతి కలుగ నేరదు. సౌందర్యోపాసకుడు తన్ను తాను మరచిపోవడం అత్యంతవసరం.

దీని సారాంశ మేమంటే 'నేను–నీవు' అనే క్షుద్ర స్వార్థభావాలకతీతంగా ప్రవర్తించ గలిగేట్లు విద్యార్థుల ప్రవర్తనను సరిదిద్దవలసి ఉన్నది. స్వార్థపరత్వం వున్నపుడే సంఘంలో కలహ సంఘర్షణలకు తావు యేర్పడుతుంది. "నాతో పాటు అందరూ నిజం మాట్లాడాలి, సేవచేస్తూ పరోపకార పారీణులు కావాలి." అని కోరడం వల్లగాని, ఆచరించడంవల్లగాని యెవరికీ యెట్టి హానీ కలుగ నేరదు. కాని ఫలితం–నీకు కాదు నాకు దక్కాలని కోరిన తక్షణమే దెబ్బలాట ప్రారంభం కాగలదు. చక్కని పాట, ప్రకాశించే నక్షత్రాలు, మలయ మారుతం–వీటివల్లకలిగేఆనందాన్ని యెందరు పంచుకొనకోరినా ప్రమాదం లేదు. నాటకం చూచినపుడు నాకు కలిగే ఆనందం వల్ల నీ ఆనందానికి యెట్టి భంగమూ కలుగదు. కాని నేను కోరుతున్న డబ్బు, అధికారం వల్ల యితరుల కెటువంటి కష్టమూ కలగడం లేదనుకొనడం దంభం మాత్రమే కాగలదు.

ఈనాడు ఉపాధ్యాయుడు యే విషయాన్ని బోధిస్తున్నా విద్యార్థులను ధర్మనిరతులుగా చేయడం ముఖ్యమని మరవకూడదు. ధర్మమంటే పూజలు, మొక్కులు మాత్రం కాదు. సమష్టిగా జరిగే మేలుకే ధర్మమని పేరు. సంఘం మేలే నా మేలనే భావమే ధార్మిక భావం. మనుష్యునిలో అనేక సద్గుణాలు, సుఖాలు సంఘంలో మెలగుతున్నపుడే కలుగుతూ వుంటాయి. అందువల్ల సంఘాన్ని దృష్టిలో పెట్టుకొనే ధర్మ స్వరూపాన్ని నిర్ణయిస్తూ వుండాలి. సంఘమంటే, మను

ష్యులు, పశు పక్ష్యాదులనికూడా మరువరాదు. వీటి ప్రభావానికికూడా మనం లోనవుతూ వుంటాము. కాని మన పూర్వు లార్జించిన సంస్కృతిని, మన తరువాత రాబోయే తరం వారిని మనం మరువకూడదు. ఈ విధంగా పూర్వులను, మనలను మన తరువాత వారిని కలుపగలిగే శక్తే ధర్మం. అదే ధార్మిక శక్తి.

'మనం మన కర్తవ్యాన్ని నెరవేర్చుదాం. స్వార్థమనే పేరు పురుగు చచ్చుగాక, సర్వులూ సుఖింతురు గాక' అని భావించి, ఆచరిస్తే సంఘంలో సంఘర్షణకు తావే వుండదు; ఇతరులు మనగురించి యేమనుకొంటున్నారో అని ఆలోచించడానికి బదులు, మనం యితరులయెడ యే విధంగా మెలగుతున్నామనే ఆలోచిస్తూ వుండవలెను. ఈ నాడు సంఘంలో కావలసినది యీ మానసిక పరివర్తన.

సత్యంపట్ల అవ్యాజమైన ప్రేమ వున్నప్పుడే యిటువంటి పరిస్థితి సంభవించగలదు. సహజంగా సమగ్రంగా బోధించినట్లయితే యే విషయమైనాగాని లేదా శాస్త్రమైనాసరే యిటువంటి ప్రేమను విద్యార్థులలో జనింపచేయగలదు. కాని మందు నూరిపోసినట్లు మాత్రం బోధింపబడరాదు. సత్యసంధులివ్వడానికి పరిశీలనా స్వభావం, విమర్శనా శక్తి కూడా అలవరచుకోవాలి. యిటువంటి స్వభావం స్వేచ్ఛ, ధైర్యాలు ఉన్ననాడే అలవడుతుంది. ఈ స్వభావాలు, గుణాలు విద్యార్థులలో పుట్టి, పెరగడానికనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం ఉపాధ్యాయుని ముఖ్య కర్తవ్యం.

మంచి ఉపాధ్యాయుని వద్ద ఉన్న విద్యార్థి యీ విధంగా సత్యార్థికూడా కాగలడు. అతని హృదయం జ్ఞానపిపాస, నమ్రత, సహృదయతలకు ఆలవాలంగా ఉండగలదు. ఆ నాడే విద్యార్థులు తపోనిధులై, నియమనిగ్రహాలు కలిగి, సౌందర్యోపాసన చేస్తూ వర్చస్సుతో రాణిస్తారు. ఈ ధరిత్రి నంతటినీ సభ్యత, సంస్కృతిమయంగా చేయడానికి త్యాగం, ధర్మం ఆతనికి శక్తిసామర్థ్యాలను యిస్తూవుంటుంది. గృహస్థుడైన తరువాత కూడా ధర్మ, జ్ఞాన సంపన్నుడై జీవితం గడుపుతాడు. ఈ విధంగా ఉపాధ్యాయుడు సంఘానికి మహోపకారం చేసినవాడవుతాడు. సంఘం సహకరించినపుడే అతనికి యీ పని సాధ్యమవుతుంది.

పరస్పర కలహం, ఈర్ష్య, ద్వేషం వంటి దుష్ట ప్రవృత్తులకు నిలయమై, బీదవాడు, భాగ్యవంతుడు, సామాన్యులు—గొప్పవారనే తారతమ్యాల కాలవాలమై, ఆశ్రిత పక్షపాతం, బంధు ప్రీతి వంటి దుర్గుణాలు పెచ్చు పెరగడానికి వీలుగా ఉన్న సంఘంలో ఉపాధ్యాయుడు మాత్రం యేం చేయగలడు?

కూటికి, గుడ్డకు యాతనలు పడుతూ నియమ నిష్ఠలు పాటించలేని తల్లి దండ్రులున్న సంఘంలో ఉపాధ్యాయుడు పిల్లలకు చెప్పేది, బోధించేది బూడిదలోపోసిన పన్నీరవుతుంది. ఇరుకు, మురికి, కొంపలలో పుట్టి పెరుగుతున్న పిల్లల మనస్సులు గడ్డిగాబు పెరిగి ఉన్న మళ్ళవలే ఉంటాయి. ఇటువంటి వారు సౌందర్యోపాసకులెట్లా కాగలరు? ఇట్టి పరిస్థితిలో ఉపాధ్యాయుడు కూడా ఉపాధ్యాయుడుగా మెలగలేడు. అయినా నిజమైన ఉపాధ్యాయ స్వభావం కల స్వాభిమాని ప్రతికూల పరిస్థితులలో కూడా తన కర్తవ్యాన్ని నిర్వహించడానికి సదా ప్రయత్నిస్తూనే ఉంటాడు. తాను అక్షరాలా యోగి కాకపోయినప్పటికీ తన విద్యార్థుల యెడ యోగిగా మాత్రం ప్రవర్తిస్తూ వుండాలి.

'ఎన్నో యితర జన్మ లెత్తిన పిమ్మట యీనాడు యీ మనుష్య జన్మ నెత్తి నావద్ద శిష్యునిగా చేరాడు, ఇతని ప్రవర్తనను సరిచేసి యోగ్యునిగా తయారు చేశానా — సంఘానికెంతో మేలు కలుగుతుంది. ప్రస్తుతం వీడు అజ్ఞానావస్థలో ఉన్నాడు, ఇంద్రియ లోలుడై కర్తవ్యాన్ని మరుస్తున్నాడు. వీని హృదయాన్ని సంస్కరించి జ్ఞానదానం చేస్తే పరమార్థాన్ని ప్రసాదించినంత పుణ్యం చేకూరుతుంది.' అన్న వాత్సల్య భావంతో నడక నేర్చే పసివాడికి చేయూతనిచ్చే సోదరాగ్రజుడుగా ఉపాధ్యాయుడు తన శిష్యులకు పాఠం గరపుతూ వుండవలెను. శిష్య దొనరించే తప్పిదాలను ప్రేమ, వాత్సల్య భావాలతో మన్నించి మంచి మార్గాన్ని సూచిస్తూ వుండవలెను.

పై నుదహరించిన ఆశయాలు, నిజానికి కష్టసాధ్యాలు. ఆవిధంగానే ఉపాధ్యాయ వృత్తికూడా అంత మహత్తరమైందని నా విశ్వాసం. కేవలం జీతపురాళ్ళ గురించే పని చేస్తానన్న వాడికి ఏమాత్రమూ యీ వృత్తిని చేపట్టే హక్కు లేదు. ఉపాధ్యాయుని విలువ, కర్తవ్యం నెలాఖరున చెల్లించే రూపాయలు కట్టలేవు.

(అనుసరణ - వి. ఎ. రాజు)

ప్రపంచ సభ్యతకు పరీక్ష

శంకర శ్రీరామారావు


అవిగో ! యుద్ధపు కాలమేఘము లసంఖ్యాకమ్ముగా గ్రమ్ముకొ
న్నవి; చైనీయులు దారుణారుణ విధాన ప్రక్రియన్ విశ్వవి
ప్లవ దావాగ్నుల భారతావని హరింపన్ జూచుచున్నారు; శా
త్రవజీ మూతము రూపుమాపి మన స్వాతంత్ర్యమ్ము రక్షింపుడీ !

ఎన్నో కష్ట పరంపరల్ గడచి, యెన్నెన్నో మహా త్యాగ పుం
జమ్ముల్ దాటి గడించు కొంటిమి స్వశక్తిన్ నేటి స్వాతంత్ర్యమున్;
ఛిన్నాభిన్న మొనర్ప జూచెడు నిదే చీనా మహాభూత మ
న్నన్నా ! దౌష్ట్యము రూపు దాల్చిన విధానన్; దీని జెండాడుడీ !

పశువో ? మానవుడో ? ప్రపంచమున సర్వ శ్రేష్ఠు డెవ్వాడో ? ఈ
దృశ మౌ రాక్షస కృత్య మెవ్విధి ధరిత్రీ సంస్కృతుల్ సైచునో ?
వశముందప్పిన మానవత్వ మిలపై వర్ధిల్లునో ? చచ్చునో ?
యశమో ? మృత్యువో ? తేల్చుకోవలయునయ్యా లోక మిప్పట్టునన్.

ఒక దేశమ్ము ప్రపంచ శాంతికొరకుద్యోగించి తన్మార్గమం
దొక భల్లూకముచేత జిక్కుకొని కన్నుల్ మూసె నేనిన్ వికా
వికలై కూలదె సంస్కృతీ నిలయముర్విన్ ! సర్వ దేశ ప్రజల్
ప్రకటోత్సాహము పూని మేలుకొనుడీ స్వాతంత్ర్య సంరక్షకై.


ఒకరి సమస్యకాదిది, మహోన్నత మానవతా సమస్య; సై
నిక సమరాంగణంబిది; మదించిన మానవజాతి ఆత్మ హ
త్యకు విషపాత్ర బూనినది; తద్విషమున్ పడద్రోసి మానవా
ళికి నిజ ధర్మ నిర్వహణ లేశము నేర్పుడు సభ్య దేశముల్ !




కార్మికుల త్యాగం : బోధన్‌లోని నిజాం చక్కెర ఫ్యాక్టరీలో కడువృద్ధ కార్మికుడు కార్మికుల ఒక నెల బోనస్ అయిన మూడున్నర లక్షల రూపాయల పర్సును జాతీయ రక్షణ నిధికి సమర్పించుతున్న దృశ్యం.




బంగారు నగలు :— శ్రీమతి సావిత్రి సత్యదేవి రక్షణ నిధికిచ్చిన పది నగల బంగారాన్ని శ్రీమతి నగేష్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో గత నవంబరు 21 వ తేదీన అందజేస్తూ తన బంగారు గాజులలో ఒక దాన్ని కూడా రక్షణ నిధికి సమర్పించారు.



తిరుపతి - తిరుమల దేవస్థానాల తరఫున జాతీయ రక్షణ నిధికి బంగారపు కడ్డీలను సమర్పించుతున్నప్పటి చిత్రం.




గత నవంబరు 26 వ తేదీన ఖమ్మంలో గవర్నరుకు బంగారు ఉంగరాల దండలను సమర్పించినప్పటి చిత్రం.



ఒక బాలిక డిసెంబరు 12 వ తేదీన వరంగల్ లో రక్షణ నిధికై తన చెవిపోగులనిస్తున్నప్పటి చిత్రం.




సైనికులకై సౌకర్యాలు : కొందరు కార్యకర్తలు గత నవంబరు 27 వ తేదీన హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఉన్ని వస్త్రాలు మొదలైన వాటిని విడివిడిగా పేర్చుతున్న దృశ్యం.



ఆంధ్రప్రదేశ్ గవర్నరు సరిహద్దు విషయాన్ని గురించి పత్రికావిలేఖరులకు రాజ్‌భవన్‌లో ప్రత్యేకించి రూపొందించిన మ్యాపులో వివరిస్తున్నప్పటి చిత్రం.




మహబూబ్‌నగర్ జిల్లా దేవరకదరలో గత నవంబరు 13వ తేదీన ఒక గ్రామీణ స్త్రీ రక్షణ నిధికి తన విరాళాన్ని గవర్నరుకు సమర్పిస్తున్న దృశ్యం.



అసలు కన్‌ఫూషియస్ ? ('హిందూ' సౌజన్యంతో 9-12-62)

"ఎవరికైనా వర్తిస్తుంది...."



('శంకర్స్ వీక్లీ & 'హిందూస్థాన్ టైమ్స్' సౌజన్యంతో 6-12-62)

మలయా ప్రధానమంత్రి టుంకు అబ్దుల్ రహ్మాన్ మలయా పార్లమెంటులో చైనీయుల పటాన్ని చూపించారు.

"అమూర్తమైన చిత్రకళ అంటే నాకు పరమ అసహ్యం" అని శ్రీ కృశ్చేవ్ డిసెంబర్ 2న అన్నారు.



గనులవద్ద గవర్నర్ : జనరల్ యస్. యం. శ్రీ నగేష్ గత నవంబరు 29వ తేదీన కొత్తగూడెం బొగ్గు గనుల లోని 5వ ఇంక్లయిన్‌ను సందర్శించినప్పటి చిత్రం.



జాతీయ రక్షణ నిధికి విరాళంగా డిసెంబరు 2వ తేదీన వరంగల్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని కరెన్సీనోట్ల దండతో సత్కరించిన దృశ్యం.



నిజామాబాద్ జిల్లా ఎడ్పల్లి పంచాయతీ సమితికి చెందిన పొలమ్నాపూర్ గ్రామంలో పాఠశాలా భవన నిర్మాణానికై గ్రామస్థులు 'శ్రమదానం' చేసినప్పటి దృశ్యం.

జాతీయ రక్షణ కృషికి మీ పొదుపు ధనం అవసరం

మీరు ఎంత పొదుపు చేయగలిగితే అంత చేయండి. ఆ విధంగా పొదుపుచేసిన మొత్తాలను

దిగువ సెక్యూరిటీలలో దేనికైనా పెట్టుబడి పెట్టండి.

12 సంవత్సరాల జాతీయ రక్షణ సర్టిఫికెట్లు :

సంవత్సరానికి $6\frac{1}{4}$ శాతం సాధారణ వడ్డీ లేక $4\frac{3}{4}$ శాతం చక్రవడ్డీ. రూ. 5 మొదలు రూ. 25,000 ల వరకు వివిధ డినామినేషన్లలో లభ్యమవుతాయి. విడిగా ఒక వ్యక్తి అయితే రూ. 35,000 ల వరకూ, ఇద్దరు వ్యక్తులు కలిసి అయితే రూ. 70,000 ల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. (పోస్టల్ సేవింగ్స్ సర్టిఫికెట్లకు లోగడ ఏమైనా పెట్టుబడి పెట్టివుంటే దానితో కలుపుకొని).

10 సంవత్సరాల రక్షణ డిపాజిటు సర్టిఫికెట్లు :

ఏటా $4\frac{1}{2}$ శాతం వడ్డీ చెల్లించబడుతుంది. రూ. 50ల గుణిజములలో లభ్యమవుతాయి. విడిగా ఒక వ్యక్తి అయితే రూ. 35,000 ల వరకూ, ఇద్దరు వ్యక్తులు కలిసి అయితే రూ. 70,000 ల వరకూ ఎక్కువలో ఎక్కువ పెట్టుబడి పెట్టవచ్చు. ($3\frac{1}{2}$ శాతం. 4 శాతం ట్రెజరీ సేవింగ్స్ డిపాజిటు సర్టిఫికెట్లకు లోగడ ఏమైనా పెట్టుబడి పెట్టివుంటే దానితో కలుపుకొని).

క్యుమ్యులేటివ్ టైమ్ డిపాజిటు పథకం :

5, 10 లేక 15 సంవత్సరాలవరకు ప్రతినెలా రూ. 5, 10, 20, 50, 100, 200 లేక 300 చొప్పున డిపాజిటు చేసినట్లయితే తరువాత చక్రవడ్డీతోసహా పెట్టుబడి అధిక మొత్తంగా తిరిగి చెల్లించబడుతుంది.

పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకు అకౌంట్లు :

రూ. 25 లు మొదలు రూ. 20,000 ల వరకు నిలువవుంచే మొత్తాలకు 3 శాతం చొప్పునా, రూ. 20,000 లకు మించి నిలువవుంచే మొత్తాలకు $2\frac{1}{2}$ శాతం చొప్పునా వడ్డీ చెల్లించబడుతుంది. ఒక వ్యక్తి రూ. 15,000 ల వరకూ నిలువ చేయవచ్చు.

15 సంవత్సరాల ఆన్యుటీ సర్టిఫికెటు :

జారీచేసే ధర : రూ. 1,330, రూ. 3,325, రూ. 6,650, రూ. 13,300, రూ. 26,600. సంవత్సరానికి 4.25 శాతం చక్రవడ్డీ చొప్పున, 15 సంవత్సరాలలో నెలవారీ చెల్లింపుల రూపంలో డబ్బు తిరిగి ఇవ్వబడుతుంది. ఒక వ్యక్తి రూ. 26,600 ల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.

చిన్న మొత్తాల పొదుపు పత్రాలకు పెట్టిన పెట్టుబడులపై లభించే వడ్డీకి

ఆదాయపు పన్ను, సూపర్ టాక్సులు వుండవు.

"మీరు చేసే పొదుపుమీదనే మీ భద్రత, మీ పిల్లల శ్రేయస్సు ఆధారపడి వుంది."

ఇతర వివరాలకొరకు, హైద్రాబాదు 10—2—2, ఏ. సి. గార్డ్స్ రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ నేషనల్ సేవింగ్స్ ప్రాంతీయ డైరెక్టరు (భారత ప్రభుత్వం)ను కానీ లేక మీ కలెక్టరేటులోని జిల్లా ఆర్గనైజరునుకానీ లేదా మీ సమీపంలోని తపాలా కార్యాలయాన్నికానీ దయచేసి సంప్రదించండి,

ప్రభుత్వ నిర్ణయాలు

ప్రభుత్వోద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సును భారత ప్రభుత్వం పెంచినట్లుగా 55 సంవత్సరాలనుంచి 58 సంవత్సరాలకు హెచ్చించకుండా వుండడానికి రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. అయితే అవసరమైన సందర్భాలలో ఉద్యోగవిరమణ గడువును పొడిగించడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

2. అత్యయిక పరిస్థితిదృష్ట్యా రాష్ట్రంలో ప్రదర్శనలను, సమావేశాలను చాలావరకు తగ్గించడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

3. ప్రభుత్వ సెలవులను 16 నుంచి 14 కూ, ఐచ్ఛిక సెలవులను 3 నుంచి 2 కూ తగ్గించడానికి కూడా ప్రభుత్వం నిశ్చయించింది.

4. పూర్వ హైదరాబాదు సైన్యానికి చెందిన మైసారం లైన్స్‌ను డిఫెన్స్ ఎలక్ట్రానిక్ లెబొరేటరీకి బహూకరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

5. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా శ్రీ కాశీకృష్ణాచార్యులుగారిని యావజ్జీవితం ఉంచడానికి ప్రభుత్వం నిశ్చయించింది.

6. ప్రస్తుత అత్యయిక పరిస్థితిదృష్ట్యా కాకతీయ వైద్య కళాశాలను స్వాధీనం చేసుకోకుండా వుండడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఒకటి రెండు సంవత్సరాలలో దీనిని అప్పగించుకోవచ్చు.

7. ఒక కోటి రూపాయిల ఖర్చుతో అనేక అంతస్తుల భవనాన్ని నిర్మించే నిమిత్తం ఒక భూఖండాన్ని గృహనిర్మాణ సంస్థకు మార్పిడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వము నిర్ణయించింది. ప్రభుత్వ కార్యాలయాలు, నివాస గృహాలు, దుకాణాలకు ఈ భవనంలో అద్దెపై వసతి సమకూరుస్తారు.

రాష్ట్రవ్యాప్తంగా విద్యుచ్ఛక్తి వాడకాన్ని పెద్ద ఎత్తున తగ్గించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిశ్చయించింది.

విద్యుచ్ఛక్తి వాడకం తగ్గింపుకు విధించే పరిమితులలో ముఖ్యమైనవి ఇవి :—

(అ) దుకాణాలన్నీ సాయంత్రం 5-30 గం.ల నుంచి రాత్రి 7-30 వరకు వెలుపల విద్యుద్దీపాలు అలంకరించకూడదు.

(ఆ) వివాహాలు, విందుల సందర్భంలో కూడా విద్యుద్దీపాలంకరణలకు తాత్కాలిక విద్యుచ్ఛక్తి సరఫరాలను అనుమతించరు.

(ఇ) హైదరాబాదు, సికింద్రాబాదులలోని సినిమాథియేటర్లన్నీ సాయంత్రం 5-30 గం. లు. రాత్రి 7-30 గం॥ ల మధ్య చిత్రాలు ప్రదర్శించవు.

(ఈ) రక్షణ కృషికి సంబంధించినవైతేనే తప్ప తెలంగాణా ప్రాంతంలో పారిశ్రామికావసరాలు, గృహావసరాలు, వాణిజ్యావసరాలకు చెనికీ కొత్తగా విద్యుచ్ఛక్తి సరఫరాను అనుమతించరు.

(ఉ) దుకాణాలలో కొన్ని ఆదివారాలలో తెరిచివుండి ఇతర రోజులలో మూసివుండడానికి వీలుగా దుకాణదార్లందరినీ తమ సెలవు రోజులను మార్చుకోవలసిందిగా అభ్యర్థిస్తారు.

వీధి దీపాలలో ప్రతి రెండవ దీపపు బల్బునూ తీసి వేస్తారు. అయితే ఈ విధంగా బల్బులు తీసివేయడంవల్ల రెండు దీపాల మధ్యదూరం 200 గజాలకు మించకుండా చూస్తారు.

వదంతులను వినకండి!

వదంతులను ప్రచారం చేయకండి!

మీరు మీ బంగారాన్నే ఎందుకివ్వాలి?

చైనాదురాక్రమణ తరువాత ప్రభుత్వం చేసిన పనులలో మొదటిది, బంగారపు విరాళాలను — విరాళాలుగా గాని, బంగారం బాండ్ల మారకంగా గాని — సేకరించడం. బంగారమే ఎందుకు? ధనరూపంలో విరాళాలు ఎందుకివ్వకూడదు?

ఇందుకు కారణం చాలా చిన్నది. దురాక్రమణదారు నెదుర్కొనడానికి మనకు మనం సమకూర్చుకొనే అన్నింటితో పాటు మనం ఇతర దేశాలనుంచి వస్తువులను తెచ్చుకోవాలి. ఇవి కేవలం ఆయుధాలు, మందుగుండు సామాగ్రేకాదు, ఇతర సాధన సంపత్తి, యంత్రాలు, ఇంకా ఆహార పదార్థాలు, ముడిసరుకులను కూడా మనం తెచ్చుకోవాలి. ఇంకామనం వాటిని తగినంతగా ఉత్పత్తి చేయడంలేదు గనుక ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి.

అయితే ఈ దిగుమతులు రూపాయలతో లభించవు. ఆయా దేశాలకు మనం డాలర్లు, లేక స్టెర్లింగులు, లేక రూబుల్సు చెల్లించాలి. మామూలుగా డాలర్లను పొందడానికి మన జనపనార వస్తువులు, తేయాకు మొదలైన వాటిని ఎగుమతిచేసి, మనకవసరమైన వస్తువులను ఆ దేశంనుంచి కొంటున్నాం.

ఇతర దేశాలనుంచి మనకవసరమైనవస్తువులను కొనుగోలు చేయడానికవసరమైన డాలర్లు, మార్కులను మనం చాలినంతగా సంపాయించలేక పోయాం. మన అభివృద్ధి ప్రణాళికలకు ఆహారం, ముడిసరుకులు, యంత్రాలు అవసరమయ్యాయి. మనం వాటి ధరను సరిగ్గా చెల్లించలేం గనుక ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, అమెరికా, జర్మనీ, రష్యా మొదలైన చోట్ల నుంచి ఋణం తెచ్చుకున్నాం. మనకు చాలినంత ఋణాన్ని సేకరించలేకపోతే మనకున్న కొద్దిపాటి విదేశీ మారక ద్రవ్యంతోనే గడపాలి.

దేశంలో ఆత్యయిక పరిస్థితి ఏర్పడిందంటే మనం ఇంకా అధికంగా దిగుమతులు చేసుకోవలసి రావడమే. అందువల్ల మనం ఎక్కువ అప్పులను సేకరించడమో లేక దిగుమతి చేసుకున్న వస్తువుల ధరను వేరొక రూపంలో చెల్లించడమో చేయాలి.

ఏ వస్తువుల ధరగానైనా బంగారాన్ని తీసుకోడానికి ప్రతిదేశం అంగీకరిస్తుంది. మీరు గనక ప్రభుత్వానికి వెయ్యిరూపాయిల విలువగల బంగారంఇస్తే ఆ బంగారంతో ప్రభుత్వం ఆయుధాలను, ఇతర సాధన సంపత్తిని అమెరికా నుంచిగాని, ఫ్రాన్స్‌నుంచిగాని, బ్రిటన్ నుంచిగాని, జపాన్‌నుంచిగాని— మనకు అమ్మాలనుకున్న ఏ దేశనుంచైనా సరే కొంటుంది. కాని మీరు ప్రభుత్వానికి వెయ్యి రూపాయల కరెన్సీని—అంటే రూపాయలను ఇస్తే ప్రభుత్వం ఆ ధనాన్ని భారత దేశం లోనే వినియోగించగలదుకాని విదేశాలలో వినియోగించలేదు.

ఇందువల్లనే ఈ క్లిష్టపరిస్థితిలో బంగారం విరాళాలు ముఖ్యమైనాయి. బంగారం ప్రభుత్వం చేతుల్లోవుంటే మనశక్తిని పెంపొందించుకోడానికీ యుద్ధంలో పోరాడడానికీ ఉపకరిస్తుంది. కాని ప్రైవేట్ సంస్థల, వ్యక్తుల చేతుల్లోవుంటే ఆ బంగారంవల్ల ఉపయోగం ఏమీవుండదు. అంతేగాక అది బ్లాక్ మార్కెట్‌కుకూడా దారితీస్తుంది.

మన భారతదేశంలో ఎంత మొత్తము బంగారంవున్నదీ ఎవరికీ ఖచ్చితంగాతెలీదు. కాని రెండు వేల కోట్ల రూపాయలకు పైగా విలువగల బంగారంవుండి వుంటుందని ఒక అంచనా. అంటే ఈ మొత్తం, మనం ప్రతి ఏటా ఎగుమతులద్వారా సాధిస్తున్న విదేశీ మారక ద్రవ్యానికి దాదాపు మూడురెట్లు, లేక ప్రతియేటా మనం దిగుమతులకై చెల్లిస్తున్న మొత్తానికి దాదాపు రెండింతలన్నమాట. మనం దేశంలోవున్న బంగారంలో కనీసం సగంమొత్తాన్ని సమీకరించగలిగితే మన దిగుమతులను రెట్టింపు చేసుకోవచ్చు. కనుక బంగారం మనకు అత్యవసరం. సగానికిపైగా బంగారాన్ని సమీకరించడానికి మనం కృషి చేయాలి.

ప్రతి వ్యక్తీ తనకున్న బంగారాన్ని విరాళంగా ఇవ్వలేడనే విషయం ప్రభుత్వానికి తెలుసు. అందువల్ల ప్రభుత్వం బంగారపు బాండ్లను ప్రవేశపెట్టింది. ఈ బాండ్లపై

(మిగతా ౩౫ వ పేజీలో)

వినాశనకారి

అన్నాం, బర్మా—ఈ రెండూకూడా లోగడ చైనా ప్రాంతాలే. ఇంతేకాక సూలూ, లూచూ దీవులు, సయాం, బోర్నియో, జావా. సింహళం, నేపాల్, భూటాన్ మొదలైన ఐదుగు దేశాలు ఒకప్పుడు చైనాకు జోహార్లర్పించినవే. చైనా సువిశాలమైన, శక్తివంతమైన దేశంగా వెలుగొందిన కాలంలోదాని సరిహద్దులు ఉత్తరాన అమిన్ వరకూ, దక్షిణాన హిమాలయాల దక్షిణం వరకూ, తూర్పున చైనా సముద్రంవరకూ, పశ్చిమాన ట్సంగ్‌లిన్ వరకూ విస్తరించి వున్నాయి.

వేల సంవత్సరాలనుండీ చైనా ప్రపంచాన్ని జయించడానికి ప్రయత్నిస్తున్నది. ఒకప్పుడు చైనా ప్రపంచాధినేత కావడానికీ, అన్ని దేశాల్లోకీ అగ్రాసనాన్నధిష్ఠించడానికీ కలలు కన్నది...

ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన దేశాలుగా ప్రభవిల్లిన ఇంగ్లాండు, రష్యా—(విప్లవానికి పూర్వం)—లవలెనే చైనాకూడా వేల సంవత్సరాలనుంచి సామ్రాజ్యవాద దేశం కావడమే దీనికి (చైనా క్షీణతకు) కారణం. చైనా ప్రాచీన సామ్రాజ్యవాదం, ఇంగ్లాండు ఆధునిక సామ్రాజ్యవాదాన్ని తలదన్నేదిగా వుంది.

ఈ నాడు శక్తివంతమైన రాజ్యాలు పయనిస్తున్న మార్గానికి ఇతరదేశాల వినాశనమే గమ్యం. చైనా బలవంతమైన దేశంగా రూపొందినప్పుడు అది అన్యదేశాలను అణిచి వేయదలుస్తుంది. శక్తిసంపన్నుల సామ్రాజ్యవాదాన్ని అనుకరిస్తుంది. అది ప్రపంచానికి మేలుకలిగించడానికి బదులు పెద్దకీడు కలిగిస్తుంది. ★

—సన్ యట్ సేన్

(34 వ పేజీ తరువాయి)

$6\frac{1}{2}$ శాతం వడ్డీని చెల్లిస్తారు. ప్రతి 10 గ్రాముల బంగారానికీ మీకు రూ॥ 53-58 విలువగల బాండ్లు లభిస్తాయి. ఈ బాండ్లపై న. పై. ల 15 సంవత్సరాల అనంతరం మీకు రూ॥ 52-50 న. పై. ల వడ్డీ లభిస్తుంది.

ప్రభుత్వం ఇంత ఎక్కువ వడ్డీ రేటు ఇవ్వడానికి కారణం, ప్రస్తుతం బంగారానికి మార్కెట్‌లోవున్న ధరను అది మీకు ఇవ్వలేక పోవడమే. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థలో సభ్యత్వం వున్నందున మన ప్రభుత్వం ప్రస్తుత మార్కెటు ధరను ఇవ్వలేదు. ఎందుకంటే ఆ సంస్థ సభ్యరాలుగా మన ప్రభుత్వం అంతర్జాతీయ ధరకే బంగారాన్ని క్రయవిక్రయం చేయాల్సి వుంటుంది. ఆ సంస్థలో సభ్యులందరూ కూడా ఈ ధరకు -10 గ్రాములకు రూ॥ 53-58 న. పై.— కట్టుబడి వుంటారు.

ఈ క్లిష్టపరిస్థితిలో బంగారాన్ని కూడబెట్టుకొని దాచుకోవడంవల్ల విలువైన సంపద నిరుపయోగ మవడమేగాక, మన స్వాతంత్ర్య పరిరక్షణకై పోరాడుతున్న సైనిక దళాల అవసరాలు తీర్చడానికి కూడా ఇది ఆటంకమవుతుంది.

కమ్యూనిటీ రేడియో సెట్లు

1962 సెప్టెంబరు నెలలో దిగువ గ్రామాలలో కమ్యూనిటీ రేడియో సెట్లను నెలకొల్పడం జరిగింది.


గ్రామం పేరు	తాలూకా పేరు	రేడియో సెట్టు నెలకొల్పబడిన తేదీ
	వరంగల్లు జిల్లా	
లోహితా	వరంగల్లు	27-9-62
	నిజామాబాదు జిల్లా	
కేతేపల్లి	బాన్సువాడా	6-9-62
గుల్ల	మద్నూరు	8-9-62
	మెదక్ జిల్లా	
బూరుగుపల్లి	గజ్వేలు	30-9-62
	హైదరాబాదు జిల్లా	
ఘనపూర్	వికారాబాదు	25-9-62
	నెల్లూరు జిల్లా	
వింతమూరు	ఉదయగిరి	30-9-62
ముంగమూరు	కావలి	30-9-62
	చిత్తూరు జిల్లా	
కావేరిరాజపురం	పుత్తూరు	4-9-62
వరదయ్యపాలెం	సత్యవేడు	5-9-62
మారదవాడ	,,	5-9-62
మదనంచేడు	,,	6-9-62
కన్నవరం	,,	6-9-62
మదనంగేరి	,,	6-9-62
సిడసంబుదూరు	,,	7-9-62
చిన్నపట్టు	,,	7-9-62
దాసుకుప్పం	,,	7-9-62
తిమ్మలచెరువు అగ్రహారం	,,	8-9-62
కమ్మపల్లి	సత్యవేడు	9-9-62
పెరుమళ్లపల్లి	,,	10-9-62
తిప్పనాయుడుపల్లి	,,	10-9-62
అంబరమహారాజపురం	,,	11-9-62
ముదియంవారిపల్లి	వాయల్పాడు	22-9-62
కురపర్తి	,,	22-9-62
సంగసముద్రం	,,	25-9-62
జారడ్ల	,,	27-9-62
పెద్దమల్లాల	,,	28-9-62
	కడప జిల్లా	
నేతివారిపల్లి	రాజంపేట	19-9-62
వాతలూరు	,,	21-9-62
తుమ్మకొండ	,,	19-9-62
దళవాయపల్లి	,,	16-9-62
రాళ్ళచేరువుపల్లి	,,	17-9-62
పొన్నవోలు	సిద్ధోట్	9-9-62
మూతుకూరు	,,	6-9-62
పుల్లూరు	కడప	5-9-62
కుడుములూరు	సిద్ధోట్	5-9-62
శాకరాజుపల్లి	,,	9-9-62
రేకులకుంట	,,	6-9-62
రావులకొల్లు	,,	8-9-62
జొన్నవరం	,,	6-9-62
వల్లవారికండ్రిగ	రాజంపేట	18-9-62
టి. చంద్రపల్లి	సిద్ధోట్	7-9-62

గ్రామం పేరు	తాలూకా పేరు	రేడియో సెట్టు నెలకొల్పబడిన తేదీ
రాజకుంట	రాజంపేట	20-9-62
నాగవరం	,,	18-9-62
మోయలపల్లి	,,	20-9-62
నగిరిపాడు	,,	19-8-62
గంగనపల్లి	కడప	5-9-62
గార్లమడుగు	రాజంపేట	16-9-62
రాచయపేట	సిద్ధోట్	7-9-62
తుమ్మలూరు	కడప	4-9-62
కుంభగిరి	సిద్ధోట్	6-9-62
అనంతసముద్రం	రాజంపేట	6-9-62
గోవిందంపల్లి	,,	19-9-62
పులపతూరు	,,	14-9-62
పెన్న పెరూరు	సిద్ధోట్	4-9-62
కొండూరు	,,	6-9-62
తిమ్మాయపాలెం	రాజంపేట	20-9-62
పి. బొమ్మపల్లి	జమ్మలమడుగు	29-9-62
కె. సుగుమంచిపల్లి	,,	30-9-62
దొమ్మరనంద్యాల II	,,	29-9-62
కోలవల్లి	కమలాపురం	28-9-62
కోడూరు	,,	27-9-62
ఇల్లూరు	,,	27-9-62
అరకటవేముల జడ్.పి.హెచ్.యస్.	ప్రొద్దుటూరు	29-9-62
బ్రాహ్మణపల్లి	సిద్ధోట్	9-9-62
అనంతపురం జిల్లా		
వెల్దుర్తి	ధర్మవరం	11-9-62
వలస	మడకసిర	14-9-62
బోడాయపల్లి	తాడిపత్రి	19-9-62
ముక్తాపురం	ధర్మవరం	22-9-62
వేపరాల	కళ్యాణదుర్గం	24-9-62
సేవామందిరం (తిమ్మాపురం)	,,	26-9-62
గరుడాపురం	కళ్యాణదుర్గం	27-9-62
కన్నేపల్లి (బుడిగుపల్లి)	,,	27-9-62
కర్నూలు జిల్లా		
గని	నంద్యాల	12-9-62
కొనిద్యాల	నందికొట్కూరు	19-9-62
గొబ్బూరు	మార్కాపూర్	20-9-62
కరిమద్దుల	నంద్యాల	20-9-62
పాపినేనిహళ్లి	గిద్దలూరు	22-9-62
వెలిగలపాయె	,,	22-9-62
బోయిలకుంట్ల	ఆళ్లగడ్డ	22-9-62
పంటివెలగలి	,,	25-9-62
ఈరప్పాడు	నంద్యాల	27-9-62
బొదలదిన్నె (వసంతపురం)	కోయిలకుంట్ల	29-9-62
బైర్లూటి (స్త్రీ సంక్షేమ కేంద్రం)	ఆత్మకూరు	30-9-62
హరివరం	కోయిలకుంట్ల	30-9-62
పొత్తిపాడు	,,	30-9-62
వల్లంపాడు	,,	30-9-62
సంగపట్నం	బనగనపల్లి	30-9-62
లింగందిన్నె	కోయిలకుంట్ల	30-9-62
మహబూబునగరం జిల్లా		
రాచూర్ పంచాయతీ	కల్వకుర్తి	8-9-62
యెల్లికల్	,,	7-9-62
గూడూరు	,,	6-9-62
తార్నికల్	,,	5-9-62
తూముకుంట	గద్వాల	6-9-62
కొల్లంపల్లి	మక్తల్	12-9-62
సింగోటం	కొల్లాపూర్	13-9-62
పెద్దచింతకుంట	దేవరకదర	16-9-62
కదుకుంట్ల	వనపర్తి	24-9-62

గ్రామం పేరు	తాలూకా పేరు	రేడియో సెట్టు నెలకొల్పబడిన తేదీ
చెల్లంపల్లి	కల్వకుర్తి	20-9-62
పోలేపల్లి	,,	21-9-62
కార్వేన	మహబూబునగరం	20-9-62
కంబళ్లపురం	వనపర్తి	25-9-62
రేవల్లి	నాగరకర్నూలు	21-9-62
సిరిపురం	,,	23-9-62
గుడిపల్లి	,,	22-9-62
కరుకొండ	మహబూబునగరం	15-9-62
ఎదిర	షాద్‌నగర్	28-9-62
చౌలపల్లి	,,	27-9-62
	నల్లగొండ జిల్లా	
ఇబ్రాహీంపూర్		1-9-62
రుస్తాపురం		1-9-62
జమీల్‌పురం		2-9-62
కలమలచర్వు		12-9-62
వర్ధపూర్		13-9-62
	శ్రీకాకుళం జిల్లా	
అంపవల్లి	బొబ్బిలి	23-9-62
గోనిపాడు	శ్రీకాకుళం	21-9-62
	విశాఖపట్నం జిల్లా	
చప్పాడ	యెలమంచిలి	9-9-62
దేవద	విశాఖపట్నం	11-9-62
నెల్లిమర్ల	,,	1-9-62
వినాయకపల్లి	,,	-9-62
గౌరీపట్నం	చోడవరం	27-9-62
మరిపాలెం	యెలమంచిలి	1-9-62
	తూర్పుగోదావరి జిల్లా	
కొత్తూరు	పెద్దాపురం	5-9-62
రాజుపాలెం	,,	17-9-62
కోటా II	రామచంద్రాపురం	4-9-62
	పశ్చిమగోదావరి జిల్లా	
పశ్చిమవిప్పర్రు	తాడేపల్లిగూడెం	2-9-62

గ్రామం పేరు	తాలూకా పేరు	రేడియో సెట్టు నెలకొల్పబడిన తేదీ
పెరిమళ్ల	తాడేపల్లిగూడెం	4-9-62
కరిచర్లగూడెం	కొవ్వూరు	26-9-62
జగన్నాధపురం	,,	26-9-62
దేవరపల్లి	,,	29-9-62
కొత్తవాపొడలగూడెం	,,	30-9-62
కొక్కిరపాడు	ఏలూరు	20-9-62
ఐ. యస్. రాఘవపురం	,,	24-9-62
పి. కన్నాపురం	,,	29-9-62
	కృష్ణా జిల్లా	
పోలుకొండ III	కైకలూరు	5-9-62
ఉనికిల్లి	,,	5-9-62
వేమిరెడ్డిపల్లి	తిరువూరు	12-9-62
కంచకోడూరు	బందరు	16-9-62
పోతేపల్లి	,,	16-9-62
శ్రీకాకుళం	దివి	18-9-62
తుట్టగుంట	గన్నవరం	1-9-62
	గుంటూరు జిల్లా	
గనికపాడు	గుంటూరు	11-9-62
చింతపల్లి	సత్తెనపల్లి	25-9-62
	ఖమ్మం జిల్లా	
అల్లిపురం, దనుసాలపురం	ఖమ్మం	5-9-62
నరసింహాపురం, చింతలాని	,,	7-9-62
తిమ్మినేనిపాలెం	,,	8-9-62
యానంబల్లి	బూర్గంపాడు	8-9-62
ఇర్లపూడి	ఖమ్మం	12-9-62
తెలగవరం	మధిర	21-9-62
లింగగూడెం	కొత్తగూడెం	23-9-62
అన్నపరెడ్డిపల్లి	ఖమ్మం	25-9-62
నారాయణపురం, రాజుపటం శివారు	మధిర	13-9-62

★


మన మాతృ
దేశ రక్షణకు
1972
దేశరక్షణ
బాండ్లను
విరివిగా
కొనండి
వీటికి సాలీనా 4¼% వడ్డీ లభిస్తుంది. ఈ వడ్డీని ప్రతి ఆరు నెలలకీ చెల్లిస్తారు.
రూ 100 గుణిజాలలో ఇవి లభిస్తాయి.
వీటికి 1972 నవంబరు 10 వ తేదీన జారీచేసిన ధరను తిరిగి చెల్లిస్తారు.
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయాలు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలు, వాటి సబ్సిడియరీ శాఖలలో ఈ బాండ్లను కొనడానికి దరఖాస్తులను స్వీకరిస్తారు.
భారత ప్రభుత్వము
4¼%-1972 దేశరక్షణ బాండ్లు

సాహిత్యము -
సమకాలిక జీవిత చిత్రణము

మారేమల్ల నాగేశ్వరరావు

వాఙ్మయము కావ్యమనియు శాస్త్రమనియు ద్వివిధము. కావ్యవాఙ్మయము ప్రవృత్తి హేతుకమగు హృదయముతో సమ్యక్సంబంధము కలిగియుండును. శాస్త్ర వాఙ్మయమాలోచనామూలకమగు మనస్సుతోడను, దజ్జన్యమగు బుద్ధితోడను విడదీయరాని, సూటియైన సంబంధము గలిగియుండును. మనఃప్రభావ మొకకొంత కావ్యవాఙ్మయముపైఁ బ్రసరించు నవకాశమున్నది. కాని హృదయ ప్రవృత్తి శాస్త్రవాఙ్మయముపైఁ బ్రసరించు నవకాశ మసలు కలుగదు. ఇఁక నీ కావ్యవాఙ్మయము కూడ నాత్మాశ్రయమనియుఁ బరాశ్రయమనియు రెండు విధములు. ఆత్మాశ్రయకవిత్వమునందు రచయిత యొక్క బాహ్యప్రకృతికి సంబంధింపని కేవలమాంతరమగు హృదయప్రకృతియుఁ, దదనుభవములును బ్రవ్యక్తములగును. పరాశ్రయకవిత్వమునందు రచయిత యొక్క యాంతర ప్రకృతియే కాక దాని ననారతము ప్రభావిత మొనర్చు బాహ్యప్రకృతి యొక్క ప్రగాఢ ప్రవృత్తియు ప్రచురముగ గోచరించును. సాహిత్యము, సారస్వతము, వాఙ్మయము నను మూఁడు శబ్దములు యథార్థప్రకృతి ననుసరించి భిన్నార్థకములే యయ్యు నొకదాని కొకటి పర్యాయముగా వాడఁబడుట సాంప్రదాయికమైనవన్న విషయము ముఖ్యముగ గమనింపఁదగి యున్నది. కావ్యవాఙ్మయమును దృష్టియందుంచుకొని వ్యవహృతములైనవే సాహిత్యము, సారస్వతము నను విషయము గుర్తుంచుకొనవలసి యున్నది. కవికృతమగు కావ్యమునందు మానవకోటితో నిబిడమైన లోక ప్రవృత్తి ప్రతిఫలించు చున్నది. అనఁగాఁ గావ్య మనఁబడు సాహిత్యమునందు సమకాలపు మానవుల జీవితగతులును, వాని కాధారభూతములగు సమస్త ప్రవృత్తులును వ్యాఖ్యాన రమ్యములుగాఁ బ్రభాసించునని భావము. రచయిత లోకమునందలి మానవులలోఁ వానొకఁడు. ఆ మానవకోటి ప్రవృత్తులను, దన ప్రవృత్తితోఁ దగు మోతాదులో సమన్వయించుకొని యతఁడు తన కావ్యములందుఁ బ్రతిఫలింపఁ జేయును. అందువలననే సాహిత్యము సామాజిక దర్పణ మను వ్యవహార మేర్పడినది.

మనము ప్రపంచమునం దనుభవించిన యా యా భావానుభవములను బఠితృహృదయాహ్లాదకరముగ నక్షరమగు భాషారూపమున నభివ్యక్త మొనర్చుటతో సాహిత్య సృష్టి జరుగుచున్నది. చదువరుల యెడదల నాకర్షింపఁజేయు లోక ప్రవృత్తి యనెడు మానవకోటి కృత్యసంతతితో సంబంధించి యుండుటచేఁ దద్విధమగు సాహిత్యపఠన మొనర్చి తత్తత్పరిస్థితులలో సాన్నిహిత్య తాదాత్మ్యముల ననుభవింతుము. ఛందో వ్యాకరణాలంకారశాస్త్రాదికములందుఁ గేవల మా యా సందర్భములకు సంబంధించిన శాస్త్ర విషయక చర్చలే యుండును గాని మానవ జీవిత ప్రతిఫలనముగాని తత్ప్రవృత్తిగాని కన్పట్టదు. అందుచే నిట్టి వాఙ్మయమునందు హృదయ ప్రమోద ప్రదమగు సమకాలిక సామాజిక జీవిత చిత్రణాదులు సందర్భింపవు. సాహిత్యము లోక ప్రవృత్తివలన సముద్బుద్ధమగుచుండుటచేతఁ దత్కారణములును నా ప్రవృత్తియందే గోచరించును. కవికి మానవభావములందును, దచ్చర్యలయందును గల ప్రీతియు, యథార్థ భావనాజగత్తులందుఁగల యభిరతియు నుత్సాహకారణములై వాని నాతఁడు రమణీయమైన విధమున లోకమున కందిచ్చు ప్రయత్నమున మహనీయమైన సారస్వత సృష్టి జరుగుచున్నది. కవి హృదయము లోక ప్రవృత్తితో నా యా విధముల నుద్వేగోత్తేజనములకు లోనైనపుడు తత్తదుచితముగ భావగీతము, ప్రబంధము, నాటకము, కావ్యము ప్రక్రియల రూపమున సాహిత్య సృష్టి జరుగుచున్నది.

ప్రతిభావంతుఁడును, సమధిక లోకానుభవ సంపన్నుడును, నపరిమిత పాండితీ

మండితుఁడును నగు రచయిత యొక్క రచనమునందు సర్వతోముఖముగ మానవ జీవితము సర్వాంగ శోభితముగ విన్యసిత మగును. ఒక జాతికిఁ జెందిన ప్రతి వ్యక్తి జీవిత ప్రవృత్తియుఁ దన జాతి జీవిత గతి నియతులను వ్యక్తీకరించును. అందుచేత సమర్థుఁడగు కవి రచనలందుఁ దజ్జాతి సాంఘిక మత రాజకీయార్థికాద్యంశములు, తత్తత్సంప్రదాయములు సూచ్యములగు చుండును. కవులు తామెంత ఘనశక్తి సంపన్నులైనను దాము నివసించు దేశకాలముల నతిక్రమించి మనలేరు, మఱి కావ్య రచనము సలుపలేరు. అందువలన నాతని రచనలందుఁ దత్కాలపుఁ బ్రజల మనః ప్రవృత్తులును, జరిత్రలును శాశ్వత రమణీయములై శోభించుచుండును.

ఒకవేళ నే కవిగాని తన జాతి సంప్రదాయాదుల నీసడించుకొనువాఁడై తద్వ్యతిరిక్తముగ వ్యవహరించి నప్పటికిని మొత్తముమీఁదఁ దన రచనల యందు దృఙ్మాత్రముగానైనను దన సమాజ ప్రవృత్తిని మీఱి వ్రాయకపోఁడు. కవి తన జాతి నీతిని, సంస్కృతిని సురుచిరముగఁ, జిరతరముగఁ దేజరిల్లఁ జేయును. సర్వకాలాల వారికి శాశ్వతముగాఁ దన జాతినిగూర్చి యనేక విషయములను జాటనేర్చిన జాతి ప్రతినిధి కవి. అట్టి కవుల పలు రచనల వలననే యా యా జాతి సమాజముల మత వైజ్ఞానిక నైతిక సామాజిక పరిస్థితులు మనము ప్రత్యక్షముగ గమనింపఁ గలుగుదుము. కాలము పరిణామ శీలమైనది. తత్కాలబద్ధమగు జాతి జీవిత మనేక విభిన్న జాతుల సంఘర్షణ, సన్నికర్షణలకు లోఁగి యనేక విధములఁ బ్రభావిత మగుచుండును. అప్పుడా ప్రభావమున కా సమాజమునందలి ప్రతి వక్తి పలెనే కవియుఁదానును లోఁబడి తీరును. అందుచేత నాకవిరచనలయం దాతని స్వీయజాతి స్వభావమేకాక దాని నన్ని విధములఁ బ్రభావితమొనర్చిన యన్యజాతుల స్వరూప స్వభావములును నిరూపితములై యుండును. సాహిత్యపఠన మే కారణము వలన నొకజాతియొక్క ప్రాచీనచరిత్రమే కాక యితరజాతుల ప్రభావముతోడి తన జాతి జీవనమునుకూడ నభివ్యక్తము చేయును.

ప్రతి జాతికినిఁ గొన్ని ప్రకృష్టధర్మములును వానిని సదా, సర్వథా రక్షింప సమర్థములైన తేజశ్శక్తులును నుండి తీరును. అనేక కాలములలో ననేక కారణముల వలన ననేక యుద్ధములు, విప్లవములు విజాతీయులతోడనో, స్వజాతీయులతోడనో యా యా దేశములలో వచ్చుచుండుట సహజము. ఆవిధముగ వచ్చువాని పుట్టు పూర్వోత్తరములను గూర్చియుఁ, దత్పరిణామ విపర్యయములగూర్చియుఁ దెలుపునది రాజకీయ చరిత్ర. ఆయా సంఘటనలకు మూల రూపములగు మానవహృదయ ప్రవృత్తులను వాసనా రంగములుగాఁ జిత్రించునది సాహిత్యము. కావున రాజకీయ చరిత్రకు సాహిత్యమునకుఁ గొండంత భేదమున్నదని యిందునలన స్పష్టమగుచున్నది. కాని యథార్థచరిత్ర రచయితయైనవాఁడు సాహిత్యరాజకీయ చరిత్రలకుఁ గల యవినాభావ సంబంధమును గుర్తించి యా యా జాతుల సంపూర్ణచరిత్రను స్వభావ మహనీయముగఁ దీర్చిదిద్దును, రాజకీయచరిత్ర యా యా సంఘటనల దెలియఁజేయు చలనచిత్రముకాఁగా, సాహిత్య మా సంఘటనలకు మూలరూపములగు మానవహృదయ ప్రవృత్తులను ద్యోతిలఁజేయు చిత్రదీపమనుట స్పష్టముగదా ?

ఒక దేశమున సాహిత్యమనునది వృద్ధి చెందిన దనిన నాదేశమునందుఁ దత్పోషకమగు సామాజికాదరణము సమధికముగా నున్నదని తాత్పర్యము. అందువలన సాహిత్య తత్త్వమును సంపూర్ణముగా నర్థము చేసికొనుటకుఁ దత్కాల సంబంధియగు సమాజచరిత్రము నవలోకింపవలసి యున్నది. ప్రతి సాహిత్యప్రక్రియ వెనుక కవి యాత్మీయత దీపించునట్లు నతని జాతీయత నీపించును. ప్రతిజాతీయత వెనుక నట్లే తత్కాలపు సాంఘిక మతాదిక విషయములను దీర్చి దిద్దు పరిస్థితులు భాసించుచుండును. ఆ పరిస్థితులు తత్కాలమునందు సృష్టికివచ్చిన కళలయందును, సాహిత్యమునందును, దాత్త్విక పర్యాలోచనలందును బ్రతిఫలించుచుండును. కావున సాహిత్య పరిశీలనము సమాజాచార సంప్రదాయములు, సంస్కృతినాగరకతలు, విజ్ఞానవికాస ప్రకాశములు, మత తత్త్వశాస్త్రములు, రాజ్యాంగ విషయములు మున్నగునవి ప్రవచింపఁబడు దేశీయ చరిత్రలోనికిఁ గొంపోవును. ఆయా కాలములందలి ప్రజల జీవితములో భిన్న మార్గములున్నను నవి పరస్పర విరుద్ధములుగాక యొక దానిపై నొకటి యాధారపడి యుండును. ఈ విషయ మా యా కాలములందు వచ్చిన సాహిత్య ప్రక్రియల యందును, దేశచరిత్రల యందును, దాత్త్విక మత కళా సంప్రదాయముల యందును గోచరించును.

ఉత్తమ కళాసృష్టిగాని సాహిత్య సృష్టిగాని జరుగవలయునన్న దానికి సంబంధించిన సామాజికాది పరిస్థితులు మిగుల ప్రశాంతముగా నుండవలయును. సర్వరక్షాదక్షుఁడగు మహారాజు పాలనమునందున్న తమును, నుదాత్తమును నగు సాహిత్య కళాదుల యావిర్భావము జరుగును. శ్రీకృష్ణదేవరాయల కాలమునను, దర్వాతఁ

గొంత కాలమును దేశమునందుఁ బ్రజలు శాంతి సౌఖ్యముల ననుభవించిరి. ఆనాఁడుద్భవించిన మనుచరిత్రము, పారిజాతాపహరణము, ఆముక్తమాల్యద, వసుచరిత్ర వంటి మహనీయాంధ్ర ప్రబంధములు మీఁద వ్యక్త మొనర్చిన యభిప్రాయమును బాహాటముగా సమర్థించుచున్నవి. ఆనాఁడొక్క సాహిత్యమేకాదు శిల్పము, చిత్రలేఖనము, సంగీతము, నాట్యము, తాత్త్విక చర్చావిచికిత్సలు మున్నగునవన్నియుఁ బర్యాప్త వైభవముతోఁ బరిఢవిల్లెనని యానాఁడు బొడసూపిన సాహిత్య గ్రంథములు తార్కాణించుచున్నవి.

దేశమున విప్లవములు, యుద్ధములు, నన్యరాష్ట్రముల తోడి సంసర్గము మున్నగునవి కలిగి ప్రజాహృదయములందును, బరిస్థితులందును గ్రొత్త పాఁతల నడుమ సంఘర్షణ మేర్పడి యపూర్వములగు నాశయాధర్మములును, విధివిధానములును, భావప్రభావములును బొడసూపును. ప్రజల యెడదలయందు ద్రేకోత్తేజనముల కతివేలమగు స్థానమేర్పడును. సాధారణముగఁ గవి యావేశపూరితుఁడై రచన సలుపునపుడా కాలపు నిమ్నోన్నతము లతని కావ్యములందుఁ దప్పని సరిగా గోచరించును. ఇట్టి గ్రంథములు పాశ్చాత్య సాహిత్యములం దనేకము గన్పట్టుచున్నవి. పలనాటి వీరచరితము, కృష్ణరాయవిజయము, మధురా విజయము మున్నగు గ్రంథములం దీయంశములు గమనింపఁ దగియున్నవి. ముద్రారాక్షస నాటకమునందు విపత్కరములగు యుద్ధ పరిస్థితులందు సమస్తధా తమ్ము నమ్ముకొన్న రాజునకు రక్షణను గలిగింపఁ జూచు మంత్రుల బుద్ధికుశలత గోచరించును. ఆంధ్ర దేశమునందుఁ బదునైదవ శతాబ్దివరకు మతసంబంధమగు సంఘర్షణ, అశాంతి బహుముఖీనముగ వ్యాపించినవి. వీరశైవ, వీరవైష్ణవ మతముల పేరిట దేశమున శాంతి సర్వథా తిరోహితమైనది. వీరశైవులు తమ మతముకొరకుఁ, దత్ప్రతిష్ఠకొరకుఁ దమసర్వస్వము ధారవోసిరి. మరియందులకుఁ దన్మతప్రచారకులు సాహిత్యమును బ్రధాన సాధనముగా బ్రయోగించినారు. బసవపురాణము, పండితారాధ్య చరిత్రము, కుమారసంభవము, శివతత్త్వసారము, అనేక రుద్రగద్యలు శైవ మతానురక్తుల యుద్వేగోత్తేజనముల నుద్ఘాటించు చున్నవి. మత సామరస్యము కొరకుఁ బాటువడిన తిక్కనవంటి వారి యద్వైత భావమునందును, దత్ప్రతిపాదక హరిహరనాథ తత్త్వమునందును నిది గోచరించును. కృష్ణదేవరాయల కాలమున వైష్ణవ మతము విజృంభించి యున్నటుల ఆనాఁడు బొడసూపిన సాహిత్య గ్రంథములు, తదితర చారిత్రకాధారములు నుద్ఘోషించుచున్నవి. నాఁడు పరమత సహన మున్నమాట యథార్థమే, కాని యధికాదరణము వైష్ణవమునకే. శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యద వైష్ణవ ప్రాధాన్యముపన్యసించు నద్భుత ప్రబంధము. అందలి మాలదాసరి కథ, గోదాదేవి కథ, ఖాండిక్య కేశిధ్వజుల వృత్తాంతము తన్మత ప్రామాణ్యమునే ప్రతిష్ఠాపించు చున్నవి.

రాయలయుగమునఁ బ్రాదుర్భవించిన సాహిత్యమునందు నాఁటి ప్రజల యాచార వ్యవహారములు, సౌభాగ్యానుభవ మధుర భోగ రసికత, తాత్త్విక మత వేదాంతిక విషయములందభిమానాభినివేశములు, మాతృదేశ గౌరవాభిమానములు, సమున్నత సాహితీ కళాసంప్రదాయ విలసిత విశిష్ట కౌశలము, నుదాత్తాశయ విస్ఫురిత జీవన సమాకాంక్ష, శత్రు వీర దుర్నివార యశోమహితశౌర్య ధైర్యౌదార్య గాంభీర్య బల పరాక్రమములు మున్నగునవి సుస్పష్టములై గోచరించును. నాయకరాజుల యుగమునఁ బ్రజలు రాయలకాలమునందు కంటెఁ బ్రశాంత మధుర సౌఖ్య భూయిష్ఠమగు జీవితమును సర్వ సౌభాగ్య సుందరముగా ననుభవించినారు. నాఁటి సాహిత్య కళా రంగములం దప్రతిహతకాముక శృంగార పరిస్ఫురిత భోగజీవిత తృష్ణయే సర్వముఖీనమై గోచరించినది. భక్తిభావ మహనీయమగు క్షేత్రయ్య పదములందు సహితము భోగముఖ శృంగారమే నానావతారములతో నివ్వటిల్లినది. తారాశశాంకము, రాధికా సాంత్వనము మున్నగుకావ్యములందీ కాముక శృంగారమే పరమార్థసాధన మన్నట్లు భాసించినది. వసుచరిత్రము, మనుచరిత్రము వంటి భవ్య ప్రబంధములు నిబంధింపఁ బడుటకు వలసిన ప్రతిభా పాండిత్యము లానాఁటి కవులలో మృగ్యము లగుట వలనను, నిరంతరమును నిరభ్యంతరమును నగు ప్రశాంత మధురజీవితము సాధ్యమగుట వలనను, రాజుల మనఃకాంక్ష పచ్చి శృంగారమై యుండుటవలనను నాటి కవుల లేఖినులనుండి యిట్టి కావ్యము లుత్పత్తిల్లినవి. అటు తర్వాత దేశము నానావిధ రాజకీయ సంఘర్షణలచే నల్లకల్లోలమై పోయినది. నేల యేలికలలోఁ గవులలో నవినీతి దట్టమై పరిశుద్ధ వర్తన మన్నది పగటికలయై పోయినది. చంద్రలేఖా విలాపమువంటి బూతుకృతులు పొడసూపినవి. ప్రాచీన పురాణేతిహాసము లందలి యాయా కథలు వచన రచనలుగా స్వరూపము నిరూపించుకొన్నవే కాని యుదాత్త రమ్యమగు సాహిత్య ప్రక్రియ పరిఢవిల్లలేదు. ఆధునిక యుగమున వచ్చిన సాహిత్యము పాశ్చాత్య సాహితీ వాసనా వాసితులైన, సమాజ సంస్కరణ భావ ప్రభావా

కృష్టమానసులైన వీరేశలింగము పంతులు, గురజాడ అప్పారావు పంతులు, పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులు వంటి వారి రచనలతోఁ దేజరిల్లినది. వీరి కృతు లందలి నీతి దుష్టమును, సనాతన విమూఢాచార ధృష్టమును నగు ప్రజల ఛాందస సంకుచిత దృష్టి నిరూపింపఁ బడిన తన్నివారకమగు సంస్కార భావ ప్రభావము సమధిక ప్రాధాన్యము సంతరించుకొన్నది. ఆంధ్ర సాహిత్యము నందపూర్వములైన నూత్న సాహిత్య ప్రక్రియలు నవల, వ్యాసము, ప్రహసనము, నాటక నాటికలు (ఆంగ్ల నాటక నాటికల వంటివి), స్వీయ చరిత్రము, జీవిత చరిత్ర, కవుల చరిత్రము మున్నగునవి సాక్షాత్కరించినవి. తర్వాతఁ దర్వాతఁ గ్రమముగా మన ప్రాచీన పురాణేతిహాసములందలి యుపాఖ్యానమునకు భిన్నమైన కథానిక వంటివి విరివిగాఁ బ్రచారములోనికి వచ్చినవి. ఇఁక నూహప్రహేళికలకు, గల్పికలకు నంతేలేదు.

ఆధునిక యుగమున నిర్వదియవ శతాబ్ది యందుఁ బొడసూపుచున్న సాహిత్యము నందుఁ బ్రపంచ స్వరూప స్వభావములం దపూర్వ విప్లవము గొనివచ్చి, నవనవోన్మేషణము పరికల్పించుచున్న విజ్ఞానశాస్త్ర ప్రభావము విరాడ్రూపము వహించి విభాసించుచున్నది. పారతంత్ర్యమునందు బడలువడిన భారతము తదుచ్చాటన సమర్థమగు సాహిత్య వ్యవసాయమునందు గడిదేరినది. బాపూజీ యాధ్వర్యమునఁ బర ప్రభుత్వమును బారఁద్రోలుటకు నడుముకట్టిన జాతీయమహాసభ యందు విజ్ఞాన నిధులును, నపరిమిత సంఘసంస్కారభావ కందళిత హృదయారవిందులును నగు కవితిలకులనేకులు పాల్గొని విశేష కృషిచేసిరి. బాపూజీ హృదయ సంస్కార మహితమగు హరిజనసేవ, తజ్జనోద్ధరణము మున్నగు నంశములును, పారతంత్ర్యోచ్చాటనావిహిత స్వాతంత్ర్య సమాకాంక్షయును నీ కవి మహనీయుల హృదయముల నాకర్షించినవి. ఈ సందర్భమున విదేశీయ వస్తు విసర్జనము, స్వదేశీయ వస్త్వభిమానము భారతీయుల నందరను బరమపవిత్ర చరిత్రులను గావించినవి. ఏ తత్ప్రభావము తెలుఁగురచయితలను గూడ మిగుల నాకర్షించినది. అందువలన ననేక దేశభక్తి ప్రబోధక కృతులు సముద్భవించినవి. జాతీయ మహాసభ యాధ్వర్యవమునఁ దదితర పక్షముల యాధ్వర్యవమున జరిగిన స్వాతంత్ర్య సమర ఘట్టములనేకములు భవ్య కవితావేశ సంపన్నులగు కవిపుంగవుల లేఖినులలో వింత సొగసులు సింగారించుకొన్నవి. నేఁడు మనము స్వతంత్ర భారతమునందున్నాము. రెండు నిండు శతాబ్దులు పరపాలనలో బడలి, సుడివడి బడుగుదేశమై పోయిన మనదేశమును బునరుద్ధరింపఁజేయు పూనికలు ప్రజాతంత్ర భారతప్రభుత్వ యాజమాన్యమునను, తదితరముగను నభ్యుదయ ప్రణాళికాది విధానములలోఁ గడు చురుకుగా జరుగుచున్నవి. దేశమునందున్న సాహిత్యసంస్థలు, పత్రికా సంస్థలు, ప్రభుత్వము సాహిత్యపరుల చేతను, కవినికాయముల చేతను ననేకవిధ రచనలు చేయించుచున్న వీ సందర్భమున.

నేఁడు ప్రపంచమునందెల్లెడల వ్యాపించిన, వ్యాపించుచున్న ప్రజాస్వామ్య భావములు, సోషలిస్టు-కమ్యూనిస్టుభావములు, జాతీయతా విలక్షణమగు నంతర్జాతీయ వైఖరి, విజ్ఞాన శాస్త్రప్రభావము, ననాదరము పాలగుచున్న మతాభినివేశము, యాథార్థ్యవిహిత సంఘటనాత్మక రచనా సంవిధానము మున్నగు వివిధాంశముల చిత్రణము సాహిత్యమునందు గోచరించుచున్నది. ఇప్పట్ల పద్యరచనలకంటె మిక్కిలి విరివిగా గద్యరచనలు ప్రచారమునందుండుట గమనింపఁదగిన యంశము. భావకవిత్వోద్యమ మనేకరచయితలను నాకర్షించుటయు నీ సందర్భమున గుర్తింపవలసి యున్నది. ప్రాచీనములైన సాహిత్య లక్షణ సంప్రదాయములను దిరస్కరించు తత్త్వము భాషయందును, భావములందును బ్రచురముగ గోచరించుచున్నది. కవిత్వమునకు నేఁడు ఛందస్సక్కరలేదని, యథేచ్ఛముగ వచనములను బోలిన గీతికలను వర్ధమాన యువకవులు, పాశ్చాత్యసాహితీవాసితులు సృజించుచున్నారు. ఈ తత్త్వము నేఁటి సాహిత్య సంబంధులగు రచనలందు బహుముఖముగ గోచరించు చున్నది. అట్లని సంప్రదాయములను బాటించువారు లేరనరాదు. వారును నున్నారు. ప్రాచీన పద్ధతులలో వారింకను రచనలు గావించుచున్నారు. ప్రాఁత క్రొత్తలకు మేలికలయికను కూర్చుచు విశిష్టసాహిత్యసృష్టినిఁజేయు విజ్ఞులును నేఁడున్నారు. ఇన్ని తెలుఁగులవారి తత్త్వములును, వారి ననుసరించి సమాజ పరిస్థితులును నేఁటిసాహిత్యమునందు స్పష్టముగ గోచరించుచున్నవి. ఇది యిట్లగుట ఒక్క మన (తెలుఁగు) సాహిత్యమునందేకాక ప్రపంచమునందలి సమస్త నాగరక సాహిత్యములందును గోచరించుచున్నది.

సాహిత్యము సమాజము యొక్క సర్వతోముఖ జీవితచిత్రణమొనర్చినంత మాత్రమున ఘనమైనది కాదు. విశ్వజనీనత యన్నది యందు గోచరించి తీరవలయును. కృతికి శాశ్వతత్వము ప్రసాదించునదీ విశ్వజనీనతయే. ఒకజాతియొక్క సాహిత్యగ్రంథములు మరియొకజాతి వారి కాదరణపాత్రములగుటకు హేతువందలి యాకర్షణీయమగు విశ్వజనీనతయే. ఉదాత్తమగు సర్వవిధ సాహిత్యమందును నిది గోచరించును.

(మిగతా 45 వ పేజీలో)

పంచాయతీరాజ్య పురోగమనం

స్త్రీలకు శిక్షణ శిబిరం

ఆమనగల్లు పంచాయితీ సమితిలోని పెద్దాపురం గ్రామంలో 1962 నవంబరు 23 వ తేదీనుండి ప్రత్యేక గ్రామ సహాయక శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. 57 సహాయకులకు వ్యవసాయం, పశుపోషణ, లఘు పరిశ్రమలు మొదలైన విషయాలలో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఆమనగల్లు పంచాయితీ సమితిలోని ఆరుపల్లి గ్రామంలో నవంబరు 27 వ తేదీనుండి స్త్రీలకొరకు గ్రామ సహాయక శిక్షణ శిబిరాన్ని కూడా నిర్వహించారు. 55 మందికి పారిశుద్ధ్యం, కుట్టుపని, కుటుంబనియంత్రణం, ప్రసూతి, బాలల సంక్షేమం తదితర విషయాలలో శిక్షణ ఇవ్వడం జరిగింది.

శ్రమదానం ద్వారా రోడ్డు నిర్మాణం

గుంటూరు జిల్లా, ఏడుగురాళ్ళ పంచాయతీ సమితిలోని మదినపాడులో పంచాయతీరాజ్య తృతీయవార్షికోత్సవం సందర్భంగా నవంబరు 1 వ తేదీన శ్రమదానం ద్వారా నిర్మింపబడే కమ్యూనిటీ భవనానికి పునాదిరాయిని వేశారు. రామాపురం–మోర్జంపాడు గ్రామాల మధ్య రెండు ఫర్లాంగుల మట్టి రోడ్డును శ్రమదానం ద్వారా నిర్మించారు.

సేవా సహకార సంఘాలు

అనంతపురం జిల్లా కొడిగనహల్లి బ్లాక్‌లోని లేపాక్షి గ్రామంలో ఉత్సాహవంతులైన గ్రామస్థులు కుర్లపల్లి గ్రామంలో ఒక సేవా సహకార సంఘాన్ని నెలకొల్పారు. ఈ సంఘం సభ్యత్వం 33. దీని పెట్టుబడి ధనం రు. 330–00. ఈ సంఘాన్ని నమోదు చేయించిన తర్వాత చక్కగా నిర్వహింపబడుతూ ఉంది.

హరిజన వాడలో పారిశుద్ధ్య కార్యక్రమం

మెదకుజిల్లా, దౌలతాబాదు బ్లాకులోని హత్నూరు గ్రామంలో నవంబరు 28 వ తేదీనుండి మూడు రోజులపాటు గ్రామ సహాయకుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 30 మంది సభ్యులు శిబిరంలో పాల్గొన్నారు. శిబిరంలో శిక్షణ పూర్తి అయిన తర్వాత వారు శ్రమదానంలో పాల్గొని హరిజన వాడను శుభ్రం చేశారు.

ఎరువుల పంపిణీ

తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురం పంచాయతీ సమితిబ్లాకులో 1962 నవంబరులో 89 పౌండ్ల రసాయనిక ఎరువులకు తోడు మొత్తం 7152 పౌండ్ల ఎరువుల పంపిణీ జరిగింది. 112 కంపోస్టు గోతులను త్రవ్వారు. 1890 టన్నుల ఎరువులను తయారు చేశారు. ఈ నెలలో బ్లాకులో 12 గ్రామీణ మరుగు దొడ్లను నిర్మించారు. ఒక యువజన సంఘం, రెండు రైతు సంఘాలతో సహా 48 మంది సభ్యురాండ్రతో 4 మహిళా మండలులను ప్రారంభించారు. యువజన సంఘంలో 15 మందీ, రైతు సంఘాలలో 24 మందీ సభ్యులు ఉన్నారు.

వయోజన విద్యా కేంద్రం

అమ్మనబ్రోలు పంచాయితీ సమితిలో 1962 నవంబరులో ఒక వయోజన విద్యా కేంద్రాన్ని ప్రారంభించారు.

మహిళా మండలి

కృష్ణాజిల్లా ముసునూరు పంచాయితీ సమితిలోని పల్లెర్లమూడి గ్రామంలో 1962 నవంబరులో ఒక మహిళా మండలిని ప్రారంభించారు. దీనికితోడు రెండు కుట్టుపని కేంద్రాలను కూడా నిర్వహిస్తున్నారు. మోఖాసనరసన్నపాలెం గ్రామంలోని సమితి ఎలిమెంటరీ పాఠశాలలో ఒక బాలవాడ సంఘాన్ని ప్రారంభించారు.

ముసునూరు, పోతురెడ్డిపల్లి గ్రామాలలోని మహిళా మండలుల నుండి యాభై శాతం విరాళం ప్రాతిపదికపై రూ॥ 130/– లను సేకరించి వాటికి ఎంబ్రాయిడరీ సామగ్రి సరఫరా చేశారు. గోపవరం మహిళా మండలినుండి యాభైశాతం విరాళంగా రు. 145.లు సేకరించి కుట్టుమిషన్‌ను సరఫరాచేశారు.

సహకార సంఘాలు

చిత్తూరు జిల్లా నగరి పంచాయితీ సమితిలోని పురోగాములైన రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి 1004 పౌండ్ల రసాయనిక ఎరువులను వాడారు. 50 శాతం విరాళం ప్రాతిపదికపై క్రొత్తగా 3 ఫర్లాంగుల కచ్చారోడ్డు నిర్మించారు. 7 ఫర్లాంగుల రోడ్డు మరమ్మతు చేశారు. రు 635/ ల వాటాధనంతో 49 కుటుంబాలను క్రొత్తగా సహకార పరిధిలోకి తేవడం జరిగింది. దీనికితోడు గ్రామీణ డిపాజిట్లుగా రు 390 లను సేకరించారు.

వస్తు ప్రదర్శన

అనంతపురం జిల్లా, పెనుగొండ పంచా

(మిగతా 45 వ పేజీలో)

ప్రకటన

గత పదిసంవత్సరాల కాలంలో ప్రభుత్వ సర్వీసునుంచి కానీ లేదా సైనిక సర్వీసునుంచి కానీ రిటైరైన సివిల్ సర్జన్లు, అసిస్టెంటు సర్జన్లు, లెబొరేటరీ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు, రేడియోగ్రాఫర్లందరూ అవసరమైనప్పుడు వారి సేవలను వినియోగించుకోడానికి వీలుగా దిగువ తెలిపిన వివరాలను హైద్రాబాదులోని ఆంధ్రప్రదేశ్ వైద్యశాఖ డైరెక్టరుకు అందజేయ వలసిందిగా విజ్ఞప్తి చేయబడుతున్నది :

1. పేరు, విద్యార్హతలు :
2. వయస్సు (జన్మించిన తేదీ తెలపాలి) :
3. రిటైరైన తేదీ, ప్రదేశం :
4. ప్రస్తుత చిరునామా :
5. రిటైరైన తేదీనాటికి పొందిన జీతం :
6. ప్రస్తుతం లభిస్తున్న పింఛను మొత్తం :
7. తాము పనిచేయదలచిన ఉద్యోగ వివరాలు :

(సం.) కె. ఎస్. రావు,
వైద్యశాఖ డైరెక్టరు, ఆంధ్రప్రదేశ్, హైద్రాబాద్.

(44 వ పేజీ తరువాయి)

నవంబరు 30 వ తేదీనుంచి 3 రోజులపాటు గ్రామ సహాయకు శిక్షణశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించే ఒక ప్రదర్శనాన్ని కూడా ఏర్పాటు చేశారు. శ్రమదానం తర్వాత డిశంబరు 2 వ తేదీన చిన్నతరహా నీటివసరులు, కమ్యూనికేషన్ మొదలైన విషయాలపై చర్చలు జరిపారు.

శ్రమదానం

అనంతపురం జిల్లా ముడిగుబ్బ బ్లాకులో పంచాయితీ రాజ్య తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నవంబరు 1 వ తేదీన గ్రామస్థులు, గ్రామ పంచాయితీల అధ్యక్షులు కలిసి 4 బావుల త్రవ్వకం, ఒకపాఠశాల భవన నిర్మాణం, రోడ్డు పనులు మొదలైన వాటిని చేపట్టారు. ఆ రోజు మొత్తం రు. 4,990 లు విలువ చేసే పనిని పూర్తి చేశారు. చేపట్టిన మొత్తం పనుల విలువ రు. 17,990 లు. ★

(43 వ పేజీ తరువాయి)

సాహిత్య చరిత్రము రాజకీయమగు దేశచరిత్రకును, రాజకీయమగు దేశచరిత్రము సాహిత్య చరిత్రకును బరస్పరము వ్యాఖ్యానము లగుచున్నవి. అందుచేతనే యాయా చరిత్రల నవలోకించు వారీ విశేషవిషయమును గుర్తించి పరస్పర సమాశ్రయావసరమగు సాహిత్య పఠన మొనర్ప వలసియున్నది. అప్పుడే సర్వతోముఖముగు యథార్థచరిత్రము గోచరము కాఁగలదు. మరి సాహిత్యము సమకాలిక జీవితచిత్రణమన్న దిందులకేగదా? ★

తక్కువగా మాట్లాడండి !
ఎక్కువగా పని చేయండి !

దేశరక్షణ కృషికి పటిష్ఠమైన చర్యలు గైకొనడానికై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి అధ్యక్షతన 61 మంది సభ్యులతో రాష్ట్ర ప్రజారక్షణ సంఘాన్ని స్థాపించింది. ఈ సంఘంలో రాష్ట్రమంత్రులు, అనధికార ప్రముఖులు, ప్రభుత్వ ఉన్నతాధికార్లు సభ్యులుగా వున్నారు. ఇదేవిధంగా, హైద్రాబాదు నగరంలో మేయరు అధ్యక్షతన, వివిధ జిల్లాలలో ఆయా కలెక్టర్ల అధ్యక్షతన, బ్లాకులలో పంచాయతీ సమితుల అధ్యక్షుల అధ్యక్షతన, మునిసిపాలిటీలలో మునిసిపల్ అధ్యక్షుల అధ్యక్షతన ప్రజా రక్షణ సంఘాలు ఏర్పడ్డాయి. ఈ సంఘాల సభ్యులందరూ, ఆంధ్రప్రదేశ్ ప్రజారక్షణ సంఘం కార్యదర్శి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్లు, జాతీయ రక్షణనిధికి బంగారం, బంగారు ఆభరణాలు మినహా ఇతర అన్ని రూపాలలోనూ విరాళాలు స్వీకరించడానికి అనుమతించబడినారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజారక్షణ సంఘం సభ్యులు, హైద్రాబాదు నగరమేయరు, జిల్లా కలెక్టర్లు ఇతరవిరాళాలతో పాటు బంగారం, బంగారు నగలను కూడా విరాళంగా స్వీకరించడానికి అనుమతించ బడినారు.

బంగారం, బంగారు నగలతో సహా వివిధ రూపాలలో విరాళాలు స్వీకరించడానికి అధికార్లకు కానీ, అనధికార్లకు కానీ అనుమతించే అధికారం మేయరుకు, జిల్లా కలెక్టర్లకు ఇవ్వబడింది. మార్కెట్ సంఘాలకు రొక్కరూపంలో విరాళాలు స్వీకరించడానికి అనుమతించే అధికారం కూడా కలెక్టర్లకు ఇవ్వబడింది. పైన తెలిపిన వారందరూ విరాళాలు స్వీకరించి వాటికి ఆంధ్రప్రదేశ్ ప్రజారక్షణ సంఘం పేరిట ముద్రించబడిన అధికారిక రశీదులను ఇస్తారు. ప్రతి రశీదుపై ఒక జిల్లా, వరుస సంఖ్య వుంటుంది. దానిమీద ముఖ్యమంత్రి సంతకం ముద్రకూడా వుంటుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాధిపతు లందరూ తమ వద్ద పనిచేస్తున్న ఉద్యోగులనుంచి రొక్క రూపంలో విరాళాలు పొందడానికి అనుమతించ బడినారు.

సంగ్రహ ప్రకటనలు

భారతప్రభుత్వ బాండ్లు, సర్టిఫికేట్లు

భారతప్రభుత్వం ఇటీవల జారీచేసిన వివిధ బాండ్లు, సర్టిఫికేట్లను గురించిన ముఖ్యాంశాలు దిగువ పేర్కొనబడినాయి:-

1. 6½ శాతం బంగారం బాండ్లు, 1977

చందాలగడువు : 12-11-1962 నుంచి అమ్మకం ముందే ఆపివేయబడకపోతే 11-2-1963 వరకు.

చందావిధానం : బంగారం, బంగారు నాణేలు, బంగారు నగలరూపంలో.

చందామీద పరిమితులు : పరిమితిలేదు.

లభ్యమయ్యే స్థానాలు : 1. బెంగుళూరు, బొంబాయి, కలకత్తా, మద్రాసు, నాగపూరు, న్యూఢిల్లీలలోని ఇండియా రిజర్వుబ్యాంకు కార్యాలయాలు.

2. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సబ్సిడరీ బ్యాంకులశాఖలుఅంటేప్రభుత్వట్రెజరీపనులు చూస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు.

3. భారత దేశంలోవున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలు.

డినామినేషన్లు : పదిరూపాయల గుణిజములలో కనీసం నూరు రూపాయలకు లోబడి జారీచేయబడినవి.

వడ్డీ : సాలీనా 6½ శాతం. ప్రతి అర్థ సంవత్సరానికి మే 12 వ తారీకున, నవంబరు 12 వ తారీకున చెల్లింపబడుతుంది.

ఆదాయపుపన్ను చెల్లింపు వగైరా : వడ్డీపై ఆదాయపుపన్ను విధించబడుతుంది. ఐతే కొన్ని సందర్భాలలో మూలధనంమీద మినహాయించబడదు. బంగారం బాండ్లు ఆస్తిపన్ను నుంచి మినహాయించబడినాయి. బాండ్ల అమ్మకంద్వారా పొందేధనంపై అందుకు సంబంధించిన పన్ను మినహాయించబడింది.

తిరిగి చెల్లింపు తేదీ : సమానమైన విలువకు 12-11-1977 లో చెల్లింపబడుతుంది.

2. 4½ శాతం జాతీయరక్షణ బాండ్లు 1972

చందాల గడువు : అమ్మకం త్వరగా ముగియకపోతే 10-11-62 నుంచి ఆరు నెలలు.

చందావిధానం : నగదుగాని,చెక్కుగాని.

చందామీద పరిమితులు : పరిమితిలేదు.

లభ్యమయ్యేస్థానాలు :(అ)బెంగుళూరు, బొంబాయి, కలకత్తా, మద్రాసు, నాగపూర్,

న్యూఢిల్లీలలోని ఇండియా రిజర్వుబ్యాంకు కార్యాలయాలు (ఆ) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సబ్సిడరీ బ్యాంకుల శాఖలు అంటే ప్రభుత్వ ట్రెజరీపనులు చూస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు (ఇ) భారత దేశంలోవున్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలు.

డినామినేషన్లు : వంద రూపాయల గుణిజ ములలో జారీచేయబడినవి.

వడ్డీ : సాలుకు 4¼ శాతం. ప్రతి అర్థ సంవత్సరానికి మే 10, నవంబరు 10 వ తేదీ లలో చెల్లింపబడుతుంది.

ఆదాయపుపన్ను చెల్లింపు వగైరా : వడ్డీపై ఆదాయపుపన్ను విధించబడుతుంది. వ్యక్తుల వద్దనున్న బాండ్ల విషయంలో మూలధనంలో నుంచి దీని మినహాయింపు జరుగదు.

తిరిగిచెల్లించే తేదీ : సమానమైన విలువకు 10-11-1972 వ. తేదీన చెల్లింపబడుతుంది.

3. పదిసంవత్సరాల జాతీయ రక్షణ సర్టిఫికెట్లు

చందాల గడువు : 10-11-1962 తేదీ నుంచి తిరిగి ప్రకటించేవరకు వీటి అమ్మకం జరుగుతుంది.

చందాల విధానం :- నగదుగాని, చెక్కు-గాని లేక పరిణతినొందిన 3½ శాతం వడ్డీ లభించే పదిసంవత్సరాల ట్రెజరీ సేవింగ్ డిపాజిట్ సర్టిఫికెట్ల మార్పిడిద్వారాగాని.

(అ) ఒకేవ్యక్తి రూ. 35,000

(ఆ) ఒకరితోకలిసి సమిష్టిగా కానేవ్యక్తి లేక సంస్థ రూ. 70,000

(ఇ) విరాళాల స్వీకరణపై ఆదాయపు పన్ను మినహాయించబడిన సంస్థ, లోకల్ అథారిటీ రూ. 1,00,000

(ఈ) *ప్రావిడెంట్ ఫండు* :- పరిమితి లేదు.

పైన తెలుపబడిన గరిష్ఠ మొత్తాలలో 3½శాతం, 4 శాతం, పదిసంవత్సరాల ట్రెజరీ సేవింగ్స్ డిపాజిట్లలో పెట్టుబడిపెట్టిన మొత్తాలుచేరి ఉంటాయి.

లభ్యమయ్యే స్థానాలు :- (అ) బెంగుళూరు, బొంబాయి, కలకత్తా, మద్రాసు నాగపూర్, న్యూఢిల్లీలలోని ఇండియారిజర్వు బ్యాంకు కార్యాయాలు. (ఆ) స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సబ్సిడరీ బ్యాంకుల శాఖలు అంటే ప్రభుత్వ ట్రెజరీ పనులు చూస్తున్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైద్రాబాదు. (ఇ) భారత దేశంలో ఇతర చోట్లవున్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలు (ఈ) పైన తెలిపిన బ్యాంకుల కార్యాలయాలు, శాఖలు లేని చోట్లలో ట్రెజరీలు, సబ్-ట్రెజరీలు (ఉ) స్టాండర్డ్ ఏజన్సీ పద్ధతిక్రింద ఒప్పందంపై సంతకంచేసిన అధికార ఏజంట్లు.

డినామినేషన్లు :- 50 రూపాయలు, వాటి గుణిజములలో జారీచేయబడినవి.

వడ్డీ :- సాలుకు 4½ శాతం. చందా మొత్తం డిపాజిట్ చేసిన తేదీలగాయతు 12 నెలలతర్వాత చెల్లింపబడుతుంది.

ఆదాయపు పన్ను విధింపు వగైరా :- వడ్డీకి ఆదాయపు పన్నులేదు.

తిరిగి చెల్లించే తేదీ :- డిపాజిట్ చేసిన తేదీనుంచి 10 కేలెండర్ సంవత్సరాలు ముగిసిన తర్వాత. ఒక సంవత్సరమైన తర్వాత డిపాజిట్ చేసిన తేదీ లగాయతు నిర్ణీత డిస్కౌంటుపై ఎప్పుడైనా తిరిగి చెల్లించబడుతుంది.

4. 12 సంవత్సరాల జాతీయరక్షణ సర్టిఫికెట్లు

చందాగడువు :- 15-11-1962 నుంచి అమ్మకం.

చందా విధానం :- నగదు.

చందా పరిమితులు : (అ) ఒకేవ్యక్తి రూ. 35,000, (ఆ) ఒక వ్యక్తి మరొక వ్యక్తితో గాని, సంస్థతోగాని సమిష్టిగా రూ. 70,000 లు. (ఇ) విరాళాలస్వీకరణపై ఆదాయపుపన్ను మినహాయింప బడిన సంస్థ, లోకల్ అథారటీ - రూ. 1,00,000 లు.

ప్రావిడెంటు ఫండ్లు :- పరిమితిలేదు.

పైన తెలపబడిన గరిష్ఠ మొత్తాలలో 5, 7, 12 సంవత్సరాల జాతీయరక్షణ సర్టిఫికెట్లు, 10 సంవత్సరాల జాతీయ ప్రణాళిక సర్టిఫికెట్లు, 12 సంవత్సరాల జాతీయ పొదుపు సర్టిఫికెట్లు చేరి ఉంటాయి.

లభ్యమయ్యే స్థానాలు : (అ) సేవింగ్స్ బ్యాంకు వ్యవహారాలుచూస్తున్న అన్ని పోస్టాఫీసులు, (ఆ) స్టాండర్డు ఏజన్సీ పద్ధతిక్రింద ఒప్పందంపై సంతకంచేసిన అధికార ఏజంట్లు.

డినామినేషన్లు : రూ. 5, 10, 50, 100, 500, 1,000, 5,000, 25,000 లలో జారీ చేయబడినవి.

వడ్డీ : 12 సంవత్సరాల అనంతరం పరిణతి చెందినాక 6.25 శాతం సాధారణ వడ్డీ, లేక 4.75 శాతం చక్రవడ్డీ.

ఆదాయపుపన్ను విధింపు వగైరా : వడ్డీపై ఆదాయపుపన్ను విధింపబడదు.

తిరిగి చెల్లించే తేదీ : సర్టిఫికెట్ జారీ చేసిన తేదీ లగాయతు 12 సంవత్సరాలు పూర్తి అయిన పిదప, జారీ చేయబడిన తేదీ లగాయతు ఒక సంవత్సరం తర్వాత కూడా తిరిగి చెల్లింపబడుతుంది. ప్రీమియం, నిర్ణీతరేట్లలో, రెండు సంవత్సరాల తర్వాత చెల్లించబడుతుంది.

ఫ్యాక్టరీలలో అదనపు పని

జాతీయ అత్యవసర పరిస్థితి మూలంగా అవసరమైన రక్షణ సామగ్రి లేక అత్యవ

సర సరఫరాలకు సంబంధించిన కర్మాగారాలలో ఉత్పత్తిని పెంపొందించే ఉద్దేశంతో, 1948 వ సంవత్సరపు ఫ్యాక్టరీల చట్టంలోని ఇందుకు సంబంధించిన నిబంధనల వర్తింపును మినహాయించడానికై చేసిన అభ్యర్థనలను మన్నించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిశ్చయించింది. రక్షణావసరాలు లేక అత్యవసర సరఫరాలకు సంబంధించిన సామగ్రిని ఉత్పత్తిచేసే సంస్థల నిర్వాహకులందరూ మినహాయింపుకై తమ విజ్ఞాపనలను హైదరాబాదులోని కార్మిక శాఖ (ఫ్యాక్టరీలు) కమీషనరు ద్వారా ప్రభుత్వాని-హోం శాఖ-కి అందజేయాలి.

ఫ్యాక్టరీ చట్టంనుండి మినహాయింపు

1948 వ సం॥పు ఫ్యాక్టరీల చట్టంలోని 52 వ సెక్షన్ అమలునుండి రాష్ట్రంలోని అన్ని ఫ్యాక్టరీలను, 1962 నవంబరు 1 వ తేదీనుండి మూడు నెలలపాటు దిగువ షరతులకు లోబడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మినహాయించింది.

వేతనాలద్వారా పొందిన మొత్తాన్ని జాతీయ రక్షణ నిధికి మాత్రమే విరాళంగా ఇవ్వడానికి యీ మినహాయింపు వర్తిస్తుంది. ఫ్యాక్టరీలోని పనివారలు అధిక సంఖ్యాకులు గానీ, ఫ్యాక్టరీలోని పనివారల తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న నమోదైన కార్మిక సంఘంగానీ వ్రాతమూలకంగా తమ సమ్మతిని తెల్పిన యీ మినహాయింపు వర్తిస్తుంది.

పింఛనుదార్ల విరాళాలు

పెన్షను బిల్లులలో జాతీయ రక్షణ నిధికి ఇచ్చే విరాళాలను మినహాయించడానికి సంబంధించిన విధానాన్ని రూపొందించారు. కాబట్టి నిర్ణీత కాలంవరకు కానీ లేదా మళ్ళీ తెలియజేసేవరకూ కానీ వరుసగా ప్రతినెలా సమాన మొత్తంగా (పూర్తి రూపాయిలలో) విరాళం ఇవ్వదలిచిన పెన్షనుదార్లు తమ నిర్ణయాన్ని పెన్షను చెల్లింపుల అధికారికి లిఖితపూర్వకంగా తెలియజేయాలి. ఈ విధంగా ఇచ్చే డిక్లరేషనుయొక్క ప్రతిని అకౌంటెంట్ జనరల్‌కు పంపాలి. విరాళాల మొత్తాలను పెన్షను బిల్లులలో మినహాయింపులుగా చూపాలి. డిక్లరేషన్ పత్రం అందిన తరువాత విరాళం మొత్తాలను రాబట్టడానికి పెన్షను చెల్లింపుల అధికారి తగు ఏర్పాట్లు చేస్తారు.

* * * *

1962 నవంబరు 15 వ తేదీన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా రక్షణ సంఘం కార్యవర్గ సమావేశంలో తీర్మానించిన విధంగా ఉద్యోగ సాధక కేంద్రాలలో పేర్ల నమోదు చేయడంలోనూ, ఉద్యోగ నియామకాలలోనూ సైనికుల భార్యలకు, వితంతువులకు ప్రాధాన్యత ఇవ్వాలని హైదరాబాదులోని ఉద్యోగ సాధక శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఉద్యోగ సాధకాధికారులందరికి యీ విషయంలో ఆదేశాలు పంపాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది.

యుద్ధరంగంలో వున్న రక్షణ సిబ్బంది లేక సరిహద్దులలో నియమించబడిన వారు లేదా పోరాటంలో అసువులు కోల్పోయిన వారి పిల్లలకు పాఠశాలలలో ఫీజు మినహాయించడానికికూడా రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వు చేసింది. ఈ ఉత్తర్వు తక్షణమే అమల్లోకి వస్తుంది. స్టయిఫండులు, స్కాలర్‌షిప్పులు మొదలైన వాటి బహూకరణలో ఇలాంటి పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వాలని కూడా ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

మహిళా సంక్షేమశాఖ అధీనంలోనున్న సర్వీసు గృహాలు, స్టేట్ ఆఫ్టర్ కేర్ గృహాలు, వృత్తిపనుల శిక్షణా కేంద్రాలు, బాలల గృహాలు అభ్యర్థి అభ్యర్థినులను చేర్చుకోడానికి సంబంధించిన నియమ నిబంధనలను, రక్షణ ఉద్యోగుల భార్యలు, వితంతువులు పిల్లలవిషయంలో అవసరమైనంత మేరకు వయః పరిమితులతో సహా సడలించడానికి కూడా ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

కంట్రాక్టు కార్మికుల స్థితిగతులు

పనివారల దుస్థితి దృష్ట్యా కంట్రాక్టు కార్మికుల స్థితిగతులను పరిశీలించి, తగు సిఫారసులు చేయడానికై రిటైర్డు జిల్లా, సెషన్సు జడ్జి శ్రీ వి. యన్. దీక్షితులు అధ్యక్షతన 5 గురు సభ్యులు గల కమిటీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది.

వజీర్ సుల్తాన్ పొగాకు కంపెనీ అధ్యక్షులు శ్రీ బి. కె. నెహూర్, హైదరాబాదులోని భారత ఆర్థిక సంస్థ డైరెక్టరు శ్రీ ఎన్.వి. అయ్యర్‌లను యజమానుల తరపున ఇద్దరు ప్రతినిధులుగానూ, శ్రీ జి. సంజీవరెడ్డి, ఎం. ఎల్. ఎ., శ్రీ జె. సత్యనారాయణలు, పనివారల తరపున ఇద్దరు ప్రతినిధులుగాను యీ కమిటీలో సభ్యులుగా ఉంటారు. వజీర్ సుల్తాన్ పొగాకు కంపెనీ పర్సనల్ ఆఫీసర్ శ్రీ ఎ. కె. ముఖర్జీ, శ్రీ బి. కె. నెహూర్‌కు ప్రతిగా ఉంటారు.

ఈ కమిటీ పని ప్రారంభించిన తర్వాత 4 మాసాలలో సిఫార్సులను ప్రభుత్వానికి అందజేస్తుంది. 1948 వ సం. పు ఫ్యాక్టరీల చట్టం వర్తించే పారిశ్రామిక వ్యవస్థలలో పనిచేస్తున్న వారి స్థితిగతులను పరిశీలించి, వారి అభివృద్ధికి తగిన సిఫార్సులను చేయడం యీ కమిటీ కర్తవ్యం. అంతేగాక అవసరమనుకుంటే కంట్రాక్టు పద్ధతిని తీసివేసే విషయంలో కూడా యీ కమిటీ సిఫారసు చేస్తుంది. ★

నాటిక:

మన ఊరిలోంచి మనదేశం

—చక్రవర్తి రంగస్వామి

పాత్రలు:

రామారావు

సీతాలక్ష్మి - (రామారావు భార్య)

హరి — (రామారావు పెద్ద కొడుకు)

రామారావు చిన్న కొడుకులు ఇద్దరు

బ్రహ్మానందం - (రామారావు మిత్రుడు)

[రామారావు యిల్లు. వరండాలో గోడకు ఫోటోలు తగిలించి ఉంటాయి. రామారావు కుర్చీలో కూచుని పత్రిక చదువుకుంటూ ఉంటాడు. సీతాలక్ష్మి పుస్తకంలోకి చూస్తూ ఉంటుంది. హరి తమ తాతగారి ఫోటోను తదేకధ్యానంతో చూస్తూ ఉంటాడు.]

హరి: (తండ్రి వేపు తిరిగి) నాన్నా! 'పూర్వం మనకో ఊరూ, యిల్లూ, భూమీ అంటూ వుండేవి' అని అమ్మ అప్పు డప్పుడూ అంటూ ఉంటుందే, అవి ఏమై పోయాయి? ఎందుకు పోయాయి?

రామారావు: (ఉక్కిరిబిక్కిరై పోయి, పత్రిక పక్కకు వుంచి) ప్రాప్తం తీరి పోయాయి — అంతకంటే చెప్పతగిం దేమీలేదు.

హరి: తాతగారు గొప్పగా బ్రతికారని అందరూ అంటూవుంటారుగదా — మరి ఎందుకిలా అయింది?

రామా: (గౌరవభావంతో) ఆయన గొప్ప గానే బ్రతికారు - కానీ, (బాధగా) నా దగ్గరికి వచ్చేసరికి అంతా తారుమారై పోయింది...

హరి: తారుమారంటే?

రామా: అంటే — నా హయాంలో చాలా బీదతనం ముంచుకొచ్చేసింది...(దీనంగా సంజాయిషీ చెప్పుకుంటున్నట్లు)...... సంపాదించలేని తప్పు నాదే...

సీతాలక్ష్మి: (పుస్తకం మూసి బల్లమీద వుంచి జాలినిండిన కంఠంతో) మీ తప్పని ఎందు కనుకుంటారు?...కాలం కలిసి రావద్దూ ఎవరికైనా?

రామా: కాలం సంగతి ఎవరాలోచిస్తారు?

హరి: 'కాలం కలిసిరావటం' - అంటే?

రామా: ఆకాలంలో ఏ కృషికీ అంతగా అవకాశాలుండేవికావు. మచ్చుకు — మా చిన్నతనంలో చదువుకోటానికే అవకాశా లుండేవి కావు. చాలా గ్రామాల్లో ప్రాథ మిక పాఠశాలలు కూడా ఉండేవి కావు. అప్పుడు హైస్కూలు చదువు కావా లంటే, దూరంగావుండే ఏ బస్తీలోనో కాపురం పెట్టవలసి వచ్చేది. దానికి తగిన ఆర్థిక స్థోమతూ, మనిషి సహాయం ఉండాలి. పైగా ఆరోజుల్లో, ఆచార వ్యవహారాల పట్టింపులూ యిప్పటికంటే బాగా ఎక్కువగా ఉండేవి. ఎక్కడికి కదలటానికీ పెద్దల అనుమతి దొరికేది కాదు. అందువల్ల ఏ కృషికీ అవకాశం లేకుండా ఉండేది.

హరి: ఇప్పుడు ప్రతి జిల్లాకూ ఎన్నో కళాశాలలు, ఎక్కడికక్కడే హైస్కూళ్ళు, ప్రతి ఊళ్ళో ప్రాథమిక పాఠశాలలు, విద్యార్థులకు సహాయం...యిన్ని అవ కాశా లున్నాయే!

రామా: ఇదంతా యీ పది పన్నెండేండ్లుగా వచ్చిన అభివృద్ధి...నీకూ, తమ్ముళ్ళకూ యింతింత చదువులు చెప్పించగలుగు తున్నానంటే...నావల్ల అయ్యేదేనా యీ స్వల్ప సంపాదనలో? - చదువులకు అవకాశాలూ, సహాయాలూ అందు బాటులో ఉన్నాయి కాబట్టేననుకో!

సీతా: (నవ్వుతూ) ఇంతకూ వాడడిగింది, వాళ్ళ తాతగారి గొప్పతనం గురించి. కాస్త చెప్పగూడదూ, పాపం!

హరి: (ఆసక్తితో) ఆయన అంత గొప్పగా బ్రతికినప్పుడు మీకు అంత బీదతనం ఎలా వచ్చిందని?

రామా: ఆయన అంత గొప్పగా కనిపించ టానికి ఆయన వ్యక్తిత్వం కూడా కారణం. అది అలావుంచి, అప్పట్లో మనకు భూము లుండేవి. వాటిమీద కొంత

రాబడి వస్తూఉండేది. యథావిధిగా కుటుంబ మర్యాదలు, ఆచార వ్యవహారాలూ ఏలోటూ లేకుండా సాగిపోతూ ఉండేవి. తాతగారు చాలా ఉదారులు. "లేద"ని ఆయన ఎప్పుడూ ఎవరికీ అన లేదు. చివరివరకూ ఆయన అలాగే గడుపుకున్నారు. భూములున్నాయి గనుక అప్పు లిచ్చేవాళ్ళు. వడ్డీలు పెరిగేవి; చివరకు భూములు కట్టుకునేవాళ్ళు. అలా భూములన్నీ అయిపోతూ, ఆయన పోయేవరకూ, అవీ లేకుండా అయిపోయాయి.

సీతా : (చిరునవ్వుతో కొడుకుతో) ఇప్పుడర్థమయిందా ?

హరి : (నవ్వుతూ) అయిందిలే !...కానీ, నాన్నా ! ఎన్ని భూము లమ్మినా, అన్నీ ఋణాలకే సరిపోయాయా ఏమిటి ? (వ్యంగంగా) ఆ భూము లంత విలువైన వన్న మాట.

రామా : (చాలా ఓర్పుగా) అప్పట్లో భూమి పండేదీ తక్కువే. భూమికి వచ్చే ధరా తక్కువే. మరీ, మెట్ట భూములు ధర పలికేవేకావు. చాలా భూములు సాగుబడికి పనికిరాకుండా ఉండేవి. అందరూ భూమిని అమ్మేవాళ్ళే అయితే భూమికి విలువ ఏం వస్తుంది ?

హరి : భూమిని ఎక్కువమంది ఎందుకమ్మవలసి వచ్చింది ?

రామా : ఎవరికి డబ్బుతో అవసరమొచ్చినా భూమినే అమ్మవలసి వచ్చేది — చదువులకు కానీ, వివాహాలకు కానీ, వ్యాపారానికి కానీ, ధన సంపాదనకు ఇతరత్రా మార్గాలు తక్కువగా ఉండేవి. డబ్బు కావలసి వచ్చినప్పుడల్లా, అప్పయినా దొరికించుకోవాలి, భూమైనా అమ్మాలి. అప్పు తాత్కాలికంగా దొరికినా ఋణపరిష్కారానికైనా చివరకు భూమిని అమ్మవలసే వచ్చేది ... పైగా భూమిని కొనుక్కొనే రైతు మరీ పేదగా ఉండేవాడు. అందువల్ల పోటీ ఉండేదికాదు... పోటీ లేనప్పుడు ధనవంతుడు కొన్నా ఎక్కువ ధర పెట్టేవాడు కాదు.

హరి : మీరు, ఒకటి చేయవలసి ఉండేది. స్వయంగా వ్యవసాయం చేసుకుంటూ ఉన్నట్లయితే భూమి పోకుండా ఉండేది.

రామా : నిజమే ; కానీ, అప్పట్లో విద్యకున్న విలువ శ్రమకు ఉండేదికాదు.

హరి : ఎందువల్ల ?

రామా : అప్పుడు యించుమించు అందరూ నిరక్షరాస్యులే — ఒక్కఊరు వుందంటే, అయిదారుగురుండేవాళ్ళు అక్షరాస్యులు. బాగా చదువుకున్నవాళ్ళు ఎక్కడో కాని కనిపించేవాళ్ళు కారు. అలాంటప్పుడు విద్యకు విలువ యిచ్చినట్లు శ్రమకు ఎవరిస్తారు ? పైగా వ్యవసాయం లాభసాటిగా ఉండేదికూడా కాదు.

హరి : కారణం ?

రామా : రైతు నిరక్షరాస్యుడుగా ఉండేవాడు. వ్యవసాయ విజ్ఞానం 'అందని ఆకాశంలా' ఉండేది. నీటి వసరులు బాగా తక్కువగా ఉండేవి. వర్షాధారంగా పంటలు పండవలసివచ్చేది. ఒక్కొక్క ఏడు వరదలవల్ల కూడా పంటలు నష్టపడేవి. మిగిలిందంతా బీడుపడ్డభూమి. ప్రతి ప్రయత్నానికీ డబ్బు కావాలి. రైతు పేదవాడు. వడ్డీకి తెచ్చుకోవాలి. అధిక వడ్డీకి షావుకారు దగ్గరికి వెళ్లాలి— యిక అదంతా ఒక పెద్ద విషవలయం అనుకో !

హరి : మరి యిప్పుడో ?

రామా : ఇప్పుడలాకాదు — రోజులు బాగా మారాయి. నీటి వసరులు బాగా పెరిగాయి — ప్రాజెక్టులు, డాంలు ఎన్నో వచ్చాయి. కొత్త పనిముట్లు, కొత్త విధానాలు, కృత్రిమ ఎరువులు వ్యవసాయ రంగంలోకి వచ్చాయి. సహకార పద్ధతుల్లో రైతుకు సులభంగా తక్కువ వడ్డీతో అప్పుతో పాటు, కావలసిన వస్తువులన్నీ దొరుకుతున్నాయి. రైతులు అన్ని విషయాల్లో ముందుకు వచ్చారు. విద్య, వ్యవసాయ విజ్ఞానం అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక వ్యవసాయ విధానాల్లో శిక్షణ కూడా దొరుకుతోంది. తద్వారా పంటలు ఎక్కువ పండిస్తున్నారు. ముందు ముందు యింకా ఎక్కువ పంట పండించే అవకాశాలున్నాయి. వాళ్ళకు ఎంతో ప్రోత్సాహకరంగా పరిస్థితులు రూపొందించ బడుతున్నాయి.

హరి : అంటే — యిప్పుడు శ్రమకు చాలా విలువ వచ్చిందన్న మాటేనా ?

రామా : అవును...శ్రమకు విలువ యివ్వటం అనేది యిటీవల ప్రజలలో వచ్చిన గొప్ప 'మంచిమార్పు'. ప్రజల్లో విద్యా, విజ్ఞానం పెరుగుతున్నకొద్దీ శ్రమపట్ల గౌరవభావం కూడా పెరుగుతోంది.

సీతా : (నవ్వుతూ భర్తతో) ఇప్పుడా భూములుండివుంటే వ్యవసాయం చేయాలనిపిస్తోందా ఏమిటి మీకు ?

రామా : (పెద్దగా నవ్వుతూ) నిజం గ్రహించావ్ !

[అందరి ముఖాల్లో నవ్వు నాట్యంచేస్తుంది]

హరి : (నవ్వులు ఆగిపోయాక — ఆలోచనగా) మీరు ఎంతవరకు చదివారేమిటి నాన్నా ?

రామా : (సిగ్గుపడుతూ) ఏదో, చదువనూ వ్రాయనూ తెలుసు అని మాత్రం చెప్పవచ్చు.

హరి : మరి, ఎంతో చదివినట్లు కనపడతారే!

సీతా : (రహస్యాన్ని విడుదల చేస్తున్నట్లు– భర్తపట్ల గౌరవభావం నిండిన కంఠంతో) మీ నాన్నగారు కొన్ని ఏండ్లు ఒక శాస్త్రిగారిని పోషించి, ఆయన దగ్గర చదువుకున్నారు. తరువాత కూడా, చాలా డబ్బు ఖర్చుచేసి ఎన్నో పుస్తకాలు కొని, ఎంతో కృషి చేశారు.

హరి : ఎక్కడ చూచినా గ్రంథాలయాలున్నాయి కదా, కొనటం ఎందుకు?

రామా : ఎక్కడ చూచినా గ్రంథాలయాలు ఈ రోజుల్లో! ఇదంతా యిటీవల దేశంలో సాధించబడ్డ అభివృద్ధి. ఆ రోజుల్లో గ్రంథాలయాలు అరుదుగా కనిపించేవి – ఎక్కడో పట్టణాల్లో – చందాల మీద ఆధారపడి బ్రతుకుతూ.

హరి : అయితే, మీదంతా 'స్వయంకృషి' అన్నమాట!

రామా : (నవ్వుతూ) అవును...అందువల్లే "డిగ్రీలులేని పాండిత్యంబు" అయింది నాదంతా. అందుకనే 'వన్నెకు' రాలేదు.

హరి : (ప్రసంగంమార్చి) సరేకాని, నాన్నా, మన ఊరు ఎలా ఉండేది?

రామా : (శ్రద్ధగా దేన్నో చూస్తున్నట్లు చూస్తూ) చాలా బాగుండేది. ఒకవేపు సౌనల మాగాణి, సరుగుతోటలు, సముద్రం, మరోవేపు జీడిమామిడి తోటలు, తమలపాకు – అరటితోటలు, వాదమాగాణి. వరదలొచ్చి యీ మాగాణి మూడునాలుగేండ్ల కొకసారి మునిగిపోతూ వుండేది. నీరు అందని చాలా భూమి సాగుబడిలో ఉండేదికాదు కూడా– అప్పుడు.

హరి : 'అప్పుడు' అంటున్నారు, ఇప్పుడు మారిందా ఏమిటి పరిస్థితి?

రామా : ఇప్పుడు పెద్దకాల్వ త్రవ్వారని తెలిసింది. దానివల్ల వరదలురావు. కనుక పంటలు నష్టంకావు. పైగా, ఆ కాల్వవల్ల, అంతకు ముందు సాగుబడిలో లేని కొన్ని వేల ఎకరాలు సాగుబడిలోకి వచ్చాయట!

హరి : ఊరు బాగుపడిందన్నమాటే!

రామా : (నమ్మకంగా) చాలా బాగుపడి ఉంటుంది.

హరి : అక్కడివాళ్ళ వృత్తి ఏమిటి?

రామా : నేత, వ్యవసాయం. (నెమ్మదిగా మననం చేస్తున్నట్లు) ప్రతి యింట్లో 'మగ్గం' ఆడుతూనే ఉండేది. ప్రతి యింటి ముందూ 'అల్లు' సరిచే ఉండేది. మగ్గం నేస్తూ లయానందంలో పాట పాడటం వాళ్ళ కలవాటు. ఆ పాటలు వెనుకటి తరంలో 'తత్వాలు'గా ఉండేవి. ఈ తరంలో క్రమంగా సినిమా పాటలవరకూ వచ్చాయి. (స్వరం తీవ్రంచేసి) ఇంట్లో వున్న అయిదారేండ్ల బిడ్డదగ్గరనుంచీ శతవృద్ధు వరకూ శ్రమచేస్తూనే ఉండేవాళ్ళు, అయినా బీదతనం పట్టుకునే ఉండేది.

హరి : (ఆశ్చర్యంతో) శ్రమ చేస్తుంటే బీదతనం ఎలా వస్తుంది?

రామా : (జాలిగా) శ్రమ చేస్తున్నా, బీదతనానికి అనేక కారణాలుంటాయి. అక్కడ అప్పట్లో ప్రతియింటా 'మలేరియా' జ్వరాలుండేవి. అడుగడుగునా జ్వరం తిరగబెడుతూ ఉండేది. ఒక్కోసారి యింట్లో ఎందరున్నారో అందరూ జ్వరంతో పడిపోయేవాళ్లు. వైద్యుల చుట్టూ తిరగటానికే వాళ్ళశక్తి, సమయం అయిపోయేది. వాళ్ళ సంపాదన కాస్తా వైద్యానికీ, పథ్యానికీ సరిపోయేది. మలేరియా దీర్ఘవ్యాధిగా నిలబడిపోయి అది అనేక తగ్గని వ్యాధులకు దారితీసేది. ఎవర్ని చూసినా, పాలిపోయి, దీనంగా బీదవాలకంగా కనపడేవాళ్ళు. (ఆశగా) అయితే, యిది ఒక పుష్కరకాలం కింది మాట. ఇప్పుడు 'మలేరియా నిర్మూలన పథకం' తీవ్రంగా అమలు జరిగింది కనుక చాలావరకు 'మలేరియా' తొలగిపోయి వుంటుంది.

హరి : మన ఊరి ప్రజలు, ఊరూ గురించి?

రామా : ప్రజలు చాలా మర్యాదస్తులు. వాళ్ళల్లో రాజకీయ, సాంఘిక, ఆధ్యాత్మిక చైతన్యం ఎక్కువగా కనిపించేది. ఔదార్యం వాళ్ళ సహజలక్షణం. హింసాతత్వం కనిపించేదికాదు.

మన ఊరు తమలపాకులకు ప్రసిద్ధి. జీడిపప్పు వ్యాపారానికి ప్రసిద్ధి – అమెరికా, ఆఫ్రికాలతో వ్యాపార సంబంధం ఉండేది. నేతకుకూడా ప్రసిద్ధే–బర్మా, సిలోన్ మొదలైన దేశాలకు యిక్కడ తయారైన లుంగీ గుడ్డలు ఎగుమతి అయ్యేవి.

హరి : చూడతగ్గ ప్రకృతి దృశ్యాలు ఏమైనా ఉన్నాయా?

రామా : అక్కడి ప్రకృతి అద్భుతంగా ఉంటుంది. మొగలి – పేము పొదలు, మంచినీటి సౌనలు, యిసుక దిబ్బలు, అరటి – తమలపాకు తోటలు, సరుగు తోటలు, మామిడి – జీడిమామిడి – కొబ్బరి తోటలు, పంటచేలు, సముద్రం– (తన్మయత్వంతో) చూస్తుంటే అద్భుతంగా ఉండేది.

హరి : (ఉత్సాహంతో) అయితే, ఒకసారి వెళ్ళి చూసిరావాలి.

రామా : తప్పకుండా.

సీతా : నాకుకూడా ఒక్కసారి అందర్నీ చూసి రావాలని వుంది. నన్నూ హరితో పంపండి. మనం అంటే అక్కడివాళ్ళకు

ఎంత ఆపేక్ష! తోడబుట్టిన వాళ్ళకంటే ఎంతో ఎక్కువగా చూసుకునేవాళ్ళు!

రామా : (నవ్వుతూ) అయితే, అందరం ఒకసారి వెళ్ళి చూసివస్తే సరి! – నన్ను మాత్రం ఆపేక్షగా చూసేవాళ్ళు లేరా ఏమిటి అక్కడ?

(పోస్టుమేన్ జాబు యిచ్చి వెళ్తాడు)

(సంతోషంతో) బ్రహ్మానందం ఏదో పనిమీద హైదరాబాదుకు వస్తున్నాట్ట! ఈ జాబునుబట్టి యీ రోజే వస్తుండాలి... టైం ఎంతయిందో చూడు హరీ?

హరి : (గడియారం చూసి) రైలు యీ పాటికి వచ్చేసుంటుంది! ఇంకో అయిదారు నిమిషాల్లో ఆయనే యిక్కడికి వచ్చేయొచ్చు.

సీతా : (ఆశ్చర్యంతో) బ్రహ్మానందం అన్నయ్య వస్తున్నాడా? నిజంగానా?

రామా : (నవ్వుతూ) నిజంగానే. ఎగతాళేం కాదు.

సీతా : (ఉత్సాహంగా) అయితే ఉండండి. ఆయన వచ్చేసరికి కాఫీ, ఉప్మా చేస్తాను.

రామా : (తొందరపెడుతూ)అయితే త్వరగా కానీ! వచ్చేస్తుండొచ్చు యీ పాటికి.

సీతా : మరీ అంత త్వరపెడితే ఎలాగండీ! స్టౌ ముట్టించేస్తున్నానుగా! (యింట్లోకి పోబోతూ, వాకిట్లో రిక్షాఆగిన చప్పుడు విని ముందుకు వంగిచూస్తూ) అదుగో! అన్నయ్య వచ్చేశాడప్పుడే!

(బ్రహ్మానందం ప్రవేశిస్తాడు)

(సంతోషంతో) నమస్కారం అన్నయ్యా!

బ్రహ్మ : (చేతులు జోడించి, యిద్దరివేపూ చూస్తూ) నమస్కారం! నమస్కారం!

రామా : నమస్కారం, స్వాగతం!

(చేతులుజాపి ఒకర్నొకరు కౌగలించుకుంటారు)

బ్రహ్మ : (ఆపేక్షగా గబగబా అంటాడు) అబ్బ! ఎన్ని రోజులకు చూడగలిగాను మీ అందర్నీ! ఏమి చెల్లెమ్మా, ఎలా ఉన్నావ్? ఏమోయ్ బాబూ, ఏం చదువుతున్నావ్? తమ్ముళ్ళేరీ? అదేమిటి, అంత దూరంగా నిలబడ్డావ్? ఇలా దగ్గరికి రా! నన్ను ఎవరనుకున్నావేమిటి?

సీతా : (కొడుకుతో) ఊ, దగ్గరికెళ్లూ – మామయ్య పిలుస్తుంటే.

(హరి బ్రహ్మానందం దగ్గర కెళ్తాడు. హరిని దగ్గరికి తీసికొని ప్రేమగా వీపు నిమురుతాడు బ్రహ్మానందం.)

రామా : (బ్రహ్మానందంతో) వీడు – పెద్దవాడు. మెడిసిన్ చదువుతున్నాడు. రెండోవాడు వ్యవసాయం – బి.యస్‌సి. చదువుతున్నాడు – అలా ఎక్కడికో వెళ్ళినట్టున్నాడు.

బ్రహ్మ : (సంతృప్తి కనపరుస్తూ) మూడోవాడూ?

సీతా : (మురిపెంగా) వాడొక్క క్షణం యింట్లో వుండడన్నయ్యా – బోలెడు మంది స్నేహితులు వాడికి.

బ్రహ్మ : ఏం చదువుతున్నాడేమిటి?

రామా : పి. యూ. సీ.

బ్రహ్మ : (ఉత్సాహంగా రామారావుతో) బాగుంది...వాణ్ణి తప్పకుండా యింజనీరింగ్ చదివిస్తావనుకుంటాను ... ముగ్గురికీ మూడు మంచి దార్లు చూపినట్లవుతుంది. వాళ్ళే పైకొస్తారు...(ఒక్క క్షణం ఆగి) నీవు వీళ్ళను ఎలా చదివించగలుగుతున్నావో నాకు ఆశ్చర్యంగా ఉంది! నీ స్థితిగతులు చూస్తే 'రెక్కాడితేగాని డొక్కాడదవ్' అన్నట్లుగా ఉంది.

రామా : అచ్చం నేను సంపాదించే దాంతోనే చదివించాలంటే, నావల్ల ఏమౌతుందోయ్ బావా? – అలా అయితే నేను చదువుకున్నంత చదువే వాళ్ళకూ చెప్పించగలిగే వాణ్ణి (నవ్వుతాడు)... స్కూళ్లూ, కాలేజీలు, అన్నీ అందుబాటులో వుండటం, ప్రభుత్వం చదువులకు అనేక విధాలుగా సహాయంచేస్తూ వుండటంమూలానే వాళ్ళను ఇంత మాత్రం చదివించగలుగుతున్నాననుకో.

బ్రహ్మ :అలాగే అనుకున్నానులే నేనుకూడా.

సీతా : అయితే, అన్నయ్యా! మా వదినా పిల్లలూ బాగున్నారు కదూ! నన్నెప్పుడైనా తలుచుకుంటారా?

బ్రహ్మ : (అబద్ధం చెప్పేటప్పుడు గుక్క తిప్పుకుంటూన్నట్లు) ఎందుకు తల్చుకోరూ? (తడబడి ఒత్తి ఒత్తి పలుకుతూ) ఎప్పుడూ మీ మాటే తల్చుకుంటూ ఉంటారు.

(అందరూ నవ్వుతారు)

(అతనూ నవ్వుతూ) ఎందుకూ నవ్వుతారు? నేను అబద్ధం చెబుతున్నాననేగా?

రామా : (నవ్వుతూ) "బొంకవచ్చు, అఘము పొంద దధిప" (వ్యంగ్యంగా) నీ అల్లుడు కనిపెట్టేశాడు నీ విషయం.

బ్రహ్మ : (నవ్వుతూ) ఏమోయ్, కనిపెట్టేశావ్?

హరి : (సంతోషంగా) కనిపెట్టేదేముందీ, కనపడుతోంటే!

(మళ్ళీ అందరూ నవ్వుతారు)

బ్రహ్మ : (నవ్వు ముఖంతో) కనిపెడితే కనిపెట్టేశాడులే ... కనిపెడితే ఏమనుకుంటాడు? – 'యీ మామయ్య వొట్టి బోళా శంకరుడులే' అనుకుంటాడు–అందులో తప్పేముందీ?... మీరందరూ మా అందరి హృదయాల్లో ఎప్పుడూ ఉంటారు ... ఎలా మరిచిపోవడం? మీరూ అలాగే మరిచిపోలేరని మాకూ తెలుసు ... ఏమమ్మా చెల్లాయ్! అంతే కదూ?

సీతా : అంతేనన్నయ్యా: (లోపలికివెళ్తుంది.)

రామా : 'పిల్లికి ఎలుక సాక్ష్యం'!... అది పోనీగానీ, ఇదిగో! ఏ మోయ్ బావా! ఈ రోజు ఎందుకో నీ అల్లుడు ఉదయం నుంచీ నన్ను "క్రాస్‌పరీక్ష" చేస్తూనే ఉన్నాడు. "మన ఊరును ఎందుకు వదిలి పెట్టావ్? ఎందుకు బాగా చదువుకోలేదు? భూముల్ని ఎందుకు పోగొట్టావ్? వ్యవసాయం ఎందుకని చెయ్యలేదు?"... యిలాగా మొదలుపెట్టాడు.

బ్రహ్మ : (అట్టహాసంగా నవ్వుతూ) ఓ-హో-హో! అలా అయితే నీకు పెద్దచిక్కే వచ్చి ఉంటుందే! జవాబుచెప్పి తీరవలసిన బాధ్యత నీ మీద ఉందికూడా!

రామా : ఉంది — నిజమే. జవాబు చెబుతున్నాను కూడా. ఇంతలో నీవువచ్చావ్: నీవే చెప్పు, యిప్పుడు ఊరు ఎలాఉందో! అప్పుడెలా ఉండేదో! అప్పటికీ, యిప్పటికీ ఏ ఏ మార్పులొచ్చాయో! అప్పుడు మనంఎందుకు చదువుకోలేక పోయామో!

సీతా : (కాఫీ, ఉప్మా తెస్తూ) కొంచెం ఉండండి — చెబుతారుకాని. ఇదిగో అన్నయా! ముందీ ఫలహారం చేసి, కాఫీతాగి — తరువాత మీ యిష్టం వచ్చినంతసేపు మాట్లాడుకోండి. (ఉప్మా అందిస్తుంది.)

బ్రహ్మ : ఎలాగయినా చెల్లెలు చెల్లెలే, బావ బావే. తన ఆకలితప్ప బావకింకేం తెలుస్తుందీ? (స్పూన్‌తో ఫలహారం చేస్తూ వుంటాడు.)

రామా : (నవ్వుతూ) చెల్లెలు కాబట్టి అన్న ఆకలి కనిపెట్టింది..మేం పరాయివాళ్ళం కదా, ఎలా కనిపెట్టగలం?... నేను మాచెల్లెలి యింటికి వెళ్ళినప్పుడు నాఆకలి మా బావకు తెలుస్తుంది కనుకనా?

(అందరూ నవ్వుతారు)

సీతా : (నవ్వు ముఖంతో) ఎవరు ఎవరింటికి పోయినా, అన్నా చెల్లెలూ ఒకటి; తండ్రీ కొడుకులూ ఒకటి — అంతేగా, ఏం అన్నయ్యా?

బ్రహ్మ : (ఫలహారం చెయ్యటం ముగించి ఘాటుగా) అంతే—అంతే చెల్లెమ్మా!

సీతా : ఉప్మా యింకా కొంచెం తెస్తాను.

బ్రహ్మ : వద్దువద్దు. ఇదే ఎక్కువ.

సీతా : (కాఫీయిస్తూ) మీ బావగారి సొమ్ము ఖర్చయిపోతుందని భయపడటం లేదు కదా అన్నయ్యా?

బ్రహ్మ : భయమెందుకూ? — బావసొమ్ము యింకా ఖర్చు పెట్టాలని వుంటుంది కానీ!

రామా : (సకిలిస్తున్నట్లు అభినయిస్తూ) అహ! ఈ ఖర్చులకు భయపడే రకం కాదు మనం. అలాంటి భయాలు మీకూ!

బ్రహ్మ : ఏదీ, అమ్మాయినీ పిల్లల్నీ పంపు—మళ్ళీ నువ్వు బ్రతిమలాడేదాకా పంపుతానేమో చూడు నా 'దెబ్బ'.

రామా : (చిరునవ్వుతో) పంపుతాను, పంపుతాను — అలా చూస్తూవుండు. పిల్లలు ఊరు చూడాలంటున్నారు; మీ చెల్లెలూ అందర్నీ చూడాలంటోంది: (బెదిరిస్తూనట్లు) నీ 'పులుసు' వంచుతానుచూడు... అదుగో, నీ చిన్నల్లుళ్ళిద్దరూ వస్తున్నారు.

(ఇద్దరూ వస్తారు)

(వాళ్ళతో) మీ మామయ్య వచ్చాడు చూశారా? మన ఊరు చూడాలని ఉబలాటపడుతున్నారుగా! (కన్నుగిలుకుతూ) మిమ్మల్ని పిల్చుకెళ్ళడానికే వచ్చాడు. ప్రయాణానికి సిద్ధం కండి — యిప్పుడు సెలవులేగా.

ఇద్దరు : (ఎగిరిగంతేసినంత సంతోషంతో హుషారుగా) ఓ, 'రెడీ'!

బ్రహ్మ : (తీవ్రంగా చూస్తూ) మాట తప్పకూడదు...ఎల్లుండి సాయంత్రం బండికి ప్రయాణం. అమ్మాయ్ చెల్లెమ్మా! సిద్ధంకా.

సీతా : (సంతోషంగా) ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాను.

బ్రహ్మ : (ఠీవిగా) ఏయ్, అల్లుళ్లూ! 'రెడీ' అన్నారుగా ... మరి సిద్ధం కండి!... ఏమోయ్ బావా?...ఎల్లుండి సాయంత్రం బండికి ప్రయాణం...నీవు కూడా!... 'నాకు చెప్పలేదే' అతుకునే మాత్రపు వాడివి!

రామా : (గాభరాగా) ఇదేమిటి — యింత హఠాత్‌గా?...నే నేదో నవ్వులాటగా అంటే...

బ్రహ్మ : నవ్వులాటా లేదు — గివ్వులాటా లేదు. మనతోటి వ్యవహారం అంతే — ఎల్లుండంటే ఎల్లుండే.

రామా : కొంచెం గుట్టాన్ని కట్టెయ్యవయ్యా బావయ్యా! కొంచెం వీలుచూసుకోనీ... అసలు—యిప్పుడేం తొందర?...వస్తాంలే...నెమ్మది మీద.

బ్రహ్మ : (మొండిగా) అలా వీలులేదు. అందరూ, నీతోసహా ఎల్లుండి బయలుదేరి తీరవలసిందే — మా మీద ప్రేమేవుంటే.

రామా : (ఆలోచనగా) అయితే పెద్దచిక్కే తెచ్చిపెట్టావే!

బ్రహ్మ : (వెక్కిరిస్తూ) మన 'దెబ్బ' మరేమనుకున్నావ్?

రామా : (సమయస్ఫూర్తిగా) అదికాదోయ్ బావా, మన ఊరు 'మలేరియా ప్రాంతం' కదా; వానలు కూడా పడుతున్నాయి; దోమలు ఎక్కువై ఉండవచ్చు—వీళ్ళల్లో ఎవరికైనా మలేరియా పట్టుకుంటే, వాళ్లూ బాధపడాలి, నీవూ ఆందోళన పడాలి. ఎందుకొచ్చింది, చెప్పూ? వచ్చే ఎండాకాలం సెలవుల్లో పంపుతాను.

బ్రహ్మ : (గర్వంగా) నువ్వు వదిలిపెట్టి వచ్చినప్పటిలా ఉందనుకున్నా వేమిటి, యిప్పుడు ఊరు ?...(నిజంగాచెబుతూ) పూర్తిగా మారిపోయింది. నువ్వుచూస్తే ఆశ్చర్యపోతావనుకో ! నాలుగైదేండ్లుగా 'మలేరియా' అనేది లేదనుకో. 'మలేరియా నిర్మూలన పథకం' మన ప్రాంతంలో అద్భుతంగా అమలు జరిగి మంచి ఫలితాన్ని యిచ్చింది. డి.డి.టీ. చల్లటం, మందులు పంచటం మొదలైన పనులు క్రమబద్ధంగా, చాలా కాలంగా జరుగుతున్నాయి. ఇప్పుడు మలేరియా కానీ, మలేరియావల్ల వచ్చే యితర జబ్బులు కానీ ఏమీ లేవు. ఆ భయం ఏమీ అక్కరలేదు.

రామా : నమ్మలేనంత ఆశ్చర్యంగా ఉందే, నీవు చెప్పటం ?

బ్రహ్మ : అలానే వుంటుంది మరి !...వచ్చి చూస్తే నీకే తెలుస్తుంది !...మన ఊరికి విద్యుచ్ఛక్తి వచ్చింది; హైస్కూలు, ఆరోగ్యకేంద్రం, స్త్రీ సంక్షేమ కేంద్రం వచ్చాయి. పది మైళ్ళ లోపునే కళాశాల; అంతకంటే ఆశ్చర్యాన్ని కలిగించేది చెప్పనా ?...మనం సముద్రం దగ్గరికి వెళ్ళాలంటే మన చిన్నతనంలో ఎంత యిబ్బంది పడేవాళ్ళమో జ్ఞాపకం ఉందా ?

రామా : అవును, ఇసకలో కాళ్ళు దిగబడిపోయి, నడవడం చాలా కష్టమనిపించేది —ఇప్పుడో !

బ్రహ్మ : రోడ్డు !...ఆ రెండు మైళ్ళూ, గ్రామస్థులం, మేమే, 'శ్రమదానం'తో రోడ్డు వేసుకున్నాం...ఇప్పుడు రోజూ సాయంత్రం అలా సముద్రంవేపు వెళ్లనివారు అరుదనుకో !

రామా : (ఆశ్చర్యంగా) అహా ! అలాగేం?

సీతా : అదంతా బాగుంది కానీ, అయితే యింతకూ స్త్రీలల్లో కూడా ఏమైనా మార్పు వచ్చిందా ? లేదా ?

బ్రహ్మ : ఆడపిల్లలు ఎంతమంది చదువుకుంటున్నారో చూస్తే నీవే ఆశ్చర్యపడతావు. స్త్రీలకు కుట్టు పనులు, అల్లిక, పయోజనవిద్య—అన్నీ నేర్పుతున్నారు. ప్రజలలో మునుపటంత బీదతనం, నిరుద్యోగం, అజ్ఞానం యిప్పుడు లేవు. చాలా వరకు తగ్గిపోతాయి.

రామా : ఈ పన్నెండేండ్లలో చాలా అభివృద్ధి సాధించబడిందన్న మాటే !

బ్రహ్మ : 'అన్నమాటే' ఏమిటి ? సాధించబడింది. ఒక్క రంగంలోనే కాకుండా, అన్ని రంగాల్లోనూ సాధించబడింది. మనకు అతి సమీపంలోనే 'నూలుమిల్లు' ప్రారంభం కాబోతోంది. మన ఊళ్లో ప్రతి యింట్లో మరమగ్గాలున్నాయి యిప్పుడు. మన జిల్లా లోకల్లా మన ఊరే ఉత్తమ గ్రామంగా నిర్ణయించబడిందంటే, యిక ఊహించుకో ఎంత అభివృద్ధి పొందిందీ !

అందుకే, వచ్చి, ఒకవారం రోజు లుండు, నీ చిన్ననాటి స్నేహితులనూ, నువ్వు ఆడుకొని పెరిగిన చోటునూ చూద్దువుగాని రమ్మని ఆహ్వానిస్తున్నాను. ఊళ్ళో అందరూ నిన్ను కలవరిస్తూ ఉన్నారు. మా అందరికీ ఎంతో సంతోషంగా ఉంటుంది, మీరంతా ఒక్కసారి వస్తే.

రామా : (మెత్తబడినట్లు, భార్యవేపూ, పిల్లలవేపూ చూస్తూ) అయితే ఒక్కసారి వెళ్ళి చూసివద్దాం ఏమిటి ?

అందరూ : (సంతోషంతో) చూసొద్దాం.

రామా : (ఓటమిని అంగీకరిస్తూన్నట్లు) ఇంకేం, బావా ? నీ మాట ప్రకారం ప్రయాణానికి అందరం సిద్ధం.

బ్రహ్మ : (గర్వంగా) చాలా సంతోషం.

రామా : (ఆలోచిస్తూ) 'మనఊరు'ను మళ్ళీ ఒక్కసారి చూసే భాగ్యం కలుగుతోంది. నీ బలవంతంవల్ల.

బ్రహ్మ : 'ఒక్కసారి చూసేభాగ్యం' ఏమిటి బావా ? మళ్లీ ఏనాటికైనా, నీవు మన ఊరికి — మా అందరి మధ్యకు రావలసిందే...ఆ భారం నాకు వదిలెయ్... అదంతా నేను చూసుకుంటాను (మాటల్లో ఆత్మవిశ్వాసం తొంగిచూస్తూఉంటుంది.) —ఏం చెల్లెమ్మా ?

సీతా : అవునన్నయ్యా. ఈ పిల్లల చదువైపోయాక, యీ 'సిటీ' లో మేం ఉండి ఏంచెయ్యగలం ? పిల్లలు ఉద్యోగరీత్యా ఎక్కడ ఉండవలసివస్తే అక్కడ వుంటారు ! మేమిద్దరం మళ్లీ మీ మధ్యకే వస్తాం...ఆ ఏర్పాటేదో నువ్వే చేసెయ్ అన్నయ్యా !...నువ్వు తలచుకుంటే ఎంతపనైనా అయి తీరుతుంది.

బ్రహ్మ : (ధీమాగా) ఆ విషయం యిక నాకు వదిలెయ్యండి అన్నానుగా.

(అందరూ సంతృప్తిగా అతని వేపు చూస్తారు)

ఇక నేను అలా వెళ్ళి నా పని చూసుకొని వస్తాను.

సీతా : త్వరగా రండి. వంట పెందలాడే అవుతుంది.

రామా : అదిగో మళ్లీ ! 'అన్నయ్య ఆకలి' కనిపెట్టింది చెల్లెలు.

(అందరు నవ్వుతారు)

బ్రహ్మ : అలాగేనమ్మా, పొద్దు పోకమునుపే వస్తాను, (అంటూ వెళ్తాడు)

[అందరూ ఉత్సాహంగా కనిపించి లోపలికి వెళ్తారు.]

“ఆంధ్రప్రదేశ్”

తెలుగు, ఉర్దు, హిందీ, ఇంగ్లీషు మాస పత్రిక ప్రకటన రేట్లు

దిగువ రేట్ల ననుసరించి ‘ఆంధ్ర ప్రదేశ్’ మాస పత్రికలో ప్రకటనలు స్వీకరించబడగలవు.

వివరాలు	నాలుగు సంచికలలో			ఒక సంచికలో మాత్రమే		
	పూర్తి పేజీ	సగం పేజీ	పావు పేజీ	పూర్తి పేజీ	సగం పేజీ	పావు పేజీ
	రూ.	రూ.	రూ.	రూ.	రూ.	రూ.
లోపలి పేజీ	300	150	100	100	55	30
వెనుక అట్ట పేజీ (4)	400	—	—	150	—	—
అట్ట 2, 3 పేజీలు	350	—	—	125	—	—

ఒక సంవత్సరం కంట్రాక్టు ప్రకటనలకు 20 శాతం రిబేటు ఇవ్వబడును.

నిబంధనలు

1. మెకానికల్ వివరాలు $10\frac{3}{4}'' \times 8\frac{1}{2}''$ డెమ్మీ.
2. ముందు అట్ట టైటిల్ పేజీపై ప్రకటనలు స్వీకరించబడవు.
3. పావు పేజీకి తక్కువగా ఉన్న ప్రకటనలు స్వీకరించబడవు.
4. వచ్చే సంచికలో ప్రచురించడానికి వీలుగా స్థలం వివరాలు, డబ్బుతోసహా ప్రకటన సమాచారాన్ని ప్రతినెల 8వ తేదీలోపుగా యీ కార్యాలయానికి పంపాలి. క్రాస్ చేయని డిమాండ్ డ్రాఫ్ట్‌ద్వారా గానీ, మనియార్డరు ద్వారా గానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, ప్రజా సంబంధముల శాఖ డైరెక్టరు, హైద్రాబాదు పేర డబ్బును పంపాలి.
5. బ్లాకుల విషయంలో అన్నివిధాలా శ్రద్ధ తీసుకోబడుతుంది. అయితే మిషనుపై బ్లాకులు పగిలిన యెడల యీ శాఖ బాధ్యత వహించదు.
6. ప్రకటన విధం, స్థలం వివరాలను ఒక సంచికలో ప్రకటించాలో (భాషను తెల్పాలి) లేక 4 సంచికలలో ప్రకటించాలో స్పష్టంగా పేర్కొనాలి.
7. డబ్బు చెల్లింపు, యితర ప్రత్యుత్తరాలను దిగువ వారితో జరుపాలి :—

డైరెక్టర్,

సమాచార ప్రజా సంబంధాల శాఖ,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,

హైదరాబాద్-1.

విద్యారంగం

పటన్‌చెరువులోవున్న శిశు సంక్షేమ పైలట్ ప్రాజెక్టును అక్కడి శిశు సంక్షేమ కార్యకలాపాలను సమీకృతం చేసేందుకై డెమాన్‌స్ట్రేషన్ ప్రాజెక్టుగా మార్చడానికి ప్రభుత్వం ఆమోదించింది. పటన్‌చెరువు బ్లాకు క్రిందవున్న 30 గ్రామాలన్నింటికీ 1962–63వ సంవత్సరంలో రూ. 74,627/–ల ఖర్చుతో డెమాన్‌స్ట్రేషన్ ప్రాజెక్టును విస్తరింప జేయాలనికూడా ప్రభుత్వం ఆదేశించింది.

హైద్రాబాదు ఉస్మానియా వైద్యకళాశాలలో సోషియల్, ప్రివెంటివ్ మెడిసిన్‌లో ప్రొఫెసరుగావున్న డా॥ వి. ప్రహ్లాద్ పటన్‌చెరువులో నూతనంగా ఏర్పడిన డెమాన్‌స్ట్రేషన్ ప్రాజెక్టుకు ఆఫీసర్-ఇన్-చార్జిగా వ్యవహరిస్తారు. ఈయన ఇదివరకటి నుంచే, శిశు సంక్షేమ పైలట్ ప్రాజెక్టు బాధ్యతల నన్నింటినీ నిర్వహిస్తున్నారు.

హైద్రాబాదు ఉస్మానియా వైద్య కళాశాలలో మెడికో–సోషియల్ వర్కర్‌గా వున్న శ్రీమతి పి. మల్హోత్రా పటన్ చెరువు డెమాన్‌స్ట్రేషన్ ప్రాజెక్టుకు చీఫ్ ఆర్గనైజరుగా నియమింపబడ్డారు. ఈమె హేగ్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ స్టడీస్‌లో శిక్షణ పొందడానికి హాలెండుకు పంపబడ్డారు. అక్కడ శిక్షణ ముగించుకొని తిరిగి వచ్చారు.

యుద్ధం చేస్తున్న రక్షణ దళాలలోచేరిన సైనికులు, సరిహద్దులలో పోరాడుతున్న సైనికుల పిల్లలు, ప్రస్తుత అత్యయిక పరిస్థితిలో రణరంగంలో మరణించిన లేక వికలాంగులైన వారి పిల్లలు, రాష్ట్రంలోని ఏ విద్యా సంస్థలో ఐనా చదువుకొంటున్నట్లయితే వారి నందరినీ ఫీజు చెల్లింపు నుంచి మినహాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతిభ – పేదరికం విషయాల దృష్ట్యా అర్హులైనట్లయితే, వారికి స్టైఫెండ్లు, బర్సరీలు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడంలో ప్రాధాన్యత ఇవ్వాలనికూడా ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. సైన్యంలో కంబాటెంట్ జ్యూనియర్ కమీషన్ ఆఫీసర్లు, ఇతర హోదాలు గలవారూ, విమాన, నౌకా దళాలలో వాటికి సమానమైన హోదాకల వారందరూ సైనికులుగా భావించ బడుతారు.

విద్యాశాఖ డైరెక్టరు, ప్రాంతీయ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారులు, స్థానిక సైనికాధికారులు అలాంటి విద్యార్థుల జాబితాలను సేకరించి వాటిని వివిధ స్కూళ్ళకు పంపుతారు. జిల్లా విద్యాశాఖాధికారులనుంచి కానీ లేక నేరుగా సైనికాధికారులనుంచి గానీ విద్యార్థులపేర్లు అందినట్లయితే, అన్నివర్గాల స్కూళ్ళ హెడ్మాస్టర్లు అంటే, ప్రభుత్వం, జిల్లా పరిషత్తు, పంచాయితీ సమితులు, ఎయిడెడ్, తదితరస్కూళ్ళ హెడ్మాస్టర్లు, విద్యార్థులకు పైరాయితీలను ఇస్తారు. పైన తెలిపిన ఏదైనా ఒక వర్గంలో చేరినట్లు సంతృప్తికరమైన సాక్ష్యాధారాలు అందచేసే విద్యార్థులకుకూడా ఈ సౌకర్యాలు లభిస్తాయి.

గమనిక

గత నెల ప్రకటితమైన "బ్రహ్మర్షి శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు" వ్యాసం మిగిలిన భాగాన్ని అత్యావసర పరిస్థితి కారణంగా యేర్పడిన స్థలాభావంచేత ప్రకటించడం లేదు.

సవరణ

గత నెల ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ గోపీచంద్‌గారిని గురించిన రచన 22వ పుట తొలి కాలంలో "ఆఫీసు (6 పంక్తి) మాట్లాడే (11 పంక్తి) ఆఫీసులో (14 పంక్తి)" అన్న వాటిని క్రమంగా – "ఉన్నచోటు–మాట్లాడలేని–ఆఫీసులోవలె"–అని చదువుకోవాలి. విషయసూచికలో "జయం! జయం!" మానాప్రగడ శేషశాయిగారి రచనగా గుర్తించవలెను.

రాజీ బేరం

ఆరిపిరాల విశ్వం

హద్దు మీరిన అహంకారం
దేశాల హద్దుల్ని చెరిపేసింది.
విశ్రమించని దుర్నీతి
తీరని రాజ్యదాహంగా మారి
చైనాసుర వాహినియై
హిమ శిఖరాల్ని ఒరసికొని
ఆర్య భూమిని ముంచెత్తింది.
ప్రకటించక చేస్తున్న యుద్ధానికి
ప్రకటించిన యుద్ధవిరమణకీ
అంతరార్థం ఒకటే.
గూడు కట్టిన దుర్మదం.
సంయుక్త సంప్రదింపులలో
వాళ్ళకి నమ్మకం లేదు !
గెలుస్తున్న వాడి మాటే
చెల్లాలన్న రాజనీతి తప్పు.
సంప్రదించక చేసిన యుద్ధ విరమణ
మళ్ళీ అలాగే భగ్నం కాదని
విశ్వాసం ఏమిటి ?

ఓ చైనాసురుడా !
మా గడ్డనుంచి తొలగి పో !
స్వాతంత్ర్యమంటే దుస్తంత్రం కాదని
తెలుసుకో !

స్వాతంత్ర్య దేశానికి
దురాక్రమణ సమాధిని
కట్టే ప్రయత్నం మానుకో.
ఎవరికోసమో త్రవ్విన గోతిలో
చివరికి నీవే పడిపోగలవు !
ప్రపంచ చరిత్రలో
నీ జాతి ముఖానికి
ద్రోహం, కుహకం రంగరించి
మసిగా పూసుకోకు.
మానవత్వం నిన్ను హెచ్చరిస్తోంది !
బుద్ధి కలిగి మసలుకో.
అకారణంగా చివ్వకు
కాలు దువ్వినవాడు
అణగారక మానడని

హిట్లరు ముసోలినీలవలె
నిరూపిద్దామని పూనుకొంటే
నీవు నమ్మిన సిద్ధాంతాల కట్టెలతో
నీకునీవే చితిరగుల్చుకోవాల్సివస్తుంది.
విలువల కిరణాలతో వెలిగే
మానవత్వపు సూర్యుణ్ణి
కబళించే ప్రయత్నంలో
నీ కొంపకు నీవే అగ్గి ముట్టించుకోకు.
నీ రాజీ ప్రయత్నాలు
మా హృదయాల్లో రాజుకొన్న
మంటలపై గుగ్గిలం చల్లినట్లు.
నీ నక్కజిత్తులకు మళ్ళీ మళ్ళీ
మోసపోతామని భావించకు.
భవిష్యత్తులో
నీ పాపం పండే
రోజొకటి వస్తుంది.
ధరిత్రిలో నిజం జయిస్తుంది !


నిక్షిప్తమైన సంపద

స్వాతంత్ర్యం మన పెన్నిధి. జాతీయ స్వాతంత్ర్య పరిరక్షణకై ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలో అనాది నుంచి వుంటున్న సంపదను, నాణెములు, శిల్పాలు, చిత్తరువులవంటి అపూర్వ కళాఖండాలను సమర్పిస్తున్నారు.

మరి మీ సంగతేమిటి ?

విదేశాలలో మంచి ధర రాగల అటువంటి కళాఖండాలు అమ్మకానికి పంపబడి జాతీయ రక్షణనిధి క్రింద జమకట్ట బడతాయి. జాతీయ శ్రేయస్సు దృష్ట్యా ఇటువంటి కళాఖండాలను ప్రభుత్వానికి సమర్పిస్తే వాటిని విక్రయించి ఆ మొత్తాన్ని రక్షణనిధిక్రింద జమకడతారు.

నేడే మీ రీ పని చేయండి !



ప్రగతి పథంలో

(జిల్లాలనుంచి అందిన అభివృద్ధి కార్యక్రమాలను గురించిన సంక్షిప్త వార్తలు)

ఆదిలాబాదు జిల్లా

రైఫిల్ క్లబ్బులు :

ఆదిలాబాదు, నిర్మల్, ఆసిఫాబాదులలో రైఫిల్ క్లబ్బులను ఏర్పాటుచేయాలని, డిశంబరు 1 వ తేదీన జరిగిన ఆదిలాబాదు జిల్లా పౌరరక్షణకమిటీ ప్రథమ సమావేశంలో నిర్ణయించడం జరిగింది. జిల్లా కలెక్టరు యీ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఆదిలాబాదులో బ్లడ్ బ్యాంకును ప్రారంభించాలని కూడా నిర్ణయించారు. ప్రచార కార్యక్రమం, నిధిసేకరణ, ఉత్పత్తి, రక్షణ సిబ్బంది సంక్షేమం, రైఫిల్, ప్రథమచికిత్సా శిక్షణలపై ప్రత్యేక శ్రద్ధవహించడానికి వీలుగా 5 ఉపసంఘాలను ఏర్పాటుచేశారు.

కృష్ణా జిల్లా

పాలిటెక్నిక్ భవనాలు :

విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ భవనములోని లెబొరేటరీ, వర్క్‌షాపుల క్రొత్తభవనానికి నవంబరు 10 వ తేదీన ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయరక్షణ నిధికి విరాళంగా ఇచ్చిన రు 2,679/లు మొత్తాన్ని సాంకేతికశాఖ డైరెక్టరు, ముఖ్యమంత్రికి సమర్పించారు.

ఖమ్మం జిల్లా

పర్యటనలు :

ఖమ్మం జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ జె. వెంగళరావు, కార్యదర్శి శ్రీ జి. రంగారెడ్డి నవంబరు 27 వ తేదీనుండి వైరా, కల్లూరు, పెనుబల్లి, గంగారం, అశ్వారావుపేట, సత్తుపల్లి, బంజారు, తల్లాడ, ఏన్కూరు, జూలూరుపాడు గ్రామాలలో పర్యటించి జాతీయరక్షణ నిధికి విరాళాలు సేకరించారు.

యువకుల ఉత్సాహం :

వారు పర్యటించిన గ్రామాలలో యువకులు చాలా ఉత్సాహం చూపారు. సత్తుపల్లి గ్రామంలో బాలబాలికలు తాము కూడబెట్టుకున్న చిన్న మొత్తాలను విరాళంగా ఇవ్వడానికి ఒకరితో ఒకరు పోటీపడ్డారు. పాఠశాల విద్యార్థి చి॥ నరసింహారావు, 500 నయాపైసలు ఉన్న పాకెటును సమర్పించాడు. రోజూ 10 న. పైసలచొప్పున యీ మొత్తాన్ని అయన పొదుపు చేశాడు.

మహిళామండలి ప్రారంభం :

ఆదోనిబ్లాకులో నవంబరు నెలలో ఒక మహిళామండలిని ప్రారంభించారు. ఇందులో 10 మంది సభ్యురాండ్రు ఉన్నారు. హరిపురం గ్రామంలో గ్రామసహాయకుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. 50 మందికి శిక్షణ ఇవ్వడంజరిగింది. ఒక పఠనాలయాన్ని, రిక్రియేషన్ కేంద్రాన్నికూడా ప్రారంభించారు.

గుంటూరు జిల్లా

శిక్షణా శిబిరం :

రాజుపాలెం పంచాయితీ సమితి, చామర్రు గ్రామంలో నవంబరు 26 వ తేదీనుండి మూడు రోజులపాటు గ్రామ సహాయకుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. 50 మంది గ్రామ సహాయకులకు యీ శిబిరంలో శిక్షణ యివ్వడం జరిగింది.

ప్రత్యేక కృషి :

ముప్పాళ్ల పంచాయతీ సమితిలో నవంబరు 6 వ తేదీనుండి 20 నవంబరు వరకు ప్రత్యేక కృషిద్వారా జాతీయ రక్షణ నిధికి రు. 22,800/లు విరాళంగా సేకరించడం జరిగింది. సమితిసిబ్బంది, సభ్యులు రు. 543/- లను విరాళంగా ఇచ్చారు.

చిత్తూరు జిల్లా

శ్రమదానం:

పంచాయతీరాజ్య తృతీయ వార్షికోత్సవం సందర్భంగా మదనపల్లి పంచాయతీ సమితిలోని 23 పంచాయతీలలో శ్రమదానం పనులు చేపట్టడం జరిగింది. అంకిసెట్టిపల్లి, రెడ్డివారిపల్లి, రాచవేటివారిపల్లి, నిమ్మనపల్లి, బాసినకొండ, వలసపల్లి గ్రామాలలోని నీటి పారుదలకాలువల మరమ్మత్తు పనులను చేపట్టడం జరిగింది.

చిన్నతిప్ప సముద్రంలోని ఎలిమెంటరీ పాఠశాలలో శ్రమదానంద్వారా ఒక కమ్యూనిటీ పార్కును నిర్మించారు.

నల్లగొండ జిల్లా

పూలహారం వేలం:

నవంబరులో జరిగిన గ్రామ సహాయకుల శిక్షణశిబిరం సందర్భంగా చవుటుప్పల్ పంచాయతీ సమితిలోని పెద్దకొండూరులో సమితి అధ్యక్షుడు శ్రీ జి. అనంతరెడ్డికి వేసిన పూలహారాన్ని వేలంవేసి తద్వారా వచ్చిన మొత్తాన్ని జాతీయరక్షణ నిధికి సమర్పించారు.

శ్రీ కొడేపి రాములు వేలంలో యీ హారాన్ని రు. 75 లకు తీసుకున్నారు.

పూర్వవిస్తరణ బ్లాకు:

ప్రణాళికశాఖ మంత్రి, డిసెంబరు 2 వ తేదీన తురకపల్లి పూర్వ విస్తరణ బ్లాకుకు ప్రారంభోత్సవం చేశారు. యీ సందర్భంగా రు. 1,300/- లను, 13 బంగారు ఉంగరాలను జాతీయ రక్షణనిధికి విరాళంగా మంత్రికి సమర్పించారు.

కార్మికుల ముందడుగు:

ఒక కార్మికుడు తన ఒకరోజు ఆదాయం రు. 1 ని జాతీయరక్షణనిధికి విరాళంగా ఇచ్చాడు. యిది చిన్న మొత్తమేఅయినా ఆయన ఉత్సాహానికి నిదర్శనం.

మహిళా ఆదర్శం:

నవంబరు 30 వ తేదీన నల్లగొండలో జరిగిన బహిరంగ సమావేశంలో నాయకుల విజ్ఞప్తిని పురస్కరించుకొని శ్రీమతి సి. హెచ్. వరలక్ష్మమ్మ తనపైవున్న 70 గ్రాముల బంగారాన్ని అంతటినీ జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చారు.

నిజామాబాదు జిల్లా

విద్యుచ్ఛక్తి సరఫరా:

ప్రణాళికా శాఖామంత్రి, నవంబరు 26 వ తేదీన దోమకొండ పూర్వవిస్తరణ బ్లాకుకు ప్రారంభోత్సవం చేశారు. దోమకొండలో విద్యుచ్ఛక్తి సరఫరాకు మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

నెల్లూరు జిల్లా

నెల్లూరులో విరాళాలు:

నెల్లూరులో నవంబరు 21 వ తేదీన జరిగిన బహిరంగ సమావేశాన్ని ఉద్దేశించి, విద్యుచ్ఛక్తి, నీటిపారుదల మంత్రి ప్రసంగిస్తూ, చైనీయుల దురాక్రమణ, ప్రజల విద్యుక్తధర్మంగురించి ప్రసంగించారు, జిల్లా కలెక్టరు యీ సమావేశానికి అధ్యక్షత వహించారు. మొత్తం రు. 1,20,000 ల రొక్కాన్ని, 1,500 గ్రాముల బంగారాన్ని సేకరించడం జరిగింది.

పశ్చిమ గోదావరి జిల్లా

పాఠశాలకు భవనం విరాళం:

పెంటపాడు పంచాయతీ సమితిలోని కొరుమిల్లి గ్రామ మునసబు శ్రీ సి. ధర్మరాజు, నవంబరు 16 వ తేదీన, రు 10,000 లు విలువచేసే 15 సెంట్ల భూమితోసహా పాఠశాలకు భవనాన్ని విరాళంగా సమితికి ఇచ్చారు.

భూమి విరాళం:

కొవ్వూరు పంచాయతీ సమితిబ్లాకులోని దొమ్మేరు సరిహద్దు గ్రామమయిన గోవర్ధనగిరి మెట్ట గ్రామస్థులు బాలల దినోత్సవం సందర్భంగా నవంబరు 14 వ తేదీన రు. 2,500 లు విలువచేసే 0.62 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. యీ విషయాన్ని కలెక్టరుకు తెలియజేయడం జరిగింది.

ఉపసంఘం నిర్మాణం:

పశ్చిమగోదావరి జిల్లా పౌరరక్షణ కమిటీ, నవంబరు 27 వ తేదీన కలెక్టొరేటులో సమావేశమయ్యి దిగువ ఉపసంఘాలను ఏర్పాటుచేసింది. (అ) ప్రచారకార్యక్రమం ఉపసంఘం, (ఆ) రక్షణనిధి ఉపసంఘం, (ఇ) ధరలు, ఉత్పత్తుల ఉపసంఘం, (ఈ) సంక్షేమం ఉపసంఘం.

మెదకు జిల్లా

మధ్యాహ్న భోజన పథకం:

ఆందోల్ తాలూకా లక్ష్మీనగరంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కేర్‌సంస్థ సహాయంతో అమలు జరిపే మధ్యాహ్న భోజన పథకానికి నవంబరు 7 వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. యీ పథకం అమలువల్ల 50 మంది విద్యార్థులకు లాభిస్తున్నది.

మెదకులో విరాళాలు:

1962 డిసెంబరు 15 వ తేదీ వరకు మెదకు జిల్లాలో రు. 1,01,852-87 లు, 99 గ్రాముల బంగారం, జాతీయ రక్షణనిధికి విరాళంగా సేకరించడం జరిగింది.

వరంగల్లు జిల్లా

విరాళాల సేకరణ :

ములుగు పౌర రక్షణ కమిటీ, రు. 12,000/-లకు పైగా జాతీయ రక్షణనిధికి విరాళాలుగా సేకరించింది. అన్ని సమితులు, జిల్లా పరిషత్తు సభ్యులు, సిబ్బంది, సంతత ధారగా నిధికి విరాళాలు ఇస్తున్నారు.

హైదరాబాదు జిల్లా

హరిజనుల ఉదారత :

ఇబ్రహీంపట్నం సమితి అధ్యక్షులు శ్రీ అనంతరెడ్డి, బచ్చుపల్లిలో నవంబరు 25వ తేదీన చేసిన విజ్ఞప్తి ఫలితంగా అక్కడి కక్కడ రు. 400 లను విరాళంగా సేకరించడం జరిగింది. హరిజనులందరూ తలకొక రూపాయి చొప్పున మొత్తం రు. 150 లను విరాళంగా ఇచ్చారు.

బచ్చుపల్లిలోని అంధుడు తన మొత్తం ఆదాయం రు. 15/- లను విరాళంగా ఇచ్చి ఇతరులకు ఆదర్శ ప్రాయుడయినాడు.

గ్రామస్థుల విరాళాలు :

మేడ్చల్ పంచాయితీ సమితిలోని షామీర్ పేటలో నవంబరులో జరిగిన బహిరంగ సమావేశంలో యాదగిరిపల్లి, తిమ్మాయిపల్లి, ధర్మారం, నరసంపల్లి, బసరాసుపల్లి, పొన్నాల్ గ్రామాల ప్రజలు రు. 2417.53 లను జాతీయ రక్షణనిధికి విరాళంగా ఇచ్చారు.

షామీర్‌పేట, ఉప్పరపల్లి, బాబాగూడ గ్రామస్థులు 120 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు రేడియో సెట్టులు అదనంగా విరాళంగా ఇచ్చారు.

మీ కృతజ్ఞతకు చిహ్నాలు

హిమాలయ సరిహద్దులలో అత్యున్నత శిఖరాలపై తమ విధిని తాము నిర్వహిస్తున్న సాహసికులైన మన సైనికులు ఆహార పదార్థాలు, ఇతర సౌకర్యాల కానుకులకు సహృదయంతో స్వాగతమిస్తారు.

ఈ క్రిందివాటిలో వేటినైనా పంపవచ్చు :

1. డ్రాగే చాక్‌లేట్ బోర్న్‌విటా, లేక ఇంకా అటువంటివి. 2. దబ్బాలలో నిల్వచేసిన కాఫీ, పాలు. 3. బాదం కాయలు, వాల్నట్లు, జీడిపప్పు. 4. బిస్కెట్లు, స్వీట్లు (వండినస్వీట్లు ఉదా: లోజాంజెస్, లెమన్ డ్రాప్స్ మొదలైనవి). 5. బ్యాటరీ రేడియో సెట్లు (ముఖ్యంగా 2 వేవ్ ట్రాన్సిస్టర్లు) 6. ఇండోర్ ఆటవస్తువులు. 7. స్పోర్ట్స్‌గేర్. 8. టాయిలెట్ వస్తువులు. 9. పిరియాడికల్స్, పత్రికలు, పుస్తకాలు.

ప్యాకెట్లలోపల వున్న వస్తువుల వివరాలను ప్యాకెట్లపై స్పష్టంగా తెలుపుతూ రవాణా చార్జీలను చెల్లించి ఈ క్రింది వారికి పంపవచ్చు.

1. అడ్మినిస్ట్రేటివ్ కమాండెంట్, హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్ స్టేషన్, బొలారం.

లేక

2. స్టేషన్ కమాండర్, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, బేగంపేట, హైదరాబాద్.

లేక

3. శ్రీ యం. హెచ్. కె. ఘజ్నవీ, గవర్నరు సహాయ కార్యదర్శి, రాజభవన్, హైదరాబాద్.

పొదుపు

ఇందుపల్లి సత్యవర్ధనరావు

ఒక్కొక్క చినుకు వర్షమయి యొప్పి
 జగమ్ముల నుద్ధరించు న
మ్యాకృతి వాగులై వరదలై నదులై
 స్రవియించు పోల్కి నొ
క్కొక్కటి యొక్కటొక్కటి మరొక్కటి
 చిన్నవి కొన్ని మొత్తముల్
చక్కగ జేరి కూర్చెడిని చాల
 ఘనమ్మగు కామితార్థముల్॥

పొదుపొనరించి లాభములు
 పొందుటయే కద ప్రజ్ఞ; భావిపై
కుదురుగ పెత్తనంబు
 గయికోవలెగాని యెటెట్టో కాలమే
బ్రదుకును వెళ్లమార్చెడిని వ్రాలెటులో
 యటులంచు నెంచి యా
పదలొగి వచ్చువేళ భగవంతుని
 దూఱుట పాపమౌ సుమీ॥

పెరిగలనాడు బాంధవులు స్నేహితులున్
 మఱి యందఱున్ బరా
మరికలు సేతు రెంతయును మన్నన
 పల్కులదోప, బీర యా
సిరియెతొలంగ బాంధవులు
 స్నేహితులున్ మఱికొందఱున్ నిరా
దరణ మొనర్తు; రిట్టివి కదా
 సమకాలపు లోక వృత్తముల్॥

అక్కట కట్టడే యెఱుగనట్టి
 వ్యయమ్మున దోగు కాపురం
బెక్కడి కాపురమ్ము నడియేట
 దగుల్కొను చిల్లినావ యౌ;
అక్కఱపాటుకున్ స్వజనులైనను
 సాయమురారు, దాచగా
జిక్కిన పైక మొక్కటె సుహృన్మణి
 యై వెడలించు చేటులన్॥

కిలకిల నవ్వి సొంపు లొలికించు
 కుమారుని కౌగలించి చె
క్కిలి నొక వేయి ముద్దు లొలికించుట
 ముచ్చట కాదు, బిడ్డకై
మెల మెల మెల్ల మెల్ల మెల మెల్లన
 పైకము నిల్వజేసి యు
జ్జ్వలమగు భావి కూర్చుట
 నిజమ్మగు ముచ్చట కాదె తండ్రికిన్॥

రోగమె వచ్చునో చెడుగు రోజులు
 పై కొని చుట్టు నిక్కటుల్
మూగెడినో, విరోధి బలముల్
 చెలరేగి చిరాకు పెట్టునో
ఆగము లౌనొ జీవితపు టాశలు
 నేటి వృథావ్యయమ్ములో
దాగుడు మూతలాడును
 యదార్థము రేపరుదెంచు గండముల్॥

హైస్కూలు దాటి మీ యబ్బాయి కాలేజి
 విద్యకై మా రాము వెట్టు నపుడు
పెండ్లికై యెదిగిన పిల్ల నట్టే బెట్ట
 పొరుగిండ్లు గుసగుసల్ వోవు నపుడు
పెద్ద తనంబందు కొద్ది పెన్షను తోడ
 బ్రతుకు భారముగ గన్పట్టు నపుడు
ఏ యుపాంతరమేని నేతెంచి పంటలు
 పండక కట కట పడెడు నపుడు

నెత్తి బాదు కొన్న నుత్తదే లాభంబు
గుండెలవియ నేడ్చు చుండు మంతె
ముందు చూపు మాని పొదుపుసేయని వాని
బ్రతుకు చీకు ముళ్ల బాట సుమ్ము॥ ★

పబ్లిక్ వర్క్సు శాఖ కార్యకలాపాలు

జాతీయ అత్యవసర పరిస్థితి దృష్ట్యా తమ తమ రాష్ట్రాలలో అభివృద్ధి ప్రణాళికలను పునఃపరిశీలించాలని ప్రణాళికా సంఘం రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. తదనుగుణంగా మన రాష్ట్ర ప్రభుత్వం 1962 నవంబరు 29 వ తేదీన జరిగిన సమావేశంలో, 1962–63 వ సంవత్సరానికి రూ. 431.00 లక్షల (భారీ, మధ్యరకం నీటివసరులు, వరద నిరోధక పథకాలు, ఇంజనీరింగ్ పరిశోధన)లనూ, 1963–64 వ సంవత్సరానికి రూ. 447.00 లక్షల (భారీ, మధ్యరకం నీటివసరులు, వరద నిరోధక పథకాలు, ఇంజనీరింగ్ పరిశోధన)లనూ కేటాయించింది.

రాష్ట్ర ప్రణాళికకు సంబంధించినంత వరకు, పి.డబ్ల్యు.డి. చిన్నరకం సేద్యపు నీటి పారుదల పథకాలకు 1962–63 వ సంవత్సరానికి రూ. 190.26 లక్షలు, 1963–64 వ సంవత్సరానికి రూ. 205.00 లక్షలు కేటాయించారు. అయితే ప్రస్తుత అత్యవసర పరిస్థితివల్ల వ్యవసాయోత్పత్తిలో సత్వరాభివృద్ధి సాధించడానికి ఇటీవల ఏర్పడిన ఇతోధిక ప్రాముఖ్యత దృష్ట్యా 1962–63 వ సంవత్సరానికి ఇచ్చిన 1963–64 వ సంవత్సరానికి ఇవ్వదలిచిన అదనపు మొత్తాలను ఈ కార్యక్రమాలలో చేర్చలేదు. అదనంగా 1962–63 వ సంవత్సరానికి రూ. 67.5 లక్షలు, 1963–64 వ సంవత్సరానికి రూ. 328 లక్షలు కేటాయించడానికి ప్రభుత్వానికి విడిగా ప్రతిపాదనలు అందజేయటం జరిగింది. అదనంగా ఇవ్వబడే మొత్తంతో కలుపుకొని 1962–63 వ సంవత్సరానికి రూ. 257.76 లక్షలు, 1963–64వ సంవత్సరానికి రూ. 53 లక్షల కేటాయింపు జరుగుతుంది.

మీ ప్రేమోత్సుకత

దుర్గమమైన హిమాలయ ప్రాంతంలో ఎన్నో కష్ట పరిస్థితులలో దేశసరిహద్దులను కాపాడుతున్న వీరులైన మన సైనికులు మీరు కానుకలుగా పంపే వెచ్చని బట్టలను ఎంతో గొప్పగా పరిగణిస్తారు.

ఈ క్రింది వస్తువులను పంపండి:

ఉన్ని బట్టలు, లోపల ధరించే బనీన్లు, డ్రాయర్లు, కేప్–కంఫర్టర్లు, స్కార్ఫ్సు, మెజోళ్ళు, గ్లోవ్స్, పుల్లోవర్లు దుప్పట్లు, కాటన్ పిల్లో–స్లిప్పులు (3′ × 1½′) (తెలుపు). నూలు పక్క–దుప్పట్లు (తెలుపు) 'పజమా' సూట్లు (తెలుపు)

శస్త్ర చికిత్స కుపయోగించే కాటన్ నూలు, బాండేజీలు (బూడిద, వైమానిక దళనీలం, ఖాకీ బీజ్, లేక ఇతర "న్యూట్రల్" రంగులలో వుంటే మంచిది).

ప్యాకెట్లలో వున్న వస్తువుల వివరాలను ప్యాకెట్లపై స్పష్టంగా తెలపాలి. వాటిని ఈ క్రింది చిరునామాకు రవాణా చార్జీలు చెల్లించి పంపాలి.

1. అడ్మినిస్ట్రేటివ్ కమాండెంట్, హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్ స్టేషన్, బొలారం.

లేక

2. స్టేషన్ కమాండర్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్, బేగంపేట, హైదరాబాద్.

లేక

3. శ్రీ యం. హెచ్. కె. షుజ్నవీ, గవర్నర్ సహాయ కార్యదర్శి, రాజభవన్, హైదరాబాద్.

గ్రామీణ స్వచ్ఛంద దళం

మన జనపదాలలోని మనుష్య శక్తినీ, వస్తు సంపదనూ సమీకరించే నిమిత్తం, గ్రామీణ స్వచ్ఛంద దళాలనూ, రక్షణశ్రామిక బ్యాంకులనూ ప్రారంభించడానికి కేంద్ర సమాజాభివృద్ధి, పంచాయతీరాజ్య మంత్రిత్వ శాఖ ఒక పథకాన్ని సిద్ధంచేసింది. ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన సమాజాభివృద్ధి, పంచాయతీరాజ్య మంత్రిత్వ శాఖ తాలూకు కేంద్రసలహా మండలి ప్రత్యేక సమావేశంలో ఈ పథకం ఆమోదించబడింది. ఈ సమావేశానికి 'ఎమర్జన్సీ కమిటీలోని' కేంద్రమంత్రిమండలి సభ్యులు, ఈఅంశానికి సంబంధించిన ఇతర మంత్రులుకూడా హాజరయ్యారు.

ఈ పథకం వివరాలను గూర్చి ప్రణాళికా శాఖామంత్రి 1962 డిశంబరు 15 వ తేదీన సమాజాభివృద్ధి, పంచాయతీరాజ్య శాఖల ఉపమంత్రి శ్రీ బి. ఎస్. మూర్తితోనూ, ప్రణాళిక, స్థానిక పరిపాలనాశాఖల అధికార్లతోనూ చర్చలు జరిపారు. ఈ చర్చల ఫలితంగా, గ్రామం, బ్లాకు, జిల్లా స్థాయిలలో ప్రత్యేక 'ఎమర్జన్సీ కమిటీ'ల స్థాపన విషయంలో కొద్దిగా మార్పు జరిగింది. ఈ కమిటీలను దిగువపద్ధతిలో స్థాపించడానికి ప్రతిపాదించారు :–

ప్రతి పంచాయతీకీ గ్రామీణ స్వచ్ఛంద దళం నెలకొల్పబడుతుంది. దళంలో చేరడానికి స్వచ్ఛందంగా ముందుకువచ్చే గ్రామంలోని దేహదార్ఢ్యంగల వయోజనులంతా ఈ దళంలో చేర్చుకోబడతారు. 18–50 సంవత్సరాల మధ్య వయస్కులైన స్త్రీ పురుషులందరినీ కేవలం స్వచ్ఛంద ప్రాతిపదికపై దళంలో చేర్చుకోడానికి ప్రతిపాదించారు. ఉత్పత్తి, గ్రామరక్షణ, విద్యావ్యాప్తికి సంబంధించిన సమస్త కార్యక్రమాలలోనూ పాల్గొనడానికి దళం సభ్యులు సంసిద్ధులైవుండాలి. వీరికి వరుసగా వారంరోజులవరకూ ఆ తరువాత వారానికి ఒకరోజు చొప్పున శారీరక శిక్షణఇస్తారు. దళపతి ఈ శిక్షణగరుపుతారు.

నెలకు కనీసం ఒకరోజు స్వచ్ఛందంగా కాయకష్టంచేయడానికి లేదా కాయకష్టానికి బదులు రొక్కరూపంలో విరాళం ఇవ్వడానికి సమ్మతించిన వయోజనులతో రక్షణ శ్రామిక బ్యాంకు నెలకొల్పబడుతుంది. భూవసతిలేని కార్మికులుమినహా ఇతర సభ్యులంతా నెలలో ఒకటికంటే ఎక్కువరోజులు ఉచితంగా కాయకష్టంచేయడానికి లేదా దానికి బదులు రొక్కరూపంలో విరాళం ఇవ్వడానికి కోరబడతారు. భూవసతిలేని కార్మికులకు వారు ఒకటికంటే ఎన్నిరోజులు ఎక్కువ పనిచేస్తే అన్నిరోజులకు మామూలురేటు ప్రకారం డబ్బుచెల్లిస్తారు.

రక్షణ శ్రామిక బ్యాంకు సభ్యులు పోరంబోకు భూముల అభివృద్ధి, కంపోస్టు తయారుచేయడం, కూరగాయలు, పండ్ల మొక్కలు నాటడం, మత్స్యపరిశ్రమ, గ్రామరక్షణ, వ్యవసాయోత్పత్తి అభివృద్ధికి ఉద్దేశించిన గ్రామీణపనుల ప్రత్యేక పథకాలు, భూసారసంరక్షణ, ఇదివరకే వున్న సేద్యపు నీటివసరులను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడానికై క్షేత్రాలకు కాలువలు నిర్మించడంవంటి కార్యక్రమాలలో నిర్ణీతమైన రోజులలో పనిచేస్తారు.

ఈ పనులను, గ్రామీణ స్వచ్ఛంద దళం రక్షణశ్రామిక బ్యాంకు లభింపజేసే శ్రామికబలగంద్వారా అమలుపరుస్తుంది.

రక్షణశ్రామిక బ్యాంకు పద్దులో రెండు భాగాలుంటాయి. ఒకదానిలో కాయకష్టానికి సంబంధించిన అంశాలనూ, మరోదానిలో డబ్బుకు సంబంధించిన అంశాలనువ్రాస్తారు.

డబ్బుకు సంబంధించిన పద్దులో దిగువ అంశాలు చేరివుంటాయి :

(అ) స్వచ్ఛంద కాయకష్టానికి బదులు దాతలు రొక్కరూపంలో ఇచ్చే విరాళాలు.

(ఆ) బ్యాంకు సహాయంతో సమకూర్చబడిన లాభసాటియైన సాముదాయక ఆస్తుల ఆదాయంలోనుంచి ఎప్పటికప్పుడు పంచాయతీ ఇవ్వడానికి నిశ్చయించే విరాళాలు.

(ఇ) విడివిడిగా రైతులకూ, అభివృద్ధి పథకాలనుంచి ప్రయోజనం పొందే ఇతరులకూ పనులుచేసి పెట్టినందుకు గాను వాటి విలువ మేరకు ఎప్పటికప్పుడు రాబట్టుకునే మొత్తాలు.

(ఈ) సమీపంలోనున్న పంచాయతీ అభ్యర్థనపై చేసిపెట్టిన పనులకు లభించిన ప్రతిఫలం మొత్తం.

(ఉ) చిన్నతరహా సేద్యపునీటి వనరులు, భూసార సంరక్షణ మొదలైన పథకాలకు కేటాయించబడే ప్రభుత్వ నిధులవాటా. అధిక పరిమాణంలో శ్రామికబలగం అవసరమయ్యే పథకాలవిషయంలో స్థానిక రేట్ల ననుసరించి ఋణం పొందినవారు పథకంలో భాగంగా కూలీమొత్తాలను చెల్లిస్తారు. ఈ విధంగా చెల్లించబడే మొత్తాలు ఈ పథకాలకు రక్షణశ్రామికబ్యాంకు శ్రామిక బలగాన్ని సమకూర్చిన మేరకు దానికి జమ కట్ట బడతాయి.

(అ) పంచాయతీ స్థాయి

సర్పంచ్‌తో సహా పంచాయతీ సభ్యులందరితోనూ 'ఎమర్జన్సీ కమిటీ' ఏర్పాటు చేయబడుతుంది. కమిటీని పటిష్ఠంచేయడానికి గ్రామంలోని విభిన్న వర్గాల ప్రజలకు ఇతోధికంగా ప్రాతినిధ్యం కల్పించడానికి వీలుగా ఈ కమిటీ సభ్యులుగా పంచులుకాని వారిని కూడా కోఆప్టు చేసుకోవచ్చు. గ్రామీణ స్వచ్ఛంద దళాధిపతిని 'దళపతి' అంటారు. ఆయన 'ఎమర్జన్సీ కమిటీ' కార్యదర్శిగా వ్యవహరిస్తాడు. గ్రామీణ స్వచ్ఛందదళం, రక్షణ శ్రామిక బ్యాంకులపై ఈ కమిటీకి పూర్తి అధ్వర్యం వుంటుంది. పంచాయతీ సర్పంచే సాధారణంగా 'ఎమర్జన్సీ కమిటీ' అధ్యక్షుడుగా వుంటాడు. కాని సర్పంచ్ ఆమోదయోగ్యుడు కాని కొన్ని సందర్భాలలో కమిటీ అధ్యక్షుడుగా తగు వ్యక్తిని నామినేటుచేసే అధికారం బ్లాకుస్థాయి ప్రజారక్షణ సంఘం అధ్యక్షునికి వుంటుంది.

(ఆ) గ్రామసేవకునిసర్కిల్ స్థాయి

గ్రామసేవకుని సర్కిల్‌లోని అన్ని పంచాయతీల సర్పంచులు, గ్రామీణ స్వచ్ఛంద దళాల దళపతులతో గ్రామసేవకుని సర్కిల్‌స్థాయి 'ఎమర్జన్సీ కమిటీ' ఏర్పడుతుంది. గ్రామ సేవకుడు కమిటీ కన్వీనరుగా వుంటాడు. బ్లాకు స్థాయి ప్రజారక్షణ సంఘం అధ్యక్షుడు, బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసరు, సాంఘిక విద్యా కార్యకర్త కమిటీ సమావేశాలకు హాజరవుతారు. కమిటీ సమావేశానికి హాజరైన పక్షంలో బ్లాకు స్థాయి ప్రజారక్షణ సంఘం అధ్యక్షుడు ఆ సమావేశానికి అధ్యక్షత వహిస్తాడు. ఆయన హాజరుకాని పక్షంలో బ్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరు కానీ, సాంఘిక విద్యా కార్యకర్త కానీ ఎవరు హాజరైతే వారు సమావేశానికి అధ్యక్షత వహించి కార్యక్రమం నిర్వహిస్తారు. సర్కిలులోని ప్రతి పంచాయతీకి చెందిన గ్రామీణ స్వచ్ఛంద దళం, రక్షణ శ్రామిక బ్యాంకుల కృషిని ఈ కమిటీ సమీక్షించి కార్యకలాపాల సమన్వయానికి అవసరమైన విధంగా తోడ్పడుతుంది. మార్గదర్శకత్వం వహిస్తుంది. సర్కిల్ కమిటీల కార్యనిర్వహణపై సాంఘిక విద్యా కార్యకర్త బ్లాకుస్థాయి ప్రజారక్షణ సంఘానికి నివేదిక సమర్పిస్తాడు. సర్కిల్ కమిటీ వారు తమ సర్కిలులోని పంచాయతీ లన్నింటినీ ఒకదాని తరువాత ఒకదాన్ని సందర్శిస్తారు.

(ఇ) బ్లాకు స్థాయి కమిటీ

బ్లాకు స్థాయిలో ప్రత్యేకంగా ఒక కమిటీని స్థాపించరు. సాంఘిక విద్యా కార్యకర్త సమర్పించిన నివేదికలను ప్రజా రక్షణ సంఘం పరిశీలిస్తుంది. కార్యక్రమాల ప్రగతినీ, ఇబ్బందులను గురించి తెలుసుకోడానికి ఈ సంఘం అవసరమైతే ప్రతి సర్కిలు నుంచీ దళపతులను సమావేశానికి ఆహ్వానిస్తుంది.

(ఈ) జిల్లా స్థాయి

జిల్లా స్థాయిలో ఏర్పడే ప్రజారక్షణ సంఘం ఉపసంఘానికి జిల్లా కలెక్టరు అధ్యక్షుడుగానూ, జిల్లా పరిషత్తు అధ్యక్షుడు ఉపాధ్యక్షుడుగానూ, జిల్లా పరిషత్తు కార్యదర్శి, కార్యదర్శి, కన్వీనరుగానూ వుంటారు.

పోలీసు సూపరింటెండెంటు, జిల్లాలోని అందరు రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్లు, జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, జిల్లా పౌరసంబంధాల అధికారి, జిల్లా పంచాయతీ ఆఫీసరు కమిటీ సభ్యులుగా వుంటారు. బ్లాకుల నుంచి అందిన నివేదికల ఆధారంగా వీరు గ్రామీణ స్వచ్ఛంద దళం రక్షణ శ్రామిక బ్యాంకుల కార్యక్రమాలను పునఃపరిశీలన చేస్తారు. అవసరమనుకుంటే బ్లాకుల నుంచి దళపతులను కానీ ఇంకా ఎవరైనా ఇతరులను కానీ వీరు ఆహ్వానించవచ్చు.

ప్రతి బ్లాకులోని దళపతులకూ ఆ సమీపంలోని పోలీసు స్టేషనుకు చెందిన సబ్ ఇనస్పెక్టరు అయిదు రోజులపాటు శారీరక శిక్షణ ఇస్తారు.

ఈ పథకం దేశమంతటా 1963 జనవరి 26 వ తేదీన ప్రారంభించబడుతుంది. జనవరి 26 వ తేదీ ఉదయం ప్రధానమంత్రి దేశప్రజలను ఉద్దేశించి రేడియోలో ప్రసంగించడం ద్వారా బహుశా ఈ కార్యక్రమానికి ప్రారంభోత్సవం గావిస్తారు. 26 వ తేదీ ఉదయం అన్ని పంచాయతీలలోని వయోజనులందరూ సమావేశమై నిర్ణీత విధానంలో ప్రతిన చేస్తారు. ★

త్రివర్ణ కంకణం

బోయి భీమన్న

(ఒకే రకం దుస్తులు ధరించిన అనేకమంది యువతీయువకులు పాడుకొంటూ ప్రవేశిస్తారు. అందులో మొదటివాని చేతిలో ఒక పెద్ద జాతీయ పతాక వుంది. అంతా మంచి వుత్సాహంగా, పాట కనుగుణమైన పద గతితో ముందుకు సాగుతున్నారు.)

భరత యువకులం,
భవ్య వీరులం,
పరాక్రమానికి
పట్టు కొమ్మలం !
పదండి ! పదండి ! పదండిరా !
పదండి ! ముందుకు పదండిరా !

సత్య రూపుడౌ
సత్త్వ తేజుడౌ
వర మహాత్ముడికి
వారసులం !
పదండి ! పదండి ! పదండిరా !
పదండి ! ముందుకు పదండిరా !

జీవధాతువును చిందించాం !
స్వాతంత్ర్యమ్మును సాధించాం !
మంచే కానీ, మన్నే కానీ
చిటికెడు కూడా చెదరగనివ్వం !

పదండి ! పదండి ! పదండిరా !
పదండి ! ముందుకు పదండిరా !

చీనావాడు మహాదుష్టుడు, మన
శితశైలమును త్రొక్కివచ్చెరా !

ఖడేరహోయని నిలబెట్టండీ !
కాలు కదిపితే కాల్చండీ !

పదండి ! పదండి ! పదండిరా !
పదండి ! ముందుకు పదండిరా !

(అందరూ ఒకచోట ఆగుతారు. భారత రిపబ్లిక్కు అవతరించిన ఘడియ అది. అక్కడ ఒక ఎత్తు స్థలంలో పతాకను ప్రతిష్ఠిస్తారు, దానికి వందనం చేసి, శపథం తీసుకుంటారు.)

శపథమిదే ! శపథమిదే ! జనని పతాకా !
చావుబ్రతుకు లెక్కగొనక జయము తెత్తుము సదా !

యుగయుగాల జీవశక్తు లొడ్డి తెచ్చుకొన్న
స్వేచ్ఛ నింక విడుచుకోము సృష్టి నాశమైన!

సత్యం, శౌర్యం, సమస్తజనులకు సౌభాగ్యం
త్రిగుణాత్మక లక్ష్యమిదే త్రివర్ణ కంకణం !

మా భారత రిపబ్లిక్కు మహికే మంగళ బుక్కు,
అప్రతిహతధృతిశీలం ఆసేతుహిమాచలం !

(యువతీ యువకులందరూ త్రివర్ణ కంకణాలు ధరిస్తారు. అందుండి ఒక అగ్రగామి ముందుకు వచ్చి, ఇలా ఉద్ఘాటిస్తాడు.)

భూమి పుట్టిన దాది ప్రబుద్ధ మగుచు
మానవుని మానవునిగాగ మలచి నట్టి

భవ్య ధాత్రీమతల్లి మా భరత భూమి !
చెనక తలపెట్లు కల్గెరా, చీన చెనటి ?

ప్రేమతో చేరు వారికి ప్రేమ యిదిగో !
కత్తితో వచ్చు వారికి కత్తి యిదిగో !
ఇంట తిని, ఇంటి గుట్టు గ్రహించి, దోచు
బంది పోటుకు ముక్కంటి బల్లె మిదిగో !

బ్రతికి పోనేర దిక దురాక్రమణ జరిపి
చైన యైనను, దాని యబ్బైన గాని;
భారతము మేలుకొన్నది, పరమ శివుని
మేలు కొల్పిన దా నేతు మిహిర నగము !

దేశగౌరవ మొక్కటే దేశ ప్రజకు
గౌరవమ్ము; అదే ఆత్మ గౌరవమ్ము;
ఆత్మ గౌరవ రక్షకై అవని నోర్వ
గుండె నెత్తుటి శపథమ్ము గొంద మిప్పుడె !

(శపథానంతరం, వీరకంకణ ధారులైన ఆ యువతీయువకు లందరూ, ఆయుధాలు ధరించి, ముందుకు సాగిపోతారు — ఉత్తర సరిహద్దులలోకి, పాడుకొంటూ)

వేదాల పుట్టిల్లు,
విశ్వనాథుని గద్దె,
మన హిమాలయ భూమి
మర్యాద నిల్పరా !

చైనాను పడ నెట్టరా, తమ్ముడా !
సరిహద్దు రక్షించరా !

చీన వాడంటేను
తేనె పూసిన కత్తి !
తడి గుడ్డతో తలలు
తరిగేటి బిత్తిరా !
చైనాను పడ నెట్టరా, తమ్ముడా !
సరిహద్దు రక్షించరా !

ప్రేలె డంతటి వాడు
విర్ర వీగుతు వస్తె
చెట్టంత మనిషివై
నెట్టి వెయ్ లేవటర ?
చైనాను పడ నెట్టరా, తమ్ముడా !
సరిహద్దు రక్షించరా !

ఇంటి కొక బంటు గా
ఇన తేజమున లేర !
పది కోట్ల సేన వై
వసుధనే సాకరా !
చైనాను పడ నెట్టరా, తమ్ముడా !
సరిహద్దు రక్షించరా !

(పాట హిమాలయ గుహల్లోనూ దగ్గిర శిఖరాలమీదా ప్రతిధ్వనిస్తూ ఉంటుంది.)

★

శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు అస్తమయం

ప్రఖ్యాత కవి, స్వాతంత్ర్య సమరయోధుడు అయిన శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారు 1962 డిశంబరు 25 వ తేదీ ఉదయం 5-30 గం॥లకు స్వర్గస్థులైనారు. వీరి వయస్సు 67 సంవత్సరాలు. "తొలకరి" "సౌందరనందనం", "గుడిగంటలు", "ముప్పగోపాల", "శ్రీనివాస కళ్యాణం" వీరి ప్రసిద్ధ కావ్యాలలో కొన్ని. శ్రీ వెంకటేశ్వరరావు, శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారలు జంట కవులుగా ప్రసిద్ధి నొందారు. మహాకవి శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి శిష్యులలో శ్రీ కాటూరి ప్రముఖులు.

శ్రీ వెంకటేశ్వరరావు కృష్ణా జిల్లా గన్నవరం తాలూకా కాటూరులో 1895 అక్టోబరు 15 వ తేదీన జన్మించారు. బి. ఏ. చదువుతూ 1921 వ సం॥లో జాతీయోద్యమంలో ప్రవేశించారు.

ముఖ్యవార్తలు

రాష్ట్రంలో

24 నవంబరు :— భూమిశిస్తు, (అదనపు విధింపు) సెస్‌రివిజన్ సవరణ చట్టం బిల్లును గజెటులో ప్రకటించారు.

1 డిసెంబరు :— వరంగల్లులోని మహాత్మా గాంధీ ఆసుపత్రిలో రెండు క్రొత్త వార్డులకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.

6 డిసెంబరు:— ప్రభుత్వోద్యోగుల ప్రస్తుతం ఉన్న 55 సంవత్సరాల రిటైరు మెంటు వయస్సును పెంచవద్దని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది.

8 డిసెంబరు :— శాసనసభ శీతాకాలం సమావేశం ప్రారంభం అయింది.

8 డిసెంబరు :— భూమిశిస్తు అదనపు విధింపు సవరణచట్టం బిల్లును శాసనసభ ఆమోదించింది.

11 డిసెంబరు :— పంచాయితీ సమితులు, జిల్లా పరిషత్తుల చట్టం సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది.

17 డిసెంబరు :— ఆంధ్రప్రదేశ్‌లో ధరలను అదుపు చేయడానికి 8 సూత్రాల ప్రణాళికను వ్యవసాయమంత్రి ప్రకటించారు.

18 డిసెంబరు :— ఆంధ్రప్రదేశ్‌లో విద్యుచ్ఛక్తిని పొదుపు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కొన్ని ముఖ్య నిర్ణయాలను చేసింది.

19 డిసెంబరు:— రాష్ట్ర ఆర్థికమంత్రి హైద్రాబాదులో తోళ్ళ పరిశ్రమ సలహా సంఘానికి ప్రారంభోత్సవం చేశారు.

22 డిసెంబరు :— గ్రామ వాలంటీర్లదళం, రక్షణ కార్మిక బ్యాంకు, పథకాలను గురించి హైద్రాబాదులో రాష్ట్ర అధికారులతో కేంద్ర ప్రభుత్వ సమాజాభివృద్ధి మంత్రి చర్చలు జరిపారు.

భారత దేశంలో

21 నవంబరు :— శ్రీ వై. బి. చవాన్, రక్షణ మంత్రిగా న్యూఢిల్లీలో పదవీ స్వీకారం చేశారు.

26 నవంబరు :— ఫెడరల్ జర్మన్ రిపబ్లిక్ అధ్యక్షులు, భారతదేశంలో పది రోజుల అధికార పర్యటనపై క్రొత్తఢిల్లీ చేరుకున్నారు.

27 నవంబరు :— యు. కె. భారతదేశాల మధ్య అరువు-కౌలుపై జరిగిన అంగీకార పత్రంపై న్యూఢిల్లీలో సంతకాలు జరిగాయి.

28 నవంబరు :— కేంద్ర ప్రభుత్వోద్యోగుల రిటైర్‌మెంటు వయస్సును 55 నుండి 58 సంవత్సరాలకు పెంచాలని భారత ప్రభుత్వం నిశ్చయించింది.

9 డిసెంబరు :— తను ప్రతిపాదించిన మూడు సూత్రాల ప్రతిపాదనను అంగీకరించనిచో యుద్ధ విరమణను ఉపసంహరించు కోవాల్సివస్తుందని బెదిరిస్తూ పెకింగ్, భారతదేశానికి పత్రం అందజేసింది.

9 డిసెంబరు :— చైనా భారతదేశాల మధ్య ఉన్న వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడానికి ప్రయత్నించడానికి వీలుగా కొలంబోలో ఆరు తటస్థరాజ్యాలు సమావేశమయ్యాయి.

16 డిసెంబరు :— పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానే క్రొత్తగా పంచాయితీ రాజ్ రాజ్యాంగాన్ని నేపాల్ ప్రభువు మహేంద్ర ప్రకటించారు.

17 డిసెంబరు :— కొలంబోలో జరిగిన ఆరు రాజ్యాల సమావేశం రూపొందించబడిన ప్రతిపాదనలను అందజేయడానికి ప్రత్యేక దూత ప్రధానమంత్రిని కలిశారు.

18 డిసెంబరు :— నేఫాలోని బొమ్‌డిలాలో సివిల్ పరిపాలన తిరిగి నెలకొన్నది.

విదేశాలలో

30 నవంబరు :— ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శిగా 5 సంవత్సరాల వరకు బర్మాకుచెందిన యూథాంట్‌ను ఎన్నుకోడానికి సంబంధించిన ప్రతిపాదనను భద్రతా మండలి ఏకగ్రీవంగా తీర్మానించింది.

15 డిసెంబరు :— యు. కె. ప్రధాని మాక్మిలన్, అధ్యక్షులు డీగాల్‌లమధ్య

పారిస్‌వద్ద సంప్రదింపులు ప్రారంభ మయ్యాయి.

18 డిసెంబరు :— వచ్చే సంవత్సరంనుండి సివిల్ ప్రభుత్వం ఏర్పడడానికి వీలుగా మిలటరీ జుంటా ప్రతిపాదించిన క్రొత్త రాజ్యాంగాన్ని దక్షిణకొరియా ఓటర్లు ధ్రువపర్చారు.

19 డిసెంబరు :— ప్రధాని మాక్మిలన్, అధ్యక్షులు కెన్నెడీలమధ్య చర్చలు నాసావ్‌లో ప్రారంభమయ్యాయి.

20 డిసెంబరు :— సుప్రీం సోవియటు అధ్యక్షపదవికి శ్రీ నికోలాయ్ అర్గనోవ్ స్థానంలో శ్రీ నికోలాయ్ ఇగ్నాటోవ్ ఎన్నికయ్యారు.

21 డిసెంబరు:— నాటో ఆధ్వర్యంలో న్యూక్లియర్, ఆయుధ బాంబర్‌దళాన్ని నెలకొల్పాలని అధ్యక్షులు కెన్నెడీ, ప్రధాని మాక్మిలన్ తమ నిర్ణయాన్ని ప్రకటించారు.

21 డిసెంబరు :— 'స్కై-బోల్ట్'కు ప్రతిగా బ్రిటన్‌కు పోలారిస్ సబ్‌మేరీన్ మిసిలీలను సరఫరాచేసే ఆంగ్లో-అమెరికన్ ప్రణాళికను బ్రిటిష్ మంత్రివర్గం ఆమోదించింది. ★

ప్రజా చైతన్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర రక్షణ సమితి ద్వితీయ సమావేశం 16-12-1962 తేదీన జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ మొరార్జీ దేశాయ్ హాజరయ్యారు. శ్రీ మొరార్జీ హైదరాబాద్‌లో ఒకరోజు పర్యటించిన సందర్భంలో ఏర్పాటైన పెక్కు కార్యక్రమాలలో ఇదొకటి.

ఈ సందర్భంలో శ్రీ దేశాయ్ ప్రసంగిస్తూ, చైనా ద్రోహబుద్ధితో ఏకపక్షంగా యుద్ధవిరమణ ప్రకటించిన కారణంగా మన సన్నాహాలనేమాత్రం సడలించకూడదని ప్రజలను హెచ్చరించారు. ప్రస్తుత ఆత్యయిక పరిస్థితిని గురించి, ఈ పరిస్థితిలో కావలసిన రక్షణావసరాలు పెంపొందించవలసిన ఆవశ్యకతను గురించి ఈ కమిటీ సభ్యులు ప్రజలకు తెలియ జేయాలని ఆయన ఉద్ఘాటించారు. "ప్రజలలో వచ్చిన బ్రహ్మాండమైన జాగృతిని, చైతన్యాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి" అని శ్రీ మొరార్జీ అభిభాషించారు. ధరల నదుపులో వుంచవలసిన అవసరాన్ని గురించి కూడా ఆయన నొక్కి చెప్పారు. గతయుద్ధం అవినీతిని పెంపొందించిందని, ఈ యుద్ధం దాన్ని పరిమార్చాలని ఆర్థిక మంత్రి అన్నారు. ★

గ్రామ స్వచ్ఛంద సేవక దళం

సహకార, సమాజాభివృద్ధి శాఖల కేంద్ర ఉపమంత్రి శ్రీ బి. యస్. మూర్తి అన్ని స్థాయిలలో రక్షణ చర్యలను పెంపొందింప తలపెట్టిన గ్రామీణ స్వచ్ఛంద దళం, రక్షణ శ్రామిక బ్యాంక్ పథకాలను గురించి వివరించారు.

వజీర్ సుల్తాను టుబాకో కంపెనీ చైర్మెన్, ధరలు, ఉత్పత్తుల ఉపసంఘం కార్యదర్శి అయిన శ్రీ బి. కె. సెహాగ్రి రాష్ట్రంలో ధరల నదుపులో వుంచడానికి తీసుకున్న చర్యలను గురించి వివరిస్తూ, తాము పర్యవేక్షించవలసిన నిర్ణీత ప్రాంతాలలో నిత్యజీవితావసర వస్తువుల ధరలను జాగ్రత్తగా పరిశీలిస్తుండవలసిందిగా ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పరిశ్రమల మండలి సమాఖ్య సీనియర్ సభ్యులను కోరడం జరిగిందని తెలిపారు. గరిష్ఠ ధరలను మూడు నెలలకొకసారి నిర్ణయించవలసిందిగా పర్యవేక్షక సంఘాలు ఆదేశింపబడ్డాయి. వారు షాపులను తనిఖీచేసి ధరల పెరుగుదల, సరుకుల కొరతలను గురించి నివేదించాలి. ఈ పరిశీలనను సమర్థవంతంగా సాగించడానికై జంట నగరాలను 8 విభాగాలుగా విభజించారు.

ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పరిశ్రమలమండలి సమాఖ్య అధ్యక్షులు శ్రీ లోహాడీ, శ్రీ కూర్మయ్య ప్రభృతులుకూడా ప్రసంగించారు.

ప్రథమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 1963 జనవరి 26వ తేదీ నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 3¼ కోట్ల రూపాయలు వసూలు చేయబడుతాయని, ప్రస్తుత పరిస్థితి నెదుర్కొనడానికి లక్షమందితో స్వచ్ఛంద సేవకదళం ఏర్పాటుచేయబడుతుందని ప్రకటించారు. ★

ప్రకటన

వ్యవసాయశాఖలో ఆర్టిస్టుల ఉద్యోగాలకై దిగువ సంతకంచేసినవారు అభ్యర్థులనుంచి 15-1-1963 తేదీవరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈఉద్యోగాల జీతపుస్కేలు రూ. 125-5-160-7½-220. నియమావళి క్రింద ఇచ్చే మామూలు భత్యాలు అదనంగా లభిస్తాయి.

దరఖాస్తు ఫారాలను, ఇతర వివరాలను హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ డైరెక్టరు కార్యాలయంనుంచి పొందవచ్చును.

వ్యవసాయశాఖ డైరెక్టరు
ఆంధ్రప్రదేశ్ - హైదరాబాదు.

గ్రంథసమీక్ష

మల్లికార్జున ప్రార్థనావళి

రచయిత: శ్రీ తోటపల్లి కృష్ణమూర్తి, బి. ఒ. యల్.

మునికొండ, మహబూబునగరం జిల్లా.

వెల 80 న. పై.

ఇందు శ్రీశైల మల్లికార్జున దేవుని ప్రార్థనలతోకూడిన ఏబదియాఱు గేయములున్నవి. ప్రతి గేయమును పది మాత్రలతో కూడిన నాలుగు పాదములతో నొప్పారుచున్నది. "శ్రీశైలవాసా - శ్రీ పార్వతీశా-కాపాడరా మమ్ము-కరుణాంతరంగా" అను మొదటి గేయము తరువాతి గేయములన్నిటి చివర మకుటముగా అనుసంధించుకోఁదగినది. చివరి గేయ ముదాహరణములందలి అంకితాంక పద్యమువంటిది. ఇందు కవి పేరు చెప్పఁబడినది. నాల్గవ గేయమునుండి అక్షరానుక్రమము పాటింపఁబడినది. ఋ, ౠలు రెండు నొకే గేయమునందలి రెండర్థభాగములందును కూర్పఁబడినవి. ౘ, ౙ, ఙ, ఞ లు విడువఁబడినవి. శకటరేఫము క్ష తరువాత నున్నది. ళ కారమునకు "లక్షలాదిగజనము" అని లఘు లకారమే వాడఁబడినది. గేయములన్నియు సాధారణ భావములతోఁగూడి గ్రంథకర్తగారి భక్తిభావమును వెల్లడించుచున్నవి. అక్షజము, ఉంకు, ఊకువ, ఋూన సుభవింపంగ, ఆపనీకుషు, ఖరువు, జ్ఞము, ఞము, తా, అను నపరిచిత పదములు గేయముల సుబోధత కించుక భంగకరములుగా నున్నవి. "హరివాసరము చేసి, హంకారమును వదలి, హాస్యమ్ము జనియింప, లాస్యమ్ము లాడేదను'' అను గేయమునందలి హరివాసరము, హాస్యమ్ము జనియింప నను పదముల ప్రయోగమున నౌచిత్యము కొఱవడి యున్నది. 6వ పుటయందలి కామజిత్తుఁడ వయ్య అనుచోట కామజితుఁడని యుండుట లెస్స. ప్రతి పుట అడుగునను కఠినపదముల కర్థములు వ్రాయఁబడినవి. గేయములన్నియు ధారాశుద్ధి శోభితములై స్త్రీలు, బాలబాలికలుకూడ పాడుకొనుట కనువుగా నున్నవి.

యువసాహితి

యువరచయితలసమితి, గుంటూరు 2.

మూల్య మొక రూపాయ.

ఇది గుంటూరునందలి యువ రచయితల సమితి ప్రచురించిన కవితా సంకలనము. ఇందు 67 ఖండకావ్యము లున్నవి. రచయితలలో సర్కార్లకు, రాయలసీమకు, తెలంగాణమునకు - అనగా సర్వాంధ్రదేశమునకు చెందిన యువకులున్నారు. యువకులు రచించిన సాహిత్య మగుటచే దీనికి యువసాహితి అను నామమన్వర్థమై యొప్పుచున్నది. ఈ సమితియందలి యువ కవులకు భావస్వాతంత్ర్యము, క్రొత్తదనము, ఆదర్శములని తొలి పలుకు వలన తెలియుచున్నది.

ఇందు గేయరచనలు హెచ్చు. మూడు నాలుగు పద్యరచనలు, వచన గేయములు కూడ నున్నవి. ఉన్న దిహ మొక్క టే యనియు, తపశ్చర్యకంటె సేవాపరాయణతయే యుత్తమమనియు, మతములు మనుష్యజాతికి ముప్పు తెచ్చునవి కావున వానిని విడిచివేయవలె ననియు మొదటి గేయము చెప్పుచున్నది. తరువాతి గేయములు పెక్కిందలి భావములనే ప్రతిధ్వనింప జేయుచున్నవి.

"అభినవదీపావళి" భావపూరితమైన గేయకావ్యము. దీపావళు లెన్ని వచ్చుచున్నను లోకమంతయు దురంత తిమిర దంతురమై ధర్మ శర్మ విహీనమై యల్లాడుచున్నదనియు, విదళిత దైత్యావళియైన అభినవ దీపావళి కావలెననియు కవిగారాకాంక్షించుచున్నారు. "అవునట విన్నాను" అను వచన గేయములో కవిగారు "మానవుడవైనచో కార్మికరంగమున కాలిడి శ్రమించు దీనులకు వెలుగు చూపించుము. అంతేకాని అర్థహీనములైన వ్యర్థరచన లెన్ని చేసినను లాభములే"దని చక్కని సందేశ మిచ్చినారు. "ఆణిముత్యా" లను గేయముకూడ "చందమామతో విందులు సేయ ఎందుకు భాయీ ఆత్రం - సూతిలోని గొంతుల గాత్రం విన తీరిక లేదా కోరిక లేదా" అని పై భావమునే వ్యక్తము చేయుచున్నది. "ఈశ్వరా" అను గేయము పెద్దమనుష్యుల స్వార్థచింతకును, లోకమునందలి అంతరములకును స్వస్తి చెప్పవలెనని బోధించుచున్నది. శ్రీ నాగమల్లారెడ్డిగారు తమ గేయమున లోకములో నున్న వివిధ మందభాగ్యులను కరుణరస మయముగా వివరించినారు. "ఏనాటికైనా" అను గేయమున కవిగారు నరకప్రాయమైన యీ లోకము స్వర్గముగా నెప్పుడు మాఱునని ఆత్రము నొందుచున్నారు. శ్రీ గోపాలరావుగారు కృషి వెంటనే ఫలితముండునని చెప్పుచు దీనులైన కార్మికుల నూఱడించుచున్నారు. హంసశ్రీగారు శాంతి నెలకొల్పుమని నేటి యువకులను ప్రబోధించుచున్నారు. శ్రీ మురళీధరస్వామిగారు ప్రపంచమునకు సచ్ఛీల, సౌభ్రాత్ర, సామరస్యాలేకాని అణు

బాంబు లక్కఱలేదని ముక్తకంఠముతో శాంతి సందేశమును వినిపించుచున్నారు. "నా ఉద్దేశ" మను గేయమున కవిగారు యోధుడై పోరాడి, జీవితమర్పించి, స్వాతంత్ర్యము రక్షించుచు శాంతి నిల్పుటయే తన ముఖ్యోద్దేశమని చెప్పుచున్నారు. "మారుతున్న ప్రపంచ"మను గేయమున మురారి గారు ప్రపంచము మారుచున్నదనియు, యుద్ధమేఘ ఘోషలు చల్లారుచున్నవనియు, భావిజగము సహజీవన సుఖశాంతులను సాధించుననియు ఆశ ప్రకటించుచున్నారు. వలపుపిలుపు, సిన్నదీ, ప్రేయసీ, అను గేయములు శృంగారరస సంబంధులు. "సిన్నది" అను దానిలో గ్రామ్య శృంగారము వర్ణింపబడినది. అందు ప్రియురాలే ప్రియుని వలచును. "తెలుగు పూబాల, ఓ తెనుగు వీరా" అను గేయములు తెలుగు భాష, తెలుగు రాష్ట్రము, తెలుగు కవులు మున్నగు విషయములపై రచయితలకుంగల అభిమానమును వెల్లడించుచున్నవి. శ్రీ పట్టాభి గారిని, దువ్వూరి రామిరెడ్డిగారిని వర్ణించు గేయములు రమ్యములై రాజకీయ కవితారంగములం దప్రతిమానులై వెలిగిన ఆ మహనీయుల యుదాత్తతను ప్రకటించుచున్నవి.

వచన గేయములలో ఆత్మకథ, తిక్తగీతి, పంతులూ, పద్మవ్యూహం, బ్రతకాలని ఉంది, హిమానీహృది, చైతన్య విపంచి మున్నగునవి ముఖ్యమైనవి. ఆత్మకథ దినమంతయు కష్టపడి పనిచేయు పేదగుమాస్తా దైన్య జీవితమును, తిక్తగీతి మనసార ప్రేమించి వైఫల్యము నొందిన ప్రియుని విషణ్ణజీవితమును, పంతులూ ప్రాచీనార్వాచీన కాలములందలి ఉపాధ్యాయుల తారతమ్యమును చక్కగా వ్యక్తము చేయుచున్నవి. పద్మవ్యూహం భావగంభీరమై అత్యంత శక్తిమంతముగా నున్నది. 'ఎంగిలాకు దుర్మరణం' అభాగ్యుల జీవితమును తెల్పు చక్కని వ్యంగ్యరచన.

కిర్మీరమను గేయము మృదుమధుర శైలీశోభితమై సుప్తత పోకార్చుకొన్నకాని పురోగమన మబ్బదని ఘోషించుచున్నది. ఇందు భావముమాత్రము కొంచెము గూఢముగా నున్నది.

ఓ కవీ, కృషికుడు, తెలుగుబిడ్డ, దివ్య జీవి, నా నివేదన రసరాజీయము – అనునవి పద్యకావ్యములు. 'ఓ కవీ'లో రచయిత కవి మహత్త్వము ప్రకటించుచు జగతి బాగుపడుటకే కవులు కవిత్వము చెప్పవలెనని సూచించుచున్నారు. కృషికుండను కావ్యము కర్షకుల కష్టజీవితమును వర్ణించి నిఖిల జగమున వారిని మించినవారు లేరని చాటుచున్నది. తెలుగుబిడ్డ అందమైన ఆటవెలదుల సమూహము. ఇందలి భావములు, రచన సుకుమారములై వేమన పద్యములను తలపించుచున్నవి. దివ్యజీవి యీ సంకలనమందలి కావ్యములకెల్ల తలమానికమై భాషా భావములందు కడుంగడు ప్రశస్తమై యున్నది. నా నివేదనలో శ్రీ మద్దయ్యగారు పరమేశ్వరుని లీలారహస్యముల వర్ణించి ఆట చాలించి మానవులపై కరుణ కురియింపుమని ప్రార్థించుచున్నారు. రసరాజీయము గాఢమైన ప్రణయ హృదయమును వ్యక్తముచేయుచు ముద్దుగానున్నది.

ఇందలి రచనలలో పెక్కు నూత్నభావములతోగూడి రచయితలం దడగియున్న ప్రతిభను వెల్వరించుచున్నవి. కొన్నిట వ్యక్తీకరణ మస్పష్టముగా నున్నది. అనగా ఆ రచయితలకు భావపాటవముతో తులతూగు భాషా పాటవము లేదన్నమాట. ఖండకావ్యములన్నింట వ్యాకరణ స్ఖాలిత్యము లున్నవి. ద్రుతముపై యడాగమములు చాల చోట్ల కనిపించినవి. వైరిసమాసములు –

జాగృతికి చిహ్నం

మా అమ్మ చదువురాని ఒక ముస్లిం స్త్రీ. నేనూ, మరో సోదరుడూతప్ప మా కుటుంబంలోవున్న మా తల్లి తండ్రులు, ఐదుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు, ఒకబంధువు అందరూ దాదాపు విద్యావిహీనులే. మా ఇద్దరికిమాత్రం కళాశాల విద్య నభ్యసించే అదృష్టం కలిగింది. మిగతా వాళ్ళెవరూ కూడా మాధ్యమిక పాఠశాల విద్యాస్థాయిని మించలేదు. మాకు, ముఖ్యంగా మా అమ్మకు, తమ్ముళ్ళకు, చెల్లెళ్ళకు ప్రస్తుత ఆత్యయిక పరిస్థితినిగురించి ఎన్నో ప్రశ్నలు మనసుకి తడుతుంటాయి. మా కుటుంబంలో జ్యేష్ఠ పుత్రుడుగా వారి ప్రశ్నలకు సమాధానాలివ్వాల్సిన బాధ్యత నామీద వుంది. వాళ్ళు నన్ను జాతీయ ఆత్యయిక పరిస్థితిగురించి, జాతీయ రక్షణనిధిగురించి, నేఫా, లడక్, చైనా, ధరల పెరుగుదల, సైన్యం, యన్. సి. సి. వంటి – ప్రతి పౌరుడూ తెలుసుకోవాలని కోరే – విషయాల నడుగుతుంటారు. ఈ ప్రశ్నలు సాధారణంగా ఆర్థిక రాజకీయ సమస్యలకు సంబంధించినవి.

ఈ సమస్యల విషయంలో వారి మనస్సుల్లో కొన్ని తప్పుడు అభిప్రాయాలున్నాయి. వాళ్ళ ప్రశ్నలకు సమాధానాలివ్వడానికి నేనెప్పుడూ ప్రయత్నిస్తుంటాను. కాని ఇంగ్లీషుమాట లుపయోగించలేకుండా వివరించలేక పోతున్నాను. ఆ పదాలు వాళ్ళకి తెలియవు. నాకుకూడా కొన్ని ప్రశ్నలకు సరిగ్గా సమాధానం తెలియదు. ఒక విద్యావంతుడుగా నేను నా విధిని నిర్వహించలేక పోతున్నాను.

కనుక మనదేశ ప్రాథమిక సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని ముఖ్యంగా ఉర్దూభాషలో వున్నవాటిని దయచేసి పంపవలసిందిగా కోరుతున్నాను. చిత్రాలు, మ్యాపులూ, ఫోటోలు మొదలైన వాటితో సచిత్రంగా వున్నవాటిని పంపితే మీ కెంతో కృతజ్ఞుణ్ణిగా వుంటాను.

యం. అబ్దుల్ ఘని
మీర్ ఆలంమండి – హైద్రాబాదు

(ఈ పాఠకుడు కోరిన సమాచారం అందజేయబడింది.)

భామినీ కౌగిలింతలు, ధీరగుండెలు, నవ ఉడుపులు, మేఘపెనుఘోషలు – వంటివి పెక్కున్నవి. అపప్రయోగములు కూడ హెచ్చుగనే యున్నవి. ఉదా: వాసనమ్ము, జయయింపవేదొకో, ఆధిక్యత, చూపెదు దువు. కాని యించుక పరిశ్రమచేసి మెల కువ వహించినచో వీనినన్నిటిని సులభముగా తొలగించుకొనవచ్చును. ఈ సాహితీలతకు దోహదము చేకూర్చిన రచయితలలో కొంద రైన భావికాలమున ఉత్తమ రచయితలు కాగలరనుటలో సందియము లేదు.

దివాకర్ల వెంకటావధాని.

దయానిధి

మన దేశంలో మహాపురుషులకు, మానవ హృదయాల వికసింపచేసి క్రొత్త వెలుగుల నింపగల ఋషిపుంగవులకు కొదువలేదు. ఈ కాలంలో ఇట్టి సత్పు రుషులుగా ప్రసిద్ధి కెక్కినవారు శ్రీ రమణ మహారుషి. వీరు సర్వసమత్వాన్ని, దయా రసాన్ని వెదజల్లి అధ్యాత్మిక ప్రపంచంలో ఉన్నత శిఖరాలందుకున్నారు. ఈ మహాను భావుని దివ్య చరితాన్ని వస్తువుగా తీసుకొని శ్రీ కె. సభాగారు కావ్యాన్ని వ్రాశారు.

భగవాన్ రమణ మహారుషి అమృత హృదయుడు. నేటి వినోబాభావేకు వలెనే నిరాడంబరతకు పెట్టినది పేరు. ఆత్మ సాక్షా త్కారం చేసుకున్న జీవన్ముక్తుడు. ప్రకృతి యెంతగా తనపట్ల వికటించినా పేరుకొన్న ఓరిమిలా భాసిల్లాడు. లోకం కొరకు తపిం చిన విశాల హృదయుడు. వీరి అమృత హృదయంలో సమస్త జీవరాసులకు స్థానం ఉండింది. పులులకు మైత్రిని నేర్పి, కోతు లకు నీతుల జెప్పి దుష్టులకు భూతదయా సౌందర్యాన్ని చవి చూపిన రమణాశ్రమాన్ని విదేశీయులు సహితం సేవించి ముగ్ధులయి నారు. ఈ అరుణాశ్రమం కాంతిని బోధించే జీవిత పాఠశాలగా ఎలా రాణించిందో కవి వర్ణన చూడండి.

"ఎచ్చోట చిరుతలు మచ్చిక పడివచ్చి
చెలిమితో పానీయముల గ్రోలు!
ఎచ్చోట నాగులు నిచ్చకమ్ముల మయూ
రములతో నృత్యము కరహిని సల్పు
ఎచ్చోట కాసరాలెల్ల గుంపులుగజేరి
స్వామి ప్రేమను గ్రోలి సంతసించు
ఎచ్చోట శ్వానముల్ నెయ్యమ్ము బల్కుచు
శివుని సాన్నిధ్యంబు జేరుచుండు!
ఎచట సర్వజీవుల గమియేకమనెడి
భావ ముదయించి వికసించు భక్తకోటి
హృదయ కమలములటు నిటు గదలియాడు
నట్టి దీ పుణ్యగిరి రమణాశ్రమంబు!

ఇట్టి ఆశ్రమంలో ప్రశాంతత కేమి కొదువ. ఇక ఈ ఆశ్రమవాసియా?

"సర్వసంగ పరిత్యాగి సదయుకుండు
కీర్తి దాహములేని ప్రకృతి హృదయుడు
దివ్య తేజోవిరాజ ప్రదీప్త డితడు
రమణ భగవానుడగును పరాత్పరుండు!

ఇట్టి రమణుని గురువుగా దైవముగా భజించి వ్రాసిన ఈ కావ్యంలో పెక్కుచోట్ల శిల్పంతోపాటు కవి భావోద్రేకంగూడా అందచందాల నింపుకున్నది. రమణుని లీలావర్ణనలో ఆతను చిన్ననాడు తపమాచ రించినచోటు, రమణునితల్లి విలాపం, రమ ణుడు అరుణగిరిలోని వివిధ మృగపక్షి సంతతులతో వ్యవహరించిన తీరు పాఠకుల హృదయాల స్పందింపచేస్తాయి. ఈ కావ్యాన్ని రచయిత రమణాశ్రమవాసి చలానికి అంకితమిచ్చారు.

ఈ పద్యకావ్యం వెల రు. 2-50 న. పై. ప్రాప్తిస్థానం :- రమణా పబ్లిషర్స్, పైరోడ్డు, చిత్తూరు.

పంచవటి

ఈ గేయకావ్యం వెల రు.0-75 న.పై. అనువక్త 'అనంతం' ప్రాప్తిస్థానం :- శారద ప్రచురణలు, అత్తిలి, పశ్చిమ గోదావరి జిల్లా.

సంస్కృత భాషలో శ్రీ కేసిరాజు వేంకట నృసింహ అప్పారావుగారు వ్రాసిన ఈ లఘు కావ్యాన్ని మృదు మధుర శైలిలో శ్రీ ఏడూరిపాటి అనంతరామయ్యగారు (అనంతం) తెలుగులో అందించారు. "పంచకోశాత్మక తనువు పంచవటిగ, జీవుడా గౌతమీనది; చేరి యందు, గాపురం బుండు ప్రకృతి పుంరూపులకును, జానకీ రాములకు" నమస్కరించి రచయిత భక్తి ప్రపత్తులను ప్రస్ఫుటింపచేస్తూచేసిన వర్ణనలు మనోజ్ఞంగా ఉన్నాయి. కవి రచనలోని మచ్చుతునక ఒకటి, గోదావరినదిని గూర్చి సీతమ్మ ఇట్లంటుంది :—

"ఓ తల్లి! అతిదయా
శీతలా! వందనము
వందనము నాయంత గ్రుచ్చీ దినదినము
కుంద మాలికనిత్తు తెచ్చీ; కుశలమా
లంకృతము నిరుకైవ
ప్రణయ పతితో నైక్య
భావమ్ము నీక్షించి
వాంఛింతు నీపాటి.
నీ జీవితమ్మునకు
నిత్యమ్ము వార్ధితో
కలయికయె కదా కారణమ్మా సదులెన్ని
పోలి యమరకయె సంద్రమ్మా నాకుపతి
అంతికమ్మున నుంట
అడవి పూదోటయయె
వికృతాస్య రాక్షసులు
వేసగాంద్రయిరినగ."

సి. హెచ్. ఆచార్యా.

మహారథి కర్ణ

రచయిత :
శ్రీ కార్యమపూడి నాగభూషణం
ప్రతులకు : రచయిత, పలపర్ల,
ఒంగోలు తాలూకా.
వెల 1 రూపాయి.

ఎన్నిమార్లు చదివినా తనివితీరని మహా గ్రంథం భారతం. అంతటి మహా భారత గాథకు కర్ణుడు మూలస్తంభం.

కర్ణునిజీవితం చాలా బాధాపూరితం. పుట్టిన నాడే కన్న తల్లిచే పరిత్యజింపబడినాడు.

గురువుల శాపాలకు గురిఅయ్యాడు. అయినా సహజ సౌర్యాభిరాముడైన కర్ణుడు చలింపలేదు.

విధిబలీయమైన కౌరవ పాండవయుద్ధంలో దుర్యోధనునుకి కుడిభుజంగా నిలిచి ఆపగాసుతునిచేత అర్థరథునిగా నియమింపబడ్డాడు కర్ణుడు. కురుక్షేత్ర సంగ్రామంలో 16 వ నాటి యుద్ధానికి వాహినీపతియై "కాలభైరవు భంగి సంగ్రామభూమినిలిచి, పార్థునంతటి వీరుని భంగపరచి" పాండవ బలాలను చీల్చి చెండాడి, తుదకు కుతంత్రాలకులోనై వీర స్వర్గ మలంకరించాడు.

ఆపగాసుతునిచేత అర్థరథునిగా నిర్ణయింపబడిన కర్ణుడుని రచయిత మహారథుడుగా తీర్చి దిద్దిన కర్ణునిపాత్రకు న్యాయంచేకూర్చారు రచయిత.

ఆ వీరుని గాధను రచయిత ద్రోణుని వధనుంచి రెండు భాగాలుగా రచించారు.

"అరదము క్రుంగిపోయినది, యాగుము
ఒక్క-క్షణమ్ము బాహులన్..."

అనేపద్యంలో కర్ణుని దైన్యస్థితిని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు రచయిత.

మొత్తంమీద ఈకావ్యం మెత్తని పదాలతో, తీయని భావాలతో ఎక్కడా కుంటుపడని శైలితో మహారథ గమనంతో సాగిపోతూ సాహితీ ప్రియులకు మనోల్లాసాన్ని చేకూరుస్తుంది.

విశ్వగీత

రచయిత :

డాక్టరు పొందూరు సాంబమూర్తి

ప్రతులకు : రచయిత
"మూర్తి కళావిహార్" ఆమదాలవలస
(శ్రీకాకుళం జిల్లా)

ఈ విశ్వగీత పద్య కావ్యానికి వస్తువు మన సంఘం, సంఘంలో మూఢ విశ్వాసాల పట్ల కవి బాధ.

సంఘాన్ని విమర్శించిన వారిలో ప్రథముడు వేమన. ఆయన 'ఆటవెలదు' లలో చక్కని తెలుగు జాతీయాలతో తన భావాలను వెలిబుచ్చాడు.

ఈ రచయిత ఆ విధంగానే తేటగీతులను ఆశ్రయించాడు. వీరి తేటగీతి పద్యాల శైలికొక ఉదాహరణ :

"వ్రాలిపోయెను వాని నేత్రాలనుండి
కాంతులున్నవి స్వార్థలోకాలపైన
అతనిజీవిత సౌందర్యమందు–శోభ
యన్నదేవంక లవలేశమెన్నలేదు."

కవిలో జాతీయతాభావం, దేశభక్తి ముమ్మరంగా కనిపిస్తాయి.

శబ్ద ప్రయోగంలో రెండుమూడు అపశబ్దలున్నప్పటికీ భావం మాత్రం దెబ్బతినదు

బెర్నార్డ్‌షా ఒకసారెప్పుడో అన్నారు- 20 వ శతాబ్దంలో యువకులలో నిరాశా నిస్పృహలు తాండవిస్తుంటాయని– జ్యోతిషంనేటి యువకవుల విషయంలో బాగా నిజమైంది. ఈ రచయిత విషయంలో కూడా అదే నిజమైంది.

ప్రపంచమంటే విసిగివేసారి చివరకు ఈ విధంగా అంటాడు. రచయిత–

"రమ్ము పోవు చనంతవిశ్వమ్ము నుండి
వెతల లోనున్న గుండెలు బతికి బట్ట
శాంతిసౌఖ్యమ్ము లెటనుండి సాగునటక

"ఆనంద వర్ధన

రచయితలు

డాక్టర్ నీలం సంజీవరెడ్డి, ముఖ్యమంత్రి–ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైద్రాబాద్.

శ్రీ జి. జాషువా–కవికోకిల, గోపాలకృష్ణయ్యతోట, గుంటూరు, గుంటూరు జిల్లా.

డాక్టర్ యం. చెన్నారెడ్డి, ప్రణాళికలు – పంచాయతీరాజ్య శాఖల మంత్రి – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – హైద్రాబాద్.

శ్రీ చల్లా రాధా కృష్ణశర్మ, ఎం. ఎ., తండియార్పేట – మద్రాసు.

శ్రీ టి. వి. సుబ్బారావు, తిరుపతి – చిత్తూరు జిల్లా.

శ్రీ త్రిపురనేని సుబ్బారావు, మలక్‌పేట కాలనీ – హైద్రాబాద్.

శ్రీ పి. ఎ. రాజు, ఎం. ఎ. లెక్చరర్ – మహారాజ కళాశాల – విజయనగరం.

శ్రీ శంకర శ్రీరామరావు, ఏలూరు – పశ్చిమగోదావరి జిల్లా.

శ్రీ మారేమళ్ళ నాగేశ్వరరావు, ఆంధ్ర ప్రధానాచార్యుల ఎ. సి. కాలేజి, గుంటూరు – గుంటూరు జిల్లా.

శ్రీ చక్రవర్తి రంగస్వామి, హిమాయత్‌నగర్ – హైద్రాబాద్.

శ్రీ అరిపిరాల విశ్వం, ఎం. ఎ. లెక్చరర్ – న్యూ సైన్సు కాలేజీ హైద్రాబాద్.

శ్రీ ఇందుపల్లి సత్యవర్ధనరావు, బి. ఎ. భట్నవిల్లి – కృష్ణా జిల్లా

శ్రీ బోయి భీమన్న, మధుర కవి – ట్రాన్స్‌లేటర్ – ఆంధ్రప్రదే ప్రభుత్వం – హైద్రాబాద్.

గ్రంథ సమీక్ష

డాక్టర్ దివాకర్ల వెంకటావధాని, బర్కత్‌పురా క్వార్టర్ హైద్రాబాద్.

శ్రీ సి. హెచ్. ఆచార్య, జాంబాగ్ – హైద్రాబాద్.

శ్రీ ఆనందవర్ధన, హైద్రాబాద్.

Edited & Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad-1
Printed at Yuva Press, Public Garden Road, Hyderabad — 1.

